FOR ADS.......
ఆకాంక్ష
CONTACT :
8333818121

తొలి ఆకాంక్ష
తెలుగు సంచలన దిన పత్రిక TGTEL/25/A1964

విలేకరులు కావలెను
ప్రజా సమస్యల పరిష్కార మార్గాలనే లక్ష్యంగా ఉన్నత ఆశయంతో ముందుకు పోతున్న తొలి ఆకాంక్ష దినపత్రికలో భువనగిరి, జయశంకర్ భూపాలపల్లి, పెద్దపల్లి, జగిత్యాల, జనగాం, మహబూబ్ నగర్, నల్గొండ, ఖమ్మం, ఆదిలాబాద్, కామారెడ్డి, యాదాద్రి మేడ్చల్ మల్కాజిగిరి, వరంగల్, జోగులాంబ గద్వాల్ , సూర్యాపేట, జిల్లా కేంద్రాలకు స్టాఫ్ రిపోర్టర్స్‌తో పాటు ...
అన్ని జిల్లాలోని నియోజక వర్గ కేంద్రాలకు విలేకరులు కావలెను ..
సంప్రదించండి...
8333818121
ఎడిటర్ పెనగొండ సతీష్
ఆకాంక్ష akankshanews.com

ప్రచురణ : తెలంగాణ సంపుటి : 01 సంచిక :179 ఎడిటర్ : పెనగొండ సతీష్ పేజీలు : 08, వెల. 5రూ/ గురువారం- 19 - ఫిబ్రవరి - 2026

# విద్యార్థులకు పోలవరం ప్రాజెక్టు వీక్షించే అవకాశం



**అసెంబ్లీలో ప్రజా సమస్యలపై జరుగుతున్న చర్చలను ఆసక్తిగా తిలకించిన విద్యార్థులు**

**వారి ప్రశ్నలకు ఓపిగ్గా సమాధానాలిచ్చిన స్పీకర్ అయ్యన్న**

**ఉద్యోగాలకే పరిమితం కాకుండా రాజకీయాల్లోకి రావాలని యువతకు పిలుపు**

అమరావతి : అసెంబ్లీని సందర్శించిన విద్యార్థులకు త్వరలో పోలవరం ప్రాజెక్టును కూడా వీక్షించే అవకాశం కల్పిస్తామని స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు ప్రకటించారు. మిగతా..2లో

# తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో సత్తా చాటిన బీసీలు!



**తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో 61 శాతానికి పైగా సీట్లు గెలుచుకున్న బీసీలు**

**రిజర్వేషన్లను మించి జనరల్ స్థానాల్లోనూ బీసీ అభ్యర్థుల భారీ విజయం**

**ఇది బీసీల రాజకీయ చైతన్యానికి నిదర్శనమని బీసీ కమిషన్ హర్షం**

**42 శాతం బీసీ రిజర్వేషన్ బిల్లును ఆమోదించాలని కేంద్రానికి కమిషన్ విజ్ఞప్తి**

హైదరాబాద్: తెలంగాణలో ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో వెనుకబడిన వర్గాలు (బీసీలు) అద్భుతమైన విజయాన్ని నమోదు చేశాయి. రాష్ట్రవ్యాప్తంగా 61 శాతానికి పైగా వార్డులు, డివిజన్లను బీసీ అభ్యర్థులు కైవసం చేసుకున్నారు. వాస్తవానికి మున్సిపాలిటీల్లో బీసీలకు 28.22 శాతం, కార్పొరేషన్లలో 35.25 శాతం సీట్లు మాత్రమే రిజర్వ్ చేయగా, రిజర్వేషన్లను మించి జనరల్ స్థానాల్లోనూ వారు గెలుపొందడం విశేషం. ఈ ఫలితాలపై బీసీ కమిషన్ చైర్మన్ మిగతా..2లో

## మేం మళ్లీ అధికారంలోకి వచ్చాక కాంగ్రెస్ నేతలు వడ్డీతో సహా చెల్లించుకోవాల్సి ఉంటుంది



- మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ అరెస్టుపై కేటీఆర్ తీవ్ర ఆగ్రహం
- క్యాతన్‌పల్లి మున్సిపాలిటీని కైవసం చేసుకునే కుట్రలో భాగమే ఈ అరెస్ట్ అని ఆరోపణ
- అధికార పార్టీకి కొందరు పోలీసులు తొత్తులుగా మారారని విమర్శ
- సుమన్‌ను బేషరతుగా విడుదల చేయాలని ప్రభుత్వానికి డిమాండ్

# పారదర్శకంగా ఇందిరమ్మ ఇళ్లను అందజేస్తాం

**హైదరాబాద్ జిల్లాలో అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లు అందజేస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ భరోసా కల్పించారు.**

**1 కింద 4,800 మందికి రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణానికి నిధులు ఇచ్చామని స్పష్టం చేశారు.**



హైదరాబాద్, ఫిబ్రవరి 18 : హైదరాబాద్ జిల్లాలో అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లు అందజేస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ భరోసా కల్పించారు. సచివాలయంలో హైదరాబాద్‌లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికపై మంత్రులు పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్ ఇవాళ(బుధవారం) సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడారు. ాా1 కింద 4,800 మందికి రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణానికి నిధులు ఇచ్చామని స్పష్టం చేశారు. కింద హైదరాబాద్ నుంచి 4.22 లక్షలకు పైగా దరఖాస్తులు వచ్చాయని మంత్రి పొన్నం ప్రభాకర్ వివరించారు. భాగ్యనగరంలో స్థలాల సేకరణతో ++5 నుంచి ++10 వరకు ఇళ్ల నిర్మాణ ప్లాన్ చేస్తున్నామన్నారు. ఈ క్రమంలో పెండింగ్ డబుల్ బెడ్ రూం ఇళ్ల పనులు వెంటనే పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అలాగే, మురికివాడల్లో ఇందిరమ్మ మోడల్ కాలనీల ఏర్పాటుపై మంత్రులు సమీక్షించారు. ఇందిరమ్మ ఇళ్లను పారదర్శకంగా అందజేస్తామని.. నిజమైన లబ్ధిదారుల ఎంపికే తమ ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు.

## రోడ్ల అభివృద్ధికి పారదర్శకంగా నిధులను వినియోగించాలి

- తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిలో రోడ్లు, భవనాల శాఖ కీలక పాత్ర పోషిస్తోందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వ్యాఖ్యానించారు.
- స్పష్టమైన ప్రణాళికతో వార్షిక బడ్జెట్ అంచనాలు ఉండాలని అధికారులను ఆదేశించారు.



హైదరాబాద్, ఫిబ్రవరి 18 : రోడ్లు, భవనాల శాఖ 2026- 27 వార్షిక బడ్జెట్ ప్రతిపాదనలపై తెలంగాణ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సచివాలయంలో ఇవాళ(బుధవారం) సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి స్పెషల్ సీఎస్ వికాస్ రాజ్, ఈఎన్సీలు మోహన్ నాయక్, జయ భారతి, సీఈలు శ్రీనివాస్ రెడ్డి, రాజేశ్వర్ రెడ్డి, వసంత్ నాయక్, బీవీ రావు, లింగారెడ్డి, నర్సింగ్‌రావు, పలువురు ఆర్ అండ్‌బీ అధికారులు హాజరయ్యారు. గత ఏడాది బడ్జెట్, పనుల పురోగతి, విడుదలైన నిధులపై కూలంకషంగా మంత్రి కోమటిరెడ్డి చర్చించారు. మిగతా..2లో

## రాజ్యాంగాన్ని కచ్చితంగా మార్చాల్సిందే కేంద్రంపై సీఎం స్టాలిన్ ఫైర్



- రాష్ట్రాల స్వయంప్రతిపత్తి కల్పించేలా సమాఖ్య వ్యవస్థను బలోపేతం చేసేందుకు రాజ్యాంగ సవరణను అవసరమని చెప్పిన సీఎం స్టాలిన్

ఢిల్లీ : భారత రాజ్యాంగాన్ని సవరించాలంటూ డిమాండ్ చేశారు తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్. రాష్ట్రాల స్వయంప్రతిపత్తి కల్పించేలా సమాఖ్య వ్యవస్థను బలోపేతం చేసేందుకు రాజ్యాంగ సవరణను అవసరమని అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా నిర్మాణాత్మక పునర్ నిర్మాణం చేయాలని పిలుపునిచ్చారు. కేంద్రం అన్ని అధికారాలను తన వద్దే పెట్టుకుందని ఆరోపించారు. కేంద్ర-రాష్ట్ర సంబంధాలపై జస్టిస్ కురియన్ జోసెఫ్ కమిటీ నివేదిక

## ఏఐ సమ్మిట్ లో చైనా రోబో మోదీ సర్కార్ భారత్ పరువు తీసింది

- మేక్ ఇన్ ఇండియా అని చెప్పి చైనా రోబోలను ప్రదర్శిస్తారా
- మోదీ ప్రభుత్వం దేశ పరువు తీసింది
- అంతర్జాతీయంగా నవ్వులపాలయ్యామని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆగ్రహం




అమరావతి : ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ సదస్సులో చైనాకు చెందిన రోబోలను భారతీయ ఆవిష్కరణలుగా ప్రదర్శించడంపై కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సదస్సును ఆయన 'పబ్లిసిటీ స్టంట్'గా అభివర్ణించారు. భారతీయ ప్రతిభను, డేటాను వినియోగించుకోవాల్సింది పోయి, చైనా ఉత్పత్తులను ప్రదర్శిస్తూ, భారతీయ డేటాను అమ్మకానికి పెట్టారని ఆయన మోదీ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. దిల్లీలోని భారత్ మండపంలో జరుగుతున్న ఏఐ సదస్సులో గల్గోటియాస్ యూనివర్సిటీ ఏర్పాటు చేసిన స్టాల్ వివాదానికి కేంద్ర బిందువుగా మారింది. గల్గోటియాస్ యూనివర్సిటీ తమ స్టాల్‌లో ఒక రోబోటిక్ కుక్కను ప్రదర్శించింది. దానికి 'ఓరియన్' అని పేరు పెట్టింది. అయితే, టెక్ నిపుణులు, విమర్శకులు అది భారతీయ ఆవిష్కరణ కాదని పసిగట్టారు. అది చైనాకు చెందిన 'యూనిట్రీ గో2' రోబో అని, దానిపై ఉన్న లేబుల్ మార్చి సొంత ఆవిష్కరణగా చెప్పుకుంటున్నారని ఆరోపణలు వెల్లువెత్తాయి. మిగతా..2లో

## రైతులను పెళ్లి చేసుకునే మహిళలకు ప్రోత్సాహకాలు ఇవ్వాలి

- బ్యాచిలర్ రైతుల పెళ్లిళ్లకు ప్రత్యేక స్కీం- వారిని పెళ్లాడే యువతుల పేరిట రూ.10 లక్షల ఎఫ్‌డీ
- ప్రభుత్వ పూచీకత్తుతో వ్యాపార రుణాలు
- కర్ణాటక సీఎంకు రైతు సంఘాల వినతి

### సీఎంకు రైతు సంఘాల వినతి



ఢిల్లీ : కర్ణాటకలోని రైతు సంఘాలు సరికొత్త డిమాండ్‌ను తెరపైకి తెచ్చాయి. యువ రైతులను పెళ్లి చేసుకునే మహిళలకు ఆర్థిక ప్రోత్సాహకాలను అందించాలని అవి కోరుతున్నాయి. ప్రస్తుతం బ్యాచిలర్ రైతులు ఆర్థికపరమైన అస్థిరతను, అనిశ్చితిని ఎదుర్కొంటున్నందున, వారిని పెళ్లి చేసుకునే యువతులకు నగదు పారితోషికాలను ఇవ్వాలని రాష్ట్ర సర్కారుకు విన్నవిస్తున్నాయి. ఈ మేరకు ఒక విజ్ఞాపన పత్రాన్ని (మెమొరాండం) సీఎం సిద్ధరామయ్యకు రైతు సంఘాల నేతలు మంగళవారం రోజు (ఫిబ్రవరి 17న) అందజేశారు. త్వరలో ప్రవేశపెట్టనున్న రాష్ట్ర బడ్జెట్‌పై చర్చించేందుకు రైతు సంఘాల నేతలతో బెంగళూరులోని విధాన సౌధలో సీఎం సిద్ధరామయ్య సమావేశమయ్యారు. ఆసందర్భంగానే సీఎంకు వినతిపత్రాన్ని ఇచ్చామని రైతు నేతలు వెల్లడించారు. ప్రస్తుతం మిగతా..2లో

## కల్తీ నెయ్యి అంశంపై చర్చకు సిద్ధం... ఆధారాలు ఉంటే అసెంబ్లీలో చర్చకు రండి



- రసాయనాలతో నెయ్యి తయారు చేశారని సిట్ రిపోర్ట్ ఇచ్చిందన్న అనిత
- పింక్ డైమండ్ పేరుతో గతంలో సభా సమయం వృథా చేశారని మండిపాటు
- సాక్షిలో రాసే విషయాలనే వైసీపీ నేతలు మాట్లాడుతుంటారని ఎద్దేవా

అమరావతి : తిరుమల లడ్డూలోని కల్తీ నెయ్యి వ్యవహారంపై సభలో చర్చించాలని వైసీపీ పట్టుబడుతున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో హోం మంత్రి అనిత మాట్లాడుతూ కల్తీ నెయ్యి వ్యవహారంపై అసెంబ్లీలో చర్చకు తాము సిద్ధమని అన్నారు.

# జైలు నుంచి విడుదలైన 'ఐబొమ్మ' రవి..




- సినిమా పైరసీ కేసులో ఐబొమ్మ రవికి మంగళవారం తెలంగాణ హైకోర్టు బెయిల్ మంజూరు చేసిన సంగతి తెలిసిందే.
- బుధవారం అతడు చంచల్ గూడ జైలు నుంచి విడుదల అయ్యాడు.

హైదరాబాద్: సినిమా పైరసీ కేసులో ఐబొమ్మ రవి అలియాస్ ఇమంది రవికి నిన్న(మంగళవారం) తెలంగాణ హైకోర్టు బెయిల్ మంజూరు చేసిన సంగతి తెలిసిందే. ఈ రోజు (బుధవారం) అతడు చంచల్ గూడ జైలు నుంచి విడుదల అయ్యాడు. నిన్న కోర్టు అతడికి షరతులతో కూడిన బెయిల్ ఇచ్చింది. బెయిల్ ఆర్డర్ కాపీలో ఏముందంటే.. 'హైదరాబాద్ విడిచి వెళ్లరాదు. సాక్ష్యాలను తారుమారు చేయడం వంటి చర్యలకు పాల్పడరాదు. వ్యక్తిగత బాండ్, పూచీకత్తులు సమర్పించాలి. ప్రతిరోజు ఉదయం 11 గంటలకు సైబర్ క్రైం పోలీస్ స్టేషన్ (సీసీఎస్)లో హాజరుకావాలి. అనుమతి లేకుండా కాపీరైట్ కంటెంట్ అప్‌లోడ్, షేర్ చేసే వెబ్‌సైట్లు, సోషల్ మీడియా ప్లాట్‌ఫార్మ్‌లతో సంబంధం ఉండరాదు. వీపీఎన్, ప్రాక్సీ వంటి ఎన్‌క్రిప్టెడ్ ప్లాట్ ఫామ్‌లు ఉపయోగించరాదు. అవసరమైతే డిజిటల్ పరికరాల ఫోరెన్సిక్ పరీక్షకు సహకరించాలి. షరతులు ఉల్లంఘిస్తే బెయిల్ రద్దు చేసి ప్రాసిక్యూషన్ చేసేందుకు స్వేచ్ఛ ఇస్తాము' అని నిందితుడు ఐ బొమ్మ రవికి తెలంగాణ హైకోర్టు స్పష్టం చేసింది.. మిగతా..2లో

## మదనపల్లిలో బాలికపై జరిగిన అఘాయిత్యంపై వైఎస్ షర్మిల తీవ్ర విచారం

- గంజాయి మత్తులోనే ఈ దారుణం జరిగిందని ఆరోపణ
- డ్రగ్స్‌ను అరికట్టడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని విమర్శ
- గంజాయిపై ఉక్కుపాదం మోపాలని సీఎం చంద్రబాబుకు డిమాండ్
- బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని విజ్ఞప్తి



అమరావతి : మదనపల్లెలో ఏడేళ్ల బాలికపై జరిగిన హత్యాచారం అత్యంత దారుణమని, గంజాయి మత్తులో ముక్కుపచ్చలారని పసిబిడ్డపై జరిగిన ఈ పైశాచిక ఘటన తనను తీవ్రంగా కలచివేసిందని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తెలిపారు. ఈ దారుణ ఘటన పట్ల కాంగ్రెస్ పార్టీ పక్షాన తీవ్ర విచారం వ్యక్తం చేస్తున్నామని, బాలిక కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నామని పేర్కొన్నారు. ఈ మేరకు ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో మాదకద్రవ్యాలు ఏరులై పారుతున్నాయనడానికి మదనపల్లె ఘటనే నిదర్శనమని షర్మిల ఆరోపించారు. డ్రగ్స్, గంజాయిపై డేగ కన్ను పెట్టామని, ఉక్కుపాదం మోపుతామని కూటమి ప్రభుత్వం చెప్పుకో వడమంతా ఆర్భాటమేనని విమర్శించారు. మాదక ద్రవ్యాల నిర్మూలనపై ప్రభుత్వం చేస్తున్న ప్రచారమంతా తూతూ మంత్రంగానే మిగిలిపోయిందని ఆమె దుయ్యబట్టారు.

మొదటి పేజి తరువాయి

## జైలు నుంచి విడుదలైన 'ఐబొమ్మ' రవి..

కాగా, సినిమా పైరసీ, కాపీ రైట్, ఐటీ యాక్ట్‌తో పాటు మనీ లాండరింగ్ సహా.. మొత్తం ఐదు కేసుల్లో ఇమంది రవి నిందితుడిగా ఉన్నాడు. అతడు రెండు రకాలుగా సినిమా ప్రింట్‌లను కొనుగోలు చేసేవాడు. నార్మల్ ప్రింట్‌కు 100 డాలర్లు, హెచ్‌డీ ప్రింట్‌కు 200 డాలర్లు చెల్లించేవాడు. అతడికి సంబంధించిన ఏడు ఖాతాలను పోలీసులు గుర్తించారు. వాటిలో రూ.13.40 కోట్ల నగదు ఉన్నట్లు కనుగొన్నారు. బెట్టింగ్ యాడ్‌ల ద్వారా రూ.1.78 కోట్లు కూడబెట్టినట్లు గుర్తించారు. ఇక ఐబొమ్మ రవి సోదరి చంద్రికకు రూ. 90 లక్షల నగదు పంపినట్లు పోలీసుల విచారణలో తేలింది.

## మదనపల్లిలో బాలికపై జరిగిన అఘాయిత్యంపై వైఎస్ షర్మిల తీవ్ర విచారం

ప్రభుత్వ వైఫల్యం కారణంగానే ఇలాంటి దారుణాలు జరుగుతున్నాయని విమర్శించారు. బాధిత బాలిక కుటుంబాన్ని కూటమి ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని షర్మిల డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి పైశాచిక ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం తక్షణమే కఠిన చర్యలు చేపట్టాలని కోరారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ విషయంలో వ్యక్తిగతంగా దృష్టి సారించాలని, గంజాయి, డ్రగ్స్ సరఫరాపై ఉక్కుపాదం మోపడంతో పాటు నిరంతరం నిఘా వ్యవస్థను పటిష్ఠం చేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు. మాదకద్రవ్యాల మహమ్మారి నుంచి రాష్ట్రాన్ని కాపాడటంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించాలని షర్మిల స్పష్టం చేశారు.

## కల్తీ నెయ్యి అంశంపై చర్చకు సిద్ధం... ఆధారాలు ఉంటే అసెంబ్లీలో చర్చకు రండి

చర్చకు ఆధారాలతో రావాలని వైసీపీకి సవాల్ విసిరారు. ప్రజాహితం కోసం ఎలాంటి చర్చలకైనా తాము సిద్ధమని అన్నారు. అసెంబ్లీ మీడియా పాయింట్‌లో మాట్లాడుతూ ఆమె ఈ మేరకు సవాల్ విసిరారు. అది నెయ్యి కాదు, రసాయనాల మిశ్రమమని సిట్ రిపోర్ట్ తేల్చిందని తెలిపారు. చర్చకు సిద్ధమని సభలోనే మంత్రి అచ్చెన్నాయుడు ప్రకటించారని గుర్తుచేశారు. దేవుడంటే వైసీపీ సభ్యులకు భక్తిభావం లేదని... పాల సేకరణ కూడా లేని సంస్థకు నెయ్యి సరఫరా కాంట్రాక్టును ఇచ్చారని అనిత మండిపడ్డారు. ఆ నెయ్యిలో ఎలాంటి రసాయనాలు కలిపారో కూడా సభలో చర్చిద్దామని అన్నారు. గతంలో పింక్ డైమండ్ పేరుతో సభా సమయాన్ని వృథా చేశారని... అధికారుల విచారణలో అసలు పింక్ డైమండే లేదని తేలిందని చెప్పారు. వేంకటేశ్వరస్వామితో పెట్టుకోవద్దని హెచ్చరించారు. సాక్షి పేపర్ రాసే విషయాలనే వైసీపీ నేతలు మాట్లాడుతుంటారని అనిత దుయ్యబట్టారు. వైసీపీ హయాంలో యాడ్స్ రూపంలో సాక్షికి రూ. 600 కోట్ల ప్రజాధనాన్ని చెల్లించారని విమర్శించారు. మదనపల్లి చిన్నారి హత్య కేసు నిందితుడు కులవర్ధన్ ఆత్మహత్య చేసుకున్నాడని... తప్పు చేశాడు కాబట్టే మనస్తాపంతో ఆత్మహత్య చేసుకున్నాడని అన్నారు.

## మేం మళ్లీ అధికారంలోకి వచ్చాక కాంగ్రెస్ నేతలు వడ్డీతో సహా చెల్లించుకోవాల్సి ఉంటుంది

హైదరాబాద్: బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌ను పోలీసులు అరెస్ట్ చేయడంపై ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఇది పూర్తిగా అక్రమ అరెస్ట్ అని, కాంగ్రెస్ ప్రభుత్వం సాగిస్తున్న అధికార దుర్వినియోగానికి పరాకాష్ఠ అని ఆయన మండిపడ్డారు. మంచిర్యాల జిల్లాలోని క్యాతన్‌పల్లి మున్సిపాలిటీని అడ్డదారుల్లో కైవసం చేసుకోవాలన్న దుర్మార్గపు ఆలోచనతోనే కాంగ్రెస్ ఈ కుట్రకు తెరలేపిందని కేటీఆర్ తీవ్రంగా ఆరోపించారు. కేవలం రాజకీయ లబ్ధి కోసం ఇంతటి దిగజారుడు రాజకీయాలకు పాల్పడటం సిగ్గుచేటని విమర్శించారు. ప్రజల ఆశీర్వాదంతో బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి రావడం ఖాయమని, అప్పుడు కాంగ్రెస్ పార్టీ నేతలు చేస్తున్న ఈ దుర్మార్గాలన్నింటికీ వడ్డీతో సహా చెల్లించుకోవాల్సి వస్తుందని కేటీఆర్ తీవ్ర స్వరంతో హెచ్చరించారు. ఈ విషయాన్ని కాంగ్రెస్ నేతలు గుర్తుంచుకుంటే మంచిదని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ స్పందిస్తూ... "క్యాతన్‌పల్లి మున్సిపాలిటీలో బీఆర్ఎస్‌కు స్పష్టమైన మెజారిటీ ఉంది. అయినా సరే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి వివేక్ కలిసి దౌర్జన్యంగా దాన్ని చేజిక్కించుకోవాలని చూస్తున్నారు. ఈ కుట్రలో భాగంగానే సుమన్‌పై అక్రమ కేసులు బనాయించి, ఇవాళ దుర్మార్గంగా అరెస్ట్ చేయించారు. ప్రభుత్వ అప్రజాస్వామిక చర్యలకు వ్యతిరేకంగా క్యాతన్‌పల్లి ప్రజలు సంపూర్ణ బంద్ పాటించి నిరసన తెలిపినా ఈ ప్రభుత్వానికి బుద్ధి రాలేదు" అని విమర్శించారు. కొందరు పోలీసు అధికారులు అధికార పార్టీకి తొత్తులుగా వ్యవహరిస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు. వారు తమ వైఖరి మార్చుకోకపోతే భవిష్యత్తులో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. అక్రమ కేసులో అరెస్ట్ చేసిన బాల్క సుమన్‌ను ప్రభుత్వం తక్షణమే బేషరతుగా విడుదల చేయాలని బీఆర్ఎస్ పార్టీ తరపున ఆయన డిమాండ్ చేశారు.

## రోడ్ల అభివృద్ధికి పారదర్శకంగా నిధులను వినియోగించాలి

ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు.

అభివృద్ధిలో రోడ్లు, భవనాల శాఖది కీలక పాత్ర..

తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిలో రోడ్లు, భవనాల శాఖ కీలక పాత్ర పోషిస్తోందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వ్యాఖ్యానించారు. స్పష్టమైన ప్రణాళికతో వార్షిక బడ్జెట్ అంచనాలు ఉండాలని అధికారులను ఆదేశించారు. రీజినల్ రింగ్ రోడ్డు లాంటి గేమ్ చేంజర్ ప్రాజెక్టులపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని దిశానిర్దేశం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో 2047 రైజింగ్ తెలంగాణ నినాదంలో రాష్ట్ర రోడ్ నెట్‌వర్క్ అభివృద్ధి.. అత్యంత కీలకమని చెప్పుకొచ్చారు. సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్ర రోడ్ నెట్‌వర్క్ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టారన్నారు. 'హ్యామ్' రోడ్ల నిర్మాణంతో రాష్ట్రవ్యాప్తంగా అద్దం లాంటి రోడ్లు నిర్మించబోతున్నామని తెలిపారు.

కేంద్ర మంత్రులను కలుస్తా..

ఇప్పటికే ఉన్న బాలారిష్టాలు దాటేందుకు అన్ని రకాల ప్రయత్నాలు చేశామని.. అధికారులు కూడా మనసుపెట్టి పనిచేయాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మార్గనిర్దేశం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధుల వాటాపై కన్ఫ్యూజన్ లేకుండా పారదర్శకంగా వ్యవహరించాలని సూచించారు. హైదరాబాద్ - విజయవాడ (ఎన్‌హెచ్ 65) 8వ లైన్ విస్తరణ పనులు కూడా త్వరలో ప్రారంభం కానున్నాయని వివరించారు. ఈ పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని కేంద్రమంత్రి నితిన్ గడ్కరీని కలిసి మరోసారి కోరతామని అన్నారు. తెలుగు రాష్ట్రాల ప్రజలకు ఎంతో ఉపయోగకరమైన రోడ్డు ఇదని... ఇది పూర్తయితే హైదరాబాద్ నుంచి విజయవాడ రెండున్నర గంటల్లో చేరుకోవచ్చని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధిలో భాగంగా కేంద్రప్రభుత్వం సహకారం అందించే ఆయా ప్రాజెక్టుల్లో వేగం పెంచాలన్నారు. ఈ విషయంలో తాను కేంద్ర మంత్రులను కలుస్తానని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు.

## తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో సత్తా చాటిన బీసీలు!

జి. నిరంజన్‌తో పాటు సభ్యులు రాపోలు జయప్రకాశ్, తిరుమలగిరి సురేందర్, రంగూ బాలలక్ష్మి హర్షం వ్యక్తం చేశారు. బీసీ వర్గాల్లో పెరిగిన రాజకీయ చైతన్యానికి ఈ విజయాలే స్పష్టమైన నిదర్శనమని వారు అభిప్రాయపడ్డారు. ఫిబ్రవరి 11న 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లకు ఎన్నికలు జరగ్గా, 13న ఫలితాలు వెలువడిన సంగతి తెలిసిందే. ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికల్లోనూ బీసీ అభ్యర్థులు 52.75 శాతం సీట్లు గెలుచుకున్నారని కమిషన్ గుర్తుచేసింది. ఇదే స్ఫూర్తితో త్వరలో జరగనున్న జడ్పీటీసీ, ఎంపీటీసీ, జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లోనూ బీసీలు భారీ సంఖ్యలో గెలుపొందుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్ర జనాభాలో బీసీలు 56.33 శాతం ఉన్నారని, వారికి 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రాష్ట్ర అసెంబ్లీ చేసిన చట్టం కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉందని కమిషన్ పేర్కొంది. ఈ రిజర్వేషన్లను వ్యతిరేకిస్తూ కొందరు కోర్టులను ఆశ్రయించారని తెలిపింది. తాజా ఎన్నికల ఫలితాల నేపథ్యంలో, 42 శాతం రిజర్వేషన్ల బిల్లును 9వ షెడ్యూల్‌లో చేర్చి వెంటనే ఆమోదించాలని కేంద్ర ప్రభుత్వాన్ని బీసీ కమిషన్ కోరింది. అలాగే, కోర్టులో కేసులు వేసిన వారు వాటిని ఉపసంహరించుకుని బీసీల అభ్యున్నతికి సహకరించాలని విజ్ఞప్తి చేసింది.

## గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్ తో మోదీ భేటీ

గూగుల్ తో కలిసి భారత విద్యార్థులు, నిపుణులు కలిసి పనిచేసే అవకాశం- భేటీలో దీనిపైనే ప్రధానంగా చర్చ!

దేశ రాజధాని ఢిల్లీలో జరుగుతున్న 'ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026' సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ బుధవారం పలువురు ప్రపంచ దేశాధినేతలు, పారిశ్రామిక దిగ్గజాలతో వేర్వేరుగా భేటీ అయ్యారు. ముఖ్యంగా గూగుల్ సీఈఓ గూగుల్, దాని మాతృసంస్థ ఆల్ఫాబెట్ ఇంక్ సీఈఓ సుందర్ పిచాయ్ తో సమావేశమయ్యారు. కృత్రిమ మేధ (ఏఐ) రంగంలో భారత్ చేస్తున్న కృషి గురించి, అలాగే భారతీయ విద్యార్థులు, నిపుణులతో కలిసి గూగుల్ ఈ ఏఐ రంగంలో ఎలా ముందుకు సాగవచ్చనే అంశంపై ఆయనతో చర్చించారు. ఈ భేటీ తరువాత ప్రధాని మోదీ ఎక్స్ లో ఓ పోస్టు పెట్టారు.

"ఢిల్లీలో జరుగుతున్న ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ సందర్భంగా గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్ ను కలవడం సంతోషంగా ఉంది. ఏఐ రంగంలో భారత్ చేస్తున్న కృషి గురించి, అలాగే మన ప్రతిభావంతులైన విద్యార్థులు, నిపుణులు గూగుల్ తో కలిసి పనిచేసే అవకాశాల గురించి చర్చించాం."

– ప్రధాని మోదీ

ఫిన్లాండ్ ప్రధానితో చర్చలు అలాగే ప్రధాని మోదీ, ఫిన్లాండ్ ప్రధాని పెటెరి ఒర్పొతో ద్వైపాక్షిక చర్చలు జరిపారు. భారత్ -ఈయూ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందానికి (ఎఫ్ టీఏ) మద్దతు ఇస్తున్న ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఒప్పందం భారత్ -ఈయూ సంబంధాల్లో ఒక స్వర్ణయుగాన్ని ప్రారంభిస్తుందని మోదీ ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. రానున్న కాలంలో భారత్ , ఫిన్లాండ్ ల వాణిజ్యాన్ని రెట్టింపు చేయడంతోపాటు, 6జీ టెక్నాలజీ, క్లీన్ ఎనర్జీ, బయో ఫ్యూయెల్స్ లాంటి భవిష్యత్ టెక్నాలజీల్లో పరస్పర సహకారాన్ని పెంచుకోవాలని నిర్ణయించారు.

స్పెయిన్ అధ్యక్షుడితో మోదీ భేటీ స్పెయిన్ అధ్యక్షుడు పెడ్రో సాంచెజ్ తోనూ ప్రధాని మోదీ సమావేశమయ్యారు. ఈ భేటీలో ఇరుదేశాలు రక్షణ, భద్రత, సాంకేతిక రంగాల్లో సహకారాన్ని మరింత పటిష్టం చేసుకోవాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా ఎక్స్ వేదికగా ఓ పోస్ట్ పెట్టారు.

# విశాఖ తీరంలో ఫ్లీట్ రివ్యూ యుద్ధనౌకల పరేడ్‌ను తిలకించిన రాష్ట్రపతి ముర్ము

మొదటి పేజి తరువాయి

అనంతరం ఐఎన్ఎస్ సుమేధ నౌకపై రాష్ట్రపతితో పాటు గవర్నర్, సీఎం, డిప్యూటీ సీఎంలు ప్రయాణించారు. విశేషం ఏంటంటే ఈ కార్యక్రమంలో రష్యా, ఆస్ట్రేలియా, యూఏఈ తదితర దేశాల నుంచి వచ్చినటువంటి మొత్తం 19 విదేశీ నౌకలు, భారత నేవీకి చెందిన మరో 45 నౌకలు, కోస్ట్‌గార్డ్, మర్చంట్ నేవీ, పరిశోధన నౌకలు ఒక 7 అంతర్జాతీయ యుద్ధనౌకలు సమీక్షలో పాల్గొనడం గమనార్హం. అంతర్జాతీయ యుద్ధనౌకల సమీక్షలో భాగంగా ఆర్కేబీచ్ ప్రధాన కేంద్రంగా సిటీ పరేడ్, నౌకాదళం విన్యాసాలు, ఫైర్, డ్రోన్ షోలు చూపరులను విశేషంగా ఆకట్టుకున్నాయి. నిబంధనలు తప్పనిసరి: విశాఖ నగరం నుంచి బీచ్‌రోడ్డుకు వచ్చే వారు కేజీహెచ్ డౌన్, పందిమెట్ట డౌన్, పాండురంగాపురం డౌన్‌తో పాటు వుడా పార్కు వైపు నుంచి విన్యాసాలు జరిగే ప్రాంగణానికి చేరుకోవచ్చు. ఏపీఐఐసీ స్థలం, కోస్టల్‌బ్యాటరీ, ఏయూ మైదానాల్లో వాహనాల పార్కింగ్‌కు అధికారులు అవకాశాన్ని కల్పించారు. బీచ్ వరకు రాలేకపోయిన వారికి సిటీ సెంట్రల్‌పార్క్, వుడా పార్క్, సిరిపురం కూడలి గురజాడ ప్రాంగణంలో భారీ ఎల్ఈడీ తెరలను ఏర్పాటు చేశారు. ఆర్కేబీచ్ నుంచి సబ్‌మెరైన్ మ్యూజియం వరకు 15 బ్లాకులను ఏర్పాటు చేశారు. పలు బ్లాకులకు అతిథులు, నౌకాదళం ఉద్యోగులు, ఇతర ముఖ్యులకు కేటాయించారు. బ్లాకుల్లోకి వెళ్లాలంటే ప్రతి ఒక్కరికీ పాస్ తప్పనిసరిగా ఉండి తీరాలి. యుద్ధనౌకల పరేడ్‌ను తిలకించేందుకు విశాఖ సాగర తీరానికి స్థానికులు పోటెత్తారు. నగరం నుంచి బీచ్‌రోడ్డుకు వచ్చే వారు కేజీహెచ్ డౌన్, పందిమెట్ట డౌన్, పాండురంగాపురం డౌన్‌తో పాటు వుడా పార్కు వైపు నుంచి విన్యాసాలు జరిగే ప్రాంగణానికి చేరుకోవచ్చు. ఏపీఐఐసీ స్థలం, కోస్టల్‌బ్యాటరీ, ఏయూ మైదానాల్లో వాహనాల పార్కింగ్‌కు అవకాశం కల్పించారు. బీచ్ వరకు రాలేకపోయిన వారికి సిటీ సెంట్రల్‌పార్క్, వుడా పార్క్, సిరిపురం కూడలి గురజాడ ప్రాంగణంలో భారీ ఎల్ఈడీ తెరలను ఏర్పాటు చేశారు. ఆర్కేబీచ్ నుంచి సబ్‌మెరైన్ మ్యూజియం వరకు 15 బ్లాకులను ఏర్పాటు చేశారు. ఆయా బ్లాకులకు అతిథులు, నౌకాదళం ఉద్యోగులు, ఇతర ముఖ్యులకు కేటాయించారు. బ్లాకుల్లోకి వెళ్లాలంటే ప్రతి ఒక్కరికీ పాస్ తప్పనిసరి. యుద్ధనౌకల పరేడ్‌ను తిలకించిన ముర్ము: అంతర్జాతీయ యుద్ధ నౌకల సమీక్ష ప్రపంచ దేశాల మధ్య ఐక్యతకు, పరస్పర సహకారానికి అద్దం పట్టిందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. విశాఖలో నిర్వహించిన అంతర్జాతీయ యుద్ధనౌకల సమీక్ష -2026లో పాల్గొన్న రాష్ట్రపతి భారత నౌకాదళం ఎన్నో సవాళ్లను అధిగమిస్తూ సమర్థంగా పని చేస్తుందని రాష్ట్రపతి ముర్ము కితాబిచ్చారు. అంతర్జాతీయ యుద్ధనౌకల సమీక్షలో భాగంగా నిర్వహించిన 71 యుద్ధనౌకల పరేడ్‌ను రాష్ట్రపతి

## విద్యార్థులకు పోలవరం ప్రాజెక్టు వీక్షించే అవకాశం

మొదటి పేజి తరువాయి

ఉద్యోగాలకే పరిమితం కాకుండా రాజకీయాల్లోకి రావాలని ఆయన యువతకు పిలుపునిచ్చారు. ప్రజలకు సేవ చేయాలంటే నాయకత్వం స్వీకరించాలని సూచించారు. దాదాపు 300 మంది పాఠశాల, కళాశాలల విద్యార్థులు సభా గ్యాలరీల్లో కూర్చొని ప్రజా సమస్యలపై జరుగుతున్న చర్చలు, చట్టాల రూపకల్పన ప్రక్రియను ప్రత్యక్షంగా వీక్షించారు. 6 రోజులుగా కొనసాగుతున్న ఈ విజ్ఞాన యాత్రలో ఇప్పటికే దాదాపు 1400 మంది విద్యార్థులు అసెంబ్లీని సందర్శించారు. సభ విరామ సమయంలో స్పీకర్ స్వయంగా విద్యార్థుల వద్దకు వెళ్లి వారి ప్రశ్నలకు ఓపికగా సమాధానాలు ఇచ్చారు. ప్రజాస్వామ్యంలో యువత పాత్రను స్పీకర్ వివరించడం వారికి ప్రత్యేక ప్రేరణగా నిలిచింది. అసెంబ్లీని సందర్శించిన 1400 మంది విద్యార్థులు: భావి భారత పౌరులకు చట్టసభల పనితీరుపై అవగాహన కల్పించే లక్ష్యంతో ఏపీ శాసనసభ చేపట్టిన ప్రత్యేక కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోంది. ఈ రోజు 300 మంది విద్యార్థులు అసెంబ్లీని సందర్శించి సభా కార్యక్రమాలను ప్రత్యక్షంగా వీక్షించారు.



గత 6 రోజులుగా కొనసాగుతున్న ఈ కార్యక్రమంలో ఇప్పటివరకు దాదాపు 1400 మంది విద్యార్థులు భాగమయ్యారు. ప్రజా సమస్యలపై చర్చలు, చట్టాల రూపకల్పన విధానం, బడ్జెట్ ఆమోద ప్రక్రియ వంటి అంశాలను వారు ఆసక్తిగా గమనించారు. మేము ఇక్కడకు వచ్చేటప్పుడు ఇది రాజకీయ దేవాలయం అని చెప్పారు. కాని మాకు ఇక్కడకు వచ్చాక తెలిసింది. ఇంతమంది నేతలు ప్రజల సమస్యలు, ఆశయాల గురించి మాట్లాడటం చూసి చాలా ఆనందంగా అనిపించింది. ముఖ్యంగా విద్యాశాఖ గురించి మాట్లాడేటప్పుడు 33,800 కోట్లు దీనికి కేటాయించారు అని తెలియజేశారు. ఇలానే వ్యవసాయం గురించి చాలా వరకు మాట్లాడారు. అలానే మా శ్రీకాకుళం నుంచి ఇంతమంది నేతలను ఇక్కడ చూడటం చాలా ఆనందంగా ఉంది.– విద్యార్థిని విద్యార్థులతో ఆత్మీయంగా మమేకమైన నేతలు: కాగా నిన్నటి రోజున సభా విరామ సమయంలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు, ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్య చౌదరి, కామినేని శ్రీనివాస్, విష్ణుకుమార్ రాజు, పత్తిపాటి పుల్లారావు, బొండా ఉమామహేశ్వరరావు విద్యార్థులతో ఆత్మీయంగా మమేకమయ్యారు. ఉన్నత లక్ష్యాలతో చదివి దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని నేతలు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా స్పీకర్ అయ్యన్నపాత్రుడి తో విద్యార్థులు ఫొటోలు దిగారు. చట్టసభ వాతావరణాన్ని ప్రత్యక్షంగా చూడటం తమకు స్ఫూర్తినిచ్చిందని విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.

## రైతులను పెళ్లి చేసుకునే మహిళలకు ప్రోత్సాహకాలు ఇవ్వాలి

మొదటి పేజి తరువాయి

రైతు కుటుంబాలు ఎదుర్కొంటున్న సామాజిక, ఆర్థిక సమస్యలకు పరిష్కారాన్ని చూపాలని సీఎంను కోరామన్నారు.

### ఆ డిమాండ్లు నెరవేర్చాల్సిందే!

ప్రస్తుతం యువ రైతులకు పెళ్లి సంబంధాలు కుదరడం లేదని, ఈ సామాజిక సమస్య వల్ల వారి తల్లిదండ్రులు మానసికంగా కుంగిపోతున్నారని రైతు సంఘాల నేతలు తెలిపారు. యువ రైతుల పెళ్లికి చేయూతను అందించేందుకు ప్రత్యేక పథకాన్ని అమల్లోకి తేవాలని సీఎం సిద్ధరామయ్యను కోరామన్నారు. ఆ పథకం ద్వారా బ్యాచిలర్ రైతులను పెళ్లి చేసుకునే మహిళల బ్యాంకు ఖాతాల్లో రూ.10 లక్షలు చొప్పున ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయాలని విన్నవించామని పేర్కొన్నారు. యువ రైతులను పెళ్లి చేసుకునే మహిళలు వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ వ్యాపారాలను చేసుకునేందుకు ప్రభుత్వ పూచీకత్తుతో వడ్డీలేని రుణాలను ఇవ్వాలని సీఎంను కోరామని రైతు సంఘాల నేతలు వివరించారు. బ్యాచిలర్ రైతులను పెళ్లి చేసుకునే మహిళలకు ప్రభుత్వ ఉద్యోగాల్లో 20 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలనే డిమాండ్‌ను కూడా సీఎం సిద్ధరామయ్య ఎదుట ప్రస్తావించామన్నారు. గోవధపై తెచ్చిన చట్టాన్ని రద్దు చేయండి రానున్న రాష్ట్ర బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి పెద్దపీట వేయాలని కర్ణాటక సీఎంను రైతు సంఘాల నేతలు కోరారు. రైతుల జీవితాలను మార్చే దీర్ఘకాలిక వ్యూహం కలిగిన పథకాలను అమల్లోకి తేవాలన్నారు. గతంలో భూసంస్కరణల చట్టానికి చేసిన సవరణలను ఉపసంహరించుకోవాలని రైతులు కోరారు. రైతులకు మరింత చేరువ అయ్యేలా అగ్రికల్చరల్ ప్రొడ్యూస్ మార్కెట్ కమిటీ (ఏపీఎంసీ) చట్టాన్ని బలోపేతం చేయాలన్నారు. రాష్ట్ర వ్యవసాయ ధరల కమిషన్‌కు చట్టబద్ధమైన అధికారాలను మంజూరు చేయాలని, తద్వారా పంటల ధరలపై అది చేసే సిఫార్సులు అధికారికంగా అమల్లోకి వస్తాయని రైతు సంఘాలు పేర్కొన్నాయి. ప్రొఫెసర్ ఎండీ నంజుండస్వామి జన్మించిన మైసూరు జిల్లాలోని మాదేహల్లి గ్రామాన్ని డెవలప్ చేయడానికి ప్రత్యేక గ్రాంటును విడుదల చేయాలని కోరాయి.

కేంద్రం చట్టాలను కర్ణాటకలో అమలు చేయొద్దు

కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన ఎలక్ట్రిసిటీ యాక్ట్ 2025, సీడ్స్ బిల్ 2025, నేషనల్ ఫ్రేమ్ వర్క్ పాలసీ ఆన్ అగ్రికల్చరల్ మార్కెటింగ్‌లను కర్ణాటకలో అమలు చేసేది లేదని అసెంబ్లీలో ప్రకటించాలని సీఎంను రైతు సంఘాలు కోరాయి. రైతుల పంటలకు కనీస మద్దతు ధర(ఎంఎస్‌పీ)ను అందించేందుకు రూ.20వేల కోట్లతో రివాల్వింగ్ ఫండ్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశాయి. రైతుల నుంచి నేరుగా రాష్ట్ర ప్రభుత్వమే కనీస మద్దతు ధరతో వరి, రాగులు, జొన్నలు, కందిపప్పు, నూనె గింజలు, మిల్లెట్లను కొనాలని విజ్ఞప్తి చేశాయి.

ఆ రైతులకు భూములపై హక్కులివ్వండి

అనధికారికంగా ప్రభుత్వ భూముల్లో పంటలు పండిస్తున్న బగార్ హుకుమ్ రైతులకు ఆయా భూములపై హక్కులను మంజూరు చేయాలని సీఎం సిద్ధరామయ్యను రైతు సంఘాల నేతలు కోరారు. పంట బీమా పథకం కవరేజీని అన్ని పంటలకు విస్తరించాలన్నారు. అధిక వర్షపాతం, కరవు, ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట నష్టపోయే రైతులకు తప్పకుండా పంట బీమా పథకం ద్వారా పరిహారం అందేలా చూడాలని సీఎంకు విన్నవించారు. ఈ డిమాండ్లు అన్నీ సీఎంకు తాము అందించిన వినతిపత్రంలో ఉన్నాయని రైతు సంఘాల నేతలు తెలిపారు.

రైతు ఆత్మహత్యల్లో నంబర్ 2 స్థానంలో కర్ణాటక

"కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వం చెరుకు పంట ధరను 1 టన్నుకు రూ.100 మేర పెంచింది. దీంతో ఒక టన్ను చెరుకు ధర రూ.3,300కు చేరింది. కానీ రైతుల నుంచి చెరుకు పంటను కొనే సమయంలో అంతరేటును చెల్లించడం లేదు. దీనిపై అధ్యయనానికి ఒక సాంకేతిక కమిటీని నియమించాలి. ఇప్పటికీ రైతుల ఆత్మహత్యల విషయంలో దేశంలో నంబర్ 2 స్థానంలో కర్ణాటక ఉంది. రైతుల ఆత్మహత్యలు ఆపేలా తక్షణ చర్యలను చేపట్టాలి" అని రైతు సంఘం నేత కురుబూరు శాంతాకుమార్ కోరారు.

సీఎం ఎదుట 25 అంశాలను లేవనెత్తాం

"సీఎం సిద్ధరామయ్యతో భేటీ సందర్భంగా మేం దాదాపు 20 నుంచి 25 అంశాలను లేవనెత్తాం. మైనర్ ఇరిగేషన్ అంశానికి ప్రభుత్వ ప్రాధాన్యతను పెంచాలని కోరాం. రైతులు కేంద్రంగా ఈసారి రాష్ట్ర బడ్జెట్‌ను రూపొందించాలని సూచించాం. మా విన్నపాలకు సీఎం సానుకూలంగా స్పందించారు" అని రైతు సంఘం నేత బడగలపుర నాగేంద్ర చెప్పారు.

## రాజ్యాంగాన్ని కచ్చితంగా మార్చాల్సిందే'- కేంద్రంపై సీఎం స్టాలిన్ ఫైర్

మొదటి పేజి తరువాయి

మొదటి భాగాన్ని తమిళనాడు అసెంబ్లీలో ప్రవేశపెడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. చట్టప్రకారం రావాల్సిన నిధులను దక్కించుకునేందుకు కేంద్రంతో పోరాటం చేయాల్సిన పరిస్థితిలోకి తమిళనాడును నెట్టివేశారని విమర్శించారు. భారత్ లాంటి వైవిధ్యం ఉన్న దేశానికి సమాఖ్య వ్యవస్థ పునాది లాంటిందని తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ అభిప్రాయపడ్డారు. రాష్ట్రాలపై ఎలాంటి గౌరవం లేకుండా కేంద్రమే అన్ని అధికారులను తన గుప్పిట్లో పెట్టుకుందని ఆరోపించారు. రాష్ట్రాలను గౌరవించకుండా కేంద్రమే అన్ని అధికారాలను తన వద్దే పెట్టుకుందని విమర్శించారు. "ఒక రాష్ట్రంగా మా ప్రజల కలలను నిజం చేసేందుకు మాకు అధికారాలు కూడా లేవు. సామాజిక న్యాయం, విద్య, వైద్యం, ఆర్థికం, మౌలిక సదుపాయల కల్పనలో చాలా అభివృద్ధి సాధించాం. కానీ నిధులు సహా కొన్ని హక్కుల కోసం ఇంకా పోరాడుతూనే ఉన్నాం. కేంద్రం నుంచి వచ్చే నిధులను దక్కించుకునేందుకు ప్రతీసారి పోరాడాల్సిన పరిస్థితిల్లో మనం ఉన్నాం. ఇంకా ఎన్ని రోజులు వారు ఇస్తుంటే మనం తీసుకునే స్థితిలో ఉందాం? మేము ప్రతీ సారి తలవంచి అడుక్కునే వ్యక్తులం కాదు. మా రాష్ట్రానికి స్వయం ప్రతిపత్తి కావాలి. కేంద్రంలో సమాఖ్య వ్యవస్థ ఉంటేనే ప్రజలకు సుపరిపాలనను అందించగలం. భారత్ లాంటి వైవిధ్యం ఉన్న దేశానికి సమాఖ్య వ్యవస్థ పునాది లాంటిది. రాష్ట్రం- కేంద్రం మధ్య సంబంధాలపై ఏర్పాటు చేసిన ఉన్నతస్థాయి కమిటీ అందించిన నివేదికను అసెంబ్లీలో పెడుతున్నాం. రాష్ట్రాలకు స్వయం ప్రతిపత్తిని అందించేందుకు తప్పనిసరిగా రాజ్యాంగాన్ని సవరించాలి. ఇప్పటికీ మనకు వచ్చే రాజ్యాంగ హక్కులు, నిధులు, అధికారాల కోసం పోరాడాల్సిన స్థితిలో ఉన్నాం. అందుకే భారతదేశ సమాఖ్య వ్యవస్థకు నిర్మాణాత్మక పునర్ నిర్మాణం అవసరం. మనం కోరుకుంటే, మళ్లీ రాజ్యాంగాన్ని సవరించవచ్చు. సమాఖ్యవాదం అంటే నియంత్రణ కాదు, నమ్మకం, స్వయంప్రతిపత్తి."

**ఎంకే స్టాలిన్ , తమిళనాడు ముఖ్యమంత్రి**

భారతదేశ సార్వభౌమత్వాన్ని, సమగ్రతను కాపాడుకోవడానికి కేంద్రం బలంగా ఉండాలని 1967లోనే డీఎంకే వ్యవస్థాపకుడు, దివంగత ముఖ్యమంత్రి సీఎన్ అన్నాదురై అన్నారని సీఎం స్టాలిన్ గుర్తు చేశారు. ఆయన వారసుడు దివంగత ఎం కరుణానిధి కూడా 'రాష్ట్రాలకు స్వయంప్రతిపత్తి– కేంద్రంలో సమాఖ్యవాదం' అనే సూత్రం ద్వారా దీనికి మద్దతు తెలిపారని చెప్పారు. 1969లో జస్టిస్ పీవీ రాజమన్నార్ ఆధ్వర్యంలో కేంద్ర-రాష్ట్ర సంబంధాలపై మొదటి స్వతంత్ర కమిటీని ఏర్పాటు చేశారు. ఆ తర్వాత 1983లో జస్టిస్ సర్కారియా నేతృత్వంలో కేంద్రం మరో కమిటీని ఏర్పాటు చేసింది. అనంతరం 2000లో వెంకటాచలయ్య కమిషన్ ను నియమించారు. కాగా, రాష్ట్రాల హక్కులపై గత కొన్నేళ్లుగా కేంద్ర ప్రభుత్వంతో తీవ్రంగా పోరాడుతున్న తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ రాష్ట్రాల స్వయం సాధికారత కోసం అత్యున్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేశారు. గతేడాది ఏప్రిల్ 15న సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ కురియన్ జోసెఫ్ నేతృత్వంలో ఈ కమిటీని నియమించారు. ఇందులో సభ్యులుగా ఇండియన్ మారిటైమ్ యూనివర్సిటీ మాజీ ఉపకులపతి, విశ్రాంత ఐఏఎస్ అధికారి అశోక్ వర్ధన్ శెట్టి, తమిళనాడు ప్రణాళికా సంఘం మాజీ వైస్ చైర్మన్ నాగనాథన్ ఉన్నారు. ఈ క్రమంలోనే తాజాగా ఇందులోని మొదటి భాగాన్ని అసెంబ్లీలో ప్రవేశపెట్టారు.

## ఏఐ సమ్మిట్ లో చైనా రోబో- మోదీ సర్కార్ భారత్ పరువు తీసింది

మొదటి పేజి తరువాయి

చైనా తయారు చేసిన రోబోను, ఇండియాలో తయారు చేసినట్లు చూపించడంపై సర్వత్రా విమర్శలు వచ్చాయి.

### వర్సిటీకి ఉద్వాసన

వివాదం ముదరడంతో అధికారులు వెంటనే దిద్దుబాటు చర్యలకు ఉపక్రమించారు. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం, గల్గోటియాస్ యూనివర్సిటీని వెంటనే ఎక్స్‌పో నుంచి వెళ్లిపోవాలని ఆదేశించారు. వారి స్టాల్‌ను తక్షణమే ఖాళీ చేయించారు. చైనా రోబోను తమదిగా చెప్పుకోవడంపై ఆన్ లైన్, ఆఫ్ లైన్ వేదికల్లో తీవ్ర వ్యతిరేకత రావడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు.

### రాహుల్ గాంధీ ధ్వజం

ఈ ఘటనపై రాహుల్ గాంధీ 'ఎక్స్' వేదికగా స్పందించారు. "భారతదేశ ప్రతిభను, డేటాను వాడుకోవాల్సింది పోయి, ఏఐ సమ్మిట్‌ను ఒక పబ్లిసిటీ స్టంట్‌గా మార్చేశారు. ఇక్కడ భారతీయ డేటా అమ్మకానికి ఉంది. చైనా ఉత్పత్తులేమో ప్రదర్శనకు ఉన్నాయి" అని ఆయన ఎద్దేవా చేశారు. మోదీ ప్రభుత్వం ఏఐ విషయంలో భారత్‌ను ప్రపంచ దేశాల ముందు నవ్వులపాలు చేసిందని మండిపడ్డారు.

### కాంగ్రెస్ విమర్శల వర్షం

కాంగ్రెస్ పార్టీ కూడా ఈ అంశంపై అధికారికంగా స్పందించింది. "ఏఐ సమ్మిట్‌లో చైనా రోబోలను మనవిగా ప్రదర్శిస్తున్నారు. చైనా మీడియా మనల్ని చూసి ఎగతాళి చేస్తోంది. ఇది భారతదేశానికి నిజంగా అవమానకరం. ఐటీ మంత్రి అశ్విని వైష్ణవ్ కూడా ఈ అబద్ధంలో భాగమయ్యారు. భారతీయ సదస్సులో చైనా రోబోలను ప్రమోట్ చేస్తున్నారు. దేశం ఇమేజ్‌కు మోదీ ప్రభుత్వం పూడ్చలేని నష్టం చేసింది. ఏఐ రంగాన్ని ఒక జోక్‌గా మార్చేశారు. మనకున్న డేటా శక్తితో మనం ప్రపంచానికి నాయకత్వం వహించాల్సింది పోయి, ఇలా దిగజారడం సిగ్గుచేటు" అని కాంగ్రెస్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడింది.

### వర్సిటీ వివరణ ఇదే!

మరోవైపు గల్గోటియాస్ యూనివర్సిటీ ఈ ఆరోపణలను ఖండించింది. తమపై దుష్ప్రచారం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేసింది. "మా విద్యార్థులకు ఏఐ ప్రోగ్రామింగ్ నేర్పించడంలో భాగంగానే ఆ రోబోను ఉపయోగించాం. ప్రపంచవ్యాప్తంగా అందుబాటులో ఉన్న టూల్స్, వనరులను ఉపయోగించుకుని విద్యార్థులకు నైపుణ్యాలు నేర్పిస్తున్నాం. అంతేకానీ అది మా సొంత తయారీ అని చెప్పలేదు. విద్యార్థుల మనోధైర్యాన్ని దెబ్బతీసేలా ఇలాంటి ప్రచారం చేయడం తగదు" అని యూనివర్సిటీ అధికారిక ప్రకటన విడుదల చేసింది. ఇంతటి వివాదం నడుమనే 'ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్' కొనసాగుతోంది. ప్రధాని నరేంద్ర మోదీ సోమవారమే 'ఇండియా ఏఐ ఇంపాక్ట్ ఎక్స్‌పో 2026'ను ప్రారంభించారు. గురువారం ఆయన ఈ సదస్సులో ఉపన్యాసం చేయనున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. "పీపుల్, ప్లానెట్, ప్రోగ్రెస్" (ప్రజలు, గ్రహం, ప్రగతి) అనే మూడు సూత్రాల ఆధారంగా ఈ సదస్సు జరుగుతోంది. 20కి పైగా దేశాధినేతలు, 60 మంది మంత్రులు, 500 మంది గ్లోబల్ ఏఐ లీడర్లు ఇందులో పాల్గొంటున్నారు. గ్లోబల్ సౌత్ దేశాల్లో జరుగుతున్న తొలి అంతర్జాతీయ ఏఐ సదస్సు ఇదే కావడం విశేషం.

# సంపాదకీయం

## వాణిజ్య బంధాలూ సమర వివాదాలూ

రాష్ట్రపతి ప్రసంగం ముగిసిన తర్వాత కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన రెండో రోజే పార్లమెంటులో తీవ్ర గందరగోళం నెలకొన్నది. దీన్నిబట్టి చూస్తే అసలు పార్లమెంట్ సమావేశాలు సజావుగా జరగాలన్న ఉద్దేశం అటు ప్రతిపక్షాలకు కానీ, ఇటు ప్రభుత్వానికి కానీ ఉన్నదా అన్న అనుమానం వస్తోంది. సాధారణంగా బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన తర్వాత రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ జరగడం ఆనవాయితీ. ఆ తర్వాతే బడ్జెట్ ప్రతిపాదనలపై చర్చలు మొదలవుతాయి. పార్లమెంటు ఉభయ సభలనుద్దేశించి రాష్ట్రపతి వెలువరించే ప్రసంగం ఒక రకంగా ప్రభుత్వ విధాన డాక్యుమెంట్. నిజానికి మోదీ ప్రభుత్వం అమలుపరుస్తోన్న వివిధ సంక్షేమ పథకాలు, కార్యక్రమాలు, మౌలిక సదుపాయాల అభివృద్ధికి ఇస్తోన్న ప్రాధాన్యం గురించి రాష్ట్రపతి ప్రపంగం వివరించింది.. రాజకీయ విభేదాలు విస్మరించి వికసిత్ భారత్ లక్ష్యానికి అనుగుణంగా జాతీయ ప్రజాప్రతినిధులు అందరూ దేశ ప్రయోజనాలకోసం కలిసికట్టుగా కృషి చేయాలని రాష్ట్రపతి పిలుపునిచ్చారు. విచిత్రమేమంటే బడ్జెట్ ప్రవేశపెట్టిన మరుసటి రోజే పాలక, ప్రతిపక్షాల మధ్య తీవ్ర వాదోపవాదాలతో సభా సమావేశాలు కొనసాగలేని పరిస్థితి ఏర్పడింది. ఇందుకు ఎవరు కారణం? రాష్ట్రపతి ప్రసంగంపై సోమవారం నాడు ప్రారంభమైన చర్చలో బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య కాంగ్రెస్‌పై వాడి వేడి బాణాలు సంధించారు. భారతీయ నాగరికత, సంస్కృతి, జాతీయవాదం, దేశభక్తి అనే వాటికి కాంగ్రెస్ పార్టీ తీవ్ర వ్యతిరేకమని ఆయన మాట్లాడిన మాటలు కాంగ్రెస్‌ను రెచ్చగొట్టాయి. ఇప్పటికే అనేక గాయాలతో రెచ్చిపోతున్న కాంగ్రెస్ ఊరుకుంటుందా? ఆ వెంటనే కాంగ్రెస్ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ రంగంలోకి దిగి తమ దేశ భక్తిని, జాతీయవాదాన్ని శంకించడంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. 'మా దేశ భక్తి గురించి, భారతీయ సంస్కృతి గురించి బీజేపీ యువ ఎంపీ వ్యాఖ్యలు చేసినందుకే నేను కొన్ని వాక్యాలను చదివి వినిపించదలుచుకున్నాను' అని రాహుల్ మొదలుపెట్టారు. 'ఫోర్ స్టార్స్ ఆఫ్ డెస్టినీ' పేరిట 2020లో చైనాతో జరిగిన సరిహద్దు ఘర్షణపై మాజీ ఆర్మీ చీఫ్ జనరల్ ఎంఎం నరవణే రచించిన పుస్తకంలో ఉన్న అంశాలపై 'కారవాన్' అనే పత్రిక వెలువడిన ఆ పుస్తక భాగాలను చదవ సాగారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ గురించి నరవణే రాసిన వాక్యాలను చదవడం మొదలుపెట్టగానే బీజేపీ ఎంపీలు తీవ్ర గందరగోళం సృష్టించారు. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, హోంమంత్రి అమిత్ షా, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు తీవ్ర అభ్యంతరం తెలిపారు. ఇంకా ప్రచురణ కాని ఆ పుస్తకంలోని వాక్యాలను ఎలా చదువుతారని మంత్రులు ప్రశ్నించారు. స్పీకర్ ఓం బిర్లా కూడా 342 నిబంధన క్రింద అలా చదవడం కుదరదని స్పష్టం చేశారు. అధికార ప్రతిపక్ష సభ్యుల మధ్యే కాక, స్పీకర్‌కూ, ప్రతిపక్ష సభ్యుల మధ్య కూడా వాగ్వివాదం జరిగింది. మంగళవారం కూడా ఇదే పరిస్థితి కొనసాగింది. తాను నరవణే పుస్తకంలో ఉన్న అంశాలు సరైనవేనని సాధికారికంగా చెబుతున్నానంటూ రాహుల్ స్పీకర్‌కు నోట్ సమర్పించి మరీ మళ్లీ ప్రసంగం ప్రారంభించారు. అయితే అధికార పక్షం వారు యథా ప్రకారం రాహుల్ మాట్లాడకుండా అడ్డుకున్నారు. ప్రధానమంత్రి అన్న పదం ఉచ్చరించినప్పుడల్లా స్పీకర్ అడ్డుకున్నారు. రాహుల్‌ను అడ్డుకుంటున్నారని గందరగోళం సృష్టించినందుకు ఎనిమిది మంది కాంగ్రెస్ ఎంపీలను సస్పెండ్ చేశారు. చివరకు అనేక వాయిదాల తర్వాత సభ మళ్లీ బుధవారానికి వాయిదా పడింది. అసలీ పరిస్థితి ఎందుకు వచ్చింది? తేజస్వి సూర్య విమర్శనాస్త్రాలే కాంగ్రెస్‌ను రెచ్చగొట్టాయా? జనరల్ నరవణే పుస్తకంలోని అంశాలను రాహుల్ ప్రస్తావించకుండా బీజేపీ ఎందుకు అడ్డుకుంటోంది? నిజానికి నరవణే పుస్తకం వెలుగులోకి రాకుండా గత రెండేళ్లుగా కేంద్రం అడ్డుకుంటోంది. ఆ పుస్తకం ప్రచురించడానికి రక్షణమంత్రిత్వ శాఖ, విదేశాంగమంత్రిత్వ శాఖ ఇంతవరకూ పబ్లిషర్‌కు అనుమతినీయలేదు. 'నేను రాయాల్సింది రాశాను. ఇక ఆ పుస్తకాన్ని ఎలా విడుదల చేయాలో పబ్లిషరే తేల్చుకోవాలి' అని నరవణే అన్నారు. ఆ పుస్తకంలో తాను రాసిన అంశాలపై వస్తున్న వివాదం విషయమై కూడా ఆయన ఏ మాత్రం స్పందించలేదు. 'కారవాన్'లో వచ్చిన పుస్తక భాగాలపై కూడా ఆయన వ్యాఖ్యానించలేదు. అంటే తాను రాసిన వాటికి ఆయన కట్టుబడి ఉన్నట్లే కదా. భారత్ చైనాల మధ్య సరిహద్దు ఘర్షణలు కొత్త కాదు. ఆ పొరుగు దేశంతో విభేదాలు యుద్ధానికి దారితీయడంలో నెహ్రూ ప్రభుత్వ తప్పిదాల గురించి అనేక పుస్తకాలు వచ్చాయి. చైనాతో యుద్ధం జరుగుతున్నప్పుడు అసోంను కోల్పోతామేమోనన్న ఆవేదనను నెహ్రూ వ్యక్తపరిచారు. 'నా హృదయం అసోం ప్రజలకోసం తపిస్తోంది..' అన్న ఆయన ఆవేదనాపూరిత వ్యాఖ్యలు సంచలనం సృష్టించాయి. కాంగ్రెస్ హయాంలో జరిగిన అనేక తప్పిదాలు, సంభవించిన పరాజయాలు, వాటిల్లిన వైఫల్యాలను కప్పిపుచ్చడానికి ఎవరూ ప్రయత్నించలేదు. ఇవాళ కాంగ్రెస్ పార్టీ దేశ రక్షణ, భద్రత నుంచి అనేక విషయాల్లో ఆత్మరక్షణలో పడేందుకు, ఎన్నికల పరాభవాల నుంచి కోలుకోలేకపోతున్నందుకు అవే కారణం. మరి మోదీ హయాంలో ఇలాంటి విషయాలపై చర్చ జరిగేందుకు కూడా ఆస్కారం లేకుండా పోతోంది. ఏ చిన్న విజయం లభించినా ఉప్పొంగిపోయి, అమితోత్సాహం ప్రదర్శించి ప్రచారార్భాటాలు చేసేవారు జాతీయ ప్రాధాన్యమున్న వివాదాలపై చర్చించడానికి నిరాకరించడం దేనికి? జనరల్ నరవణే పుస్తకం బయటకు వచ్చి ఉంటే దానిపై కొద్ది రోజులు చర్చ జరిగి సమసిపోయివుండేది. గల్వాన్ లోయలో చైనా చొచ్చుకువస్తున్నప్పుడు 'మీకేది సముచితమో అదే చేయండి' అని ప్రధానమంత్రి తనకు చెప్పారని రక్షణమంత్రి వెల్లడించినట్లు నరవణే రాశారు. ఆ సమయంలో జరిగిన ఘటనలేమిటో, ఎంతమందితో ఎన్ని చర్చల తర్వాత, ఎన్ని తర్జనభర్జనల

## సాగు రంగంలో మారిన ప్రాథమ్యాలు



దేశానికి ఆహార భద్రత సమకూరిన పరిస్థితుల్లో 2026 కేంద్ర బడ్జెట్లో సాగు రంగానికి సంబంధించి ప్రాథమ్యాలు మారాయి. రుణ మాఫీలు, కనీస మద్దతు ధరలు, సబ్సిడీల పెంపు వంటి సంచలన ప్రకటనలేమీ ఈ పద్దులో లేవు. తాత్కాలిక పరిహారాలు, ఉపశమనాల నుంచి నష్టభయం లేని స్థిర ఆదాయాల సాధనకు పునాది ఏర్పరచడమే ఈ బడ్జెట్ ప్రధాన లక్ష్యంగా కనిపిస్తోంది. భారతీయ వ్యవసాయం నేడు కొత్త మలుపులో నిలిచి ఉంది. ఆహార ధాన్యాలు, పండ్లు, కూరగాయలు, చేపలు, పాడి ఉత్పత్తులను అవసరానికి మించి ఉత్పత్తి చేసుకోగలుగుతున్నాం. విదేశాలకూ ఎగుమతి చేస్తున్నాం. అయితే, రైతులకు స్థిరమైన ఆదాయం కల్పించడం, వాతావరణ మార్పులను, జాతీయ, అంతర్జాతీయ విపణుల్లో ఒడుదొడుకులను తట్టుకుంటూ ఎప్పటికప్పుడు రాబడి పెరిగేలా చూడటం విధానకర్తల ముందున్న అతి పెద్ద సవాలు. తాజా కేంద్ర బడ్జెట్ దీనికే ఎక్కువ ప్రాధాన్యమిచ్చింది. భారతదేశ స్థూల విలువ జోడింపులో వ్యవసాయం వాటా 18శాతమే. కానీ, శ్రామిక బలగంలో 45శాతం ఈ రంగంపైనే ఆధారపడి ఉందని 2025-26 ఆర్థిక సర్వే తెలిపింది. వ్యవసాయం, అనుబంధ వృత్తుల్లో ఉత్పత్తి పెరుగుతున్నా తరచూ అనిశ్చితి ఎదురవుతోంది. 2024-25లో ఆహార ధాన్యాల ఉత్పత్తి 35.7 కోట్ల టన్నులకు చేరింది. అంతకుముందు సంవత్సరం కన్నా అది 7.5శాతం ఎక్కువ. ఉద్యాన పంటల ఫలసాయం ఆహారోత్పత్తిని మించిపోయింది. దశాబ్దం కిందటి నుంచి పంటల సాగుకన్నా పశుపోషణ, మత్స్య పరిశ్రమ వేగంగా వృద్ధి చెందుతున్నాయి. మరోవైపు వాతావరణ మార్పుల వల్ల ప్రకృతి విపత్తులు సర్వసాధారణమవుతున్నాయి. అస్థిర వర్షపాతం, మండుటెండలు, భూగర్భ జలాలు తరిగిపోవడం, ఒకే జిల్లాలో, ఒకే మండలంలో దిగుబడుల్లో తేడాలు గ్రామీణుల ఆదాయాలలో అనిశ్చితికి దారితీస్తున్నాయి. దిగుబడులు పెరిగినా మార్కెట్లో ధరలు పడిపోయి రైతు ఆదాయాలకు కోతపెడుతున్నాయి. విత్తనాలు, ఎరువుల ధరలు పెరిగిపోతున్నాయి. కోతల తరవాత ఆరు నుంచి 10శాతం పంట నష్టమవుతున్నట్లు అంచనా. ఈ నేపథ్యంలో తాజా బడ్జెట్ దిగుబడుల పెంపుకన్నా, నష్టాల నివారణపై ఎక్కువగా దృష్టి సారించింది.

అధిక రాబడే ధ్యేయంగా...

తాజా కేంద్ర బడ్జెట్లో కీలకమైన ప్రకటన భారత్-విస్తార్ పోర్టల్ ప్రారంభం. ఇది కృత్రిమ మేధ (ఏఐ) సాయంతో బహు భాషల్లో పనిచేసే వ్యవసాయ సలహా వేదిక. అగ్రిస్టాక్, ఐసీఏఆర్ పరిశోధనా ఫలాలు, డిజిటల్ సమాచార వ్యవస్థల సమ్మేళనమిది. భారతీయ వ్యవసాయ విస్తరణ సేవలకు సమాచార కొరతేమీ లేదు. ఈ సమాచారాన్ని రైతులకు సకాలంలో అందించి ఆశించిన ఫలితాలను సాధించడంలోనే సమస్య ఎదురవుతోంది. సమాచారానికి తోడు ఉత్పత్తి సాధనాలను సమకూర్చాలి. నీరు, రుణాలు సకాలంలో అందాలి. పంట చేతికొచ్చాక ధరలు పడిపోకుండా చూడాలి. ఈ లోపాలను అధిగమిస్తేనే విస్తార్ సార్థకమవుతుంది. భూసార పరీక్షలు, ఏ నేలలో ఏ పంటలు వేయాలనే సూచనలు, వాతావరణ వివరాలు, పంటల వైవిధ్యానికి సంబంధించిన సిఫార్సులు, మార్కెట్ సమాచారం అందించి రైతులు సరైన నిర్ణయాలు తీసుకోవడానికి తోడ్పడాలి. నష్ట భయాన్ని నివారించాలి. ఈ పనులను చేయగల సత్తాను భారత్-విస్తార్‌కు సమకూర్చాలి. చిన్న రైతులకు దీనివల్ల ఎంతో లబ్ధి చేకూరుతుంది. కొత్తగా 500 ప్రధాన జలాశయాలు, అమృత్ సరోవరాలను సమగ్రంగా అభివృద్ధి చేయనున్నట్లు తాజా బడ్జెట్‌లో ప్రకటించారు. దీనికి మరి కాస్త ఎక్కువ ప్రాధాన్యం లభించి ఉంటే బాగుండేది. పంట దిగుబడి స్థిరంగా ఉండాలంటే నీటి సరఫరా నికరంగా జరగాలి. అలాంటి చోట్ల గ్రామీణుల ఆదాయాలు స్థిరంగా ఉంటాయి. వర్షాభావ ప్రాంతాల్లోనూ నిరంతర నీటి సరఫరా, భూగర్భ జలాల పునరుద్ధరణ, చెరువుల్లో చేపల పెంపకం, పశువులకు నీరు, గ్రామస్థాయిలో వాతావరణ మార్పుల నుంచి భద్రత లభించినప్పుడు రైతులకు నీటి వనరులు ప్రభుత్వ సబ్సిడీలకన్నా మెరుగైన నష్టనివారణ సాధనాలవుతాయి. ఆహార ధాన్యాలకన్నా మిన్నగా ఆదాయం తెచ్చిపెట్టే కొబ్బరి, జీడిపప్పు, కొకొవా, చందనం, ఇతర ఉద్యాన పంటలకు ఈసారి బడ్జెట్ ప్రాధాన్యమివ్వడం విశేషం. భవిష్యత్తులో వరి, గోధుమ వంటి ఆహార పంటలు మాత్రమే గ్రామీణ ఆదాయాలను పెంచలేవని ఆర్థిక సర్వే తెలిపింది. నీటి కొరత, పెట్టుబడి ఖర్చులు పెరగడం, భూసార క్షయం వంటివి దీనికి కారణాలు! ఆహార పంటలకు బదులు కొబ్బరి, జీడి, చందనం వంటి పంటలకు మళ్లితే హెక్టారుకు అధిక ఆదాయం లభిస్తుంది. ఎగుమతుల ద్వారా అదనపు రాబడి సిద్ధిస్తుంది. బ్రాండు పేరు మీద అమ్మితే వ్యాపార వృద్ధి జరుగుతుంది. సాగు, శుద్ధి, ఎగుమతులు, మార్కెటింగ్ విభాగాల్లో ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. అయితే, నాణ్యమైన వంగడాలను వాడటం, పంట కోత తరవాత సరైన ప్రాసెసింగ్, శీతల గిడ్డంగుల సదుపాయాలు, మార్కెట్ వసతులు ఉంటేనే అధిక ఆదాయానికి అవకాశం ఉంటుంది. ఈ ఏడాది బడ్జెట్‌లో మూలధన వ్యయాన్ని రికార్డు స్థాయిలో రూ.12.2 లక్షల కోట్లుగా నిర్ణయించడంతో ఇలాంటి మౌలిక వసతుల ఏర్పాటుపై ప్రభుత్వం దృష్టిపెట్టిందని అర్థమవుతోంది.

తెలుగు రాష్ట్రాలకు ప్రయోజనం

అధిక విలువనిచ్చే కొబ్బరి, జీడి, ఉద్యాన పంటలకు బడ్జెట్ ప్రాధాన్యమివ్వడం ఆంధ్ర, తెలంగాణలకు లాభిస్తుంది. అమృత్ సరోవరాలు, సమగ్ర జలాశయాల అభివృద్ధి కార్యక్రమాలు రాయలసీమ, ఉత్తర తెలంగాణలలోని చెరువులకు, తద్వారా రైతులకు మేలు చేస్తాయి. భారత్-విస్తార్ వల్ల రైతులకు వారి భాషలోనే వ్యవసాయ పరమైన సలహా సంప్రదింపులు లభిస్తాయి. మౌలిక వసతుల విస్తరణతో వారు ఎంతో ప్రయోజనం పొందుతారు. ప్రధానమంత్రి-కిసాన్ పథకం కింద ఇప్పటి వరకు దేశంలో 11 కోట్ల మందికి పైగా రైతులకు రూ.4 లక్షల కోట్ల మేర సాయం అందింది. కేంద్ర బడ్జెట్ ఈ పథకాన్ని విస్మరించలేదు. అదే సమయంలో ఇక సంక్షేమం అంటే కేవలం నగదు సాయం చేయడం మాత్రమే కాదనీ సాగులో, రైతు జీవితాల్లో అనిశ్చితిని తగ్గించడమన్న సందేశం బడ్జెట్‌లో కనిపిస్తోంది.

## వంద అబద్ధాలు.. ఒక పెళ్లి.. లక్షల వసూళ్లు..




ఒకప్పుడు పెళ్లి అంటే పెద్దల మాట, పరిచయాల విశ్వాసం, కుటుంబాల మధ్య బాధ్యత, రెండు మనసుల మధ్య బంధం ఈ నాలుగు స్థంభాల మీద నిలబడిన వ్యవస్థ. కానీ నేడు యాప్, సబ్‌స్క్రిప్షన్, కమీషన్, డీల్ క్లోజింగ్.. ఇది పెళ్లి కాదు.. మ్యాట్రిమోనియల్ మార్కెట్.. ఈ మార్పు ఒక్కరోజులో రాలేదు. మొదట పరిచయాల కొరత వచ్చింది. పట్టణీకరణ పెరిగింది. కుటుంబాలు చిన్నవయ్యాయి. పెద్దల పాత్ర తగ్గింది. ఈ ఖాళీలోకి మ్యారేజ్ బ్యూరోలు ప్రవేశించాయి..

వంద అబద్ధాలు.. ఒక పెళ్లి.. లక్షల వసూళ్లు..

ఒకప్పుడు పెళ్లి అంటే పెద్దల మాట, పరిచయాల విశ్వాసం, కుటుంబాల మధ్య బాధ్యత, రెండు మనసుల మధ్య బంధం ఈ నాలుగు స్థంభాల మీద నిలబడిన వ్యవస్థ. కానీ నేడు యాప్, సబ్‌స్క్రిప్షన్, కమీషన్, డీల్ క్లోజింగ్.. ఇది పెళ్లి కాదు.. మ్యాట్రిమోనియల్ మార్కెట్.. ఈ మార్పు ఒక్కరోజులో రాలేదు. మొదట పరిచయాల కొరత వచ్చింది. పట్టణీకరణ పెరిగింది. కుటుంబాలు చిన్నవయ్యాయి. పెద్దల పాత్ర తగ్గింది. ఈ ఖాళీలోకి మ్యారేజ్ బ్యూరోలు ప్రవేశించాయి. ప్రారంభంలో అవి అవసరానికి సమాధానం ఇచ్చాయి. కానీ అవసరమే శాశ్వతమైతే, అది వ్యాపారంగా మారడం సహజం. ఇక్కడే అసలు సమస్య మొదలైంది..

కులగణనపై ఓబీసీల సందేహాలు..

ఏ సమాజంలోనైనా వివాహ వ్యవస్థ ఎలా ఉందో చూసి ఆ సమాజం మానవ విలువల స్థాయి అర్థమవుతుంది. భారతీయ సమాజంలో పెళ్లి కేవలం రెండు మనసుల మధ్య ఒప్పందం కాదు.. అది రెండు కుటుంబాల మధ్య బాధ్యతా బంధం, తరాల కొనసాగింపు, సామాజిక భద్రతా వ్యవస్థ. అలాంటి వ్యవస్థ నేడు నెమ్మదిగా కానీ స్పష్టంగా వాణిజ్య మార్కెట్‌గా మారుతోంది..

కర్నూలులో ప్రరవే 8వ మహాసభలు..

సేవ నుంచీ.. దోపిడీ వరకు..

నేడు చాలా మ్యారేజ్ బ్యూరోలు 'సేవ' అన్న పదాన్ని వాడుతున్నప్పటికీ, వాటి పని తీరును గమనిస్తే అవి ఒక రిస్క్ లేని బ్రోకరేజ్ వ్యవస్థలా పనిచేస్తున్నాయి. మొదట్లో మ్యారేజ్ బ్యూరోలు ఒక అవసరంగా పుట్టాయి. ఉద్దేశ్యం మంచిదే, సరైన సంబంధం వెతకడం, కుటుంబాల మధ్య మధ్యవర్తిత్వం, విశ్వసనీయత కానీ ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారిపోయింది. నేడు కనిపిస్తున్న భయంకర వాస్తవాలు, ఒక పెళ్లి కుదిరితే 5% 10% కమిషన్, అబ్బాయి జీతం ఎక్కువైతే 'ప్రీమియం ప్రొఫైల్', అమ్మాయి ఆస్తి ఉంటే 'హాట్ డీల్' ఇది పెళ్లి కాదు.. హ్యూమన్ ట్రేడింగ్, వంద అబద్ధాలాడి ఒక పెళ్లి చేయాలనేది పాత కాలం సూక్తి, కానీ నేడు.. వంద అబద్ధాలాడి ఒక పెళ్లి చేసి లక్షలు దోచుకోవాలి.. అంటే, పెళ్లి ఎంత 'పెద్దది' అయితే, బ్రోకర్ లాభం అంత ఎక్కువ.

సామాన్యుడికి అభయం లేని బడ్జెట్!

లాభం ప్రైవేట్‌కి, నష్టం సమాజానికి..

ఇక్కడ ఒక ప్రాథమిక ప్రశ్న వేయాలి, పెళ్లి కుదరడంలో మధ్యవర్తి పాత్ర ఉందనుకుందాం. కానీ అతనికి అబ్బాయి మంచివాడా? మానసికంగా స్థిరంగా ఉన్నాడా? వ్యసనాలు ఉన్నాయా? మహిళలపై దృక్పథం ఎలా ఉంది? ఇవి నిజాయితీగా పరిశీలించే బాధ్యత వాస్తవంలో లేదు. ఎందుకంటే ఆ ప్రశ్నలకు సమాధానాలు వెతికితే డీల్ ఆలస్యం అవుతుంది, లేదా పూర్తిగా కుదరకపోవచ్చు.. వ్యాపార దృష్టిలో అది 'నష్టం'. ఇదే కారణంగా అబద్ధాలు వ్యవస్థలో భాగమయ్యాయి. ఇది వ్యక్తిగత దుర్మార్గం కాదు. ఇది వ్యవస్థాగత ప్రోత్సాహం. అందుకే ఇవన్నీ 'తర్వాత చూసుకుందాం' అన్న ధోరణితో పెళ్లి చేసేస్తున్నారు. ఇక పెళ్లి తర్వాత సమస్యలు వస్తే అది కుటుంబాల సమస్యగా మారుతుంది, బ్రోకర్ బాధ్యత కాదు. అంటే లాభం ప్రైవేట్‌కి, నష్టం సామాజానికి..

సమాజం మౌనంతో చేసిన హత్య!

నష్టపోతున్న ఆడపిల్ల తల్లిదండ్రులు..

ఈ వ్యవస్థలో అత్యధికంగా నష్టపోతున్న వర్గం ఆడపిల్ల తల్లిదండ్రులు.. ఇది భావోద్వేగ వాదన కాదు, ఒక సామాజిక వాస్తవం. పెళ్లి వయసు దాటిపోతుందేమో అన్న భయం, సమాజపు ప్రశ్నలు, బంధువుల ఒత్తిడి ఇవి ఇప్పటికే మానసి కంగా భారంగా ఉంటాయి. ఈ భయాన్ని కొందరు బ్యూరోలు స్పష్టంగా ఉపయోగించుకుంటున్నారు. 'ఇదే చివరి మంచి సంబంధం', 'ఇలాంటి అబ్బాయి మళ్లీ రాడు' వంటి మాటలు ఒకరకమైన మానసిక మానిప్యులేషన్. ఈ పరిస్థితిలో తల్లిదండ్రులు ఆలోచన కంటే భయంతో నిర్ణయాలు తీసుకుంటున్నారు.. మ్యారేజ్ యాప్స్ ఈ వాణిజ్యీకరణను మరింత వేగవంతం చేశాయి. ఆల్గారిథమ్ ఆధారిత మ్యాచింగ్ అనేది సాంకేతికంగా ఆధునికంగా కనిపించినా, వాస్తవానికి అది కొద్ది కొలమానాలకే పరిమితం. వయసు, జీతం, కులం, ఆస్తి, మానవ స్వభావం, మానసిక ఆరోగ్యం, విలువలు వంటి అంశాలు డేటాగా మారలేవు.. కాబట్టి అవి పూర్తిగా పక్కకు నెట్టబడుతున్నాయి. ఫలితంగా మనిషి ఒక ప్రొఫైల్ కార్డుగా మారిపోయాడు.

ఇలాగే అయితే...

విద్య, వైద్యం వాణిజ్యమైతే ఫలితాలు మనం ఇప్పటికే చూస్తున్నాం. ఇప్పుడు వివాహ వ్యవస్థ కూడా అదే దారిలో నడిస్తే, దాని ప్రభావం మరింత లోతుగా ఉంటుంది. ఎందుకంటే కుటుంబం అనేది సమాజానికి మూల యూనిట్. కుటుంబాలు బలహీనపడితే, చట్టాలు ఎంత ఉన్నా సమాజం నిలబడదు.. దీర్ఘకాలంలో సామాజిక అసమతుల్యత పెరుగుతుంది. పెళ్లి ఒక డీల్‌గా మారితే, విశ్వాసం బలహీనపడుతుంది, కుటుంబాలు అస్థిరమవుతాయి. ఇది 'ఆధునికత వర్సెస్ సంప్రదాయం' అనే సులభమైన చర్చ కాదు. మార్పు అవసరం. యాప్స్ అవసరం. కానీ నియంత్రణ లేకుండా, బాధ్యత లేకుండా, లాభమే లక్ష్యంగా మారితే అది అభివృద్ధి కాదు, మానవతా విలువల క్షీణత.

### పరిష్కారం...


ఈ పరిస్థితికి పరిష్కారం రెండు స్థాయిల్లో ఉండాలి. ఒకటి వ్యవస్థాగతంగా.. అంటే మ్యారేజ్ బ్యూరోలకి చట్ట బద్ధమైన నమోదు, కమిషన్ పరిమితులు, తప్పుడు సమాచారానికి శిక్షలు, కనీస వెరిఫికేషన్ ప్రమాణాలు అవసరం. రెండోది సామాజికం.. కుటుంబాలు 'పెళ్లి కుదిరితే చాలు' అనే ఆలోచన నుంచి 'ఎలాంటి పెళ్లి' అనే ప్రశ్న వైపు మారాలి. ఎందుకంటే పెళ్లి అనేది మార్కెట్ డీల్ కాదు.. అది జీవితకాల బాధ్యత. దాన్ని పూర్తిగా వ్యాపారంగా మార్చి భవిష్యత్ తరాల మానసిక ఆరోగ్యాన్ని కూడా ప్రమాదంలోకి నెడుతున్నాం. పెళ్లి అంటే బాధ్యత, విశ్వాసం, మానవత్వం. వాటిని కమీషన్లలో కొలవడం మన సమాజం చేసిన నైతిక అపరాధం. ఇది ఇప్పుడే ఆలోచించాల్సిన సమయం.. తర్వాత కాదు..

## రాష్ట్రాల హక్కులపై కేంద్రం కబ్జా




భారతదేశం అనే మహావృక్షానికి రాష్ట్రాలే వేళ్లు. వేళ్లు బలంగా ఉంటేనే వృక్షం వర్ధిల్లుతుంది. కానీ, నేడు ఆ వేళ్లకు అందాల్సిన పోషకాలను కేంద్రం తన గుప్పిట్లోకి తీసుకుంటూ, రాష్ట్రాల స్వయంప్రతిపత్తిని నీరుగారుస్తున్నది. దేశాభివృద్ధిలో ఇంజిన్లుగా పని చేస్తున్న రాష్ట్రాలకు బాసటగా నిలువాల్సిన కేంద్రం.. కన్నతల్లే దయ్యమైనట్టు రాష్ట్రాల వాటాను కబళించాలని చూడటం రాజ్యాంగబద్ధమైన సమాఖ్య స్ఫూర్తికే గొడ్డలిపెట్టు. ఇది కేవలం నిధుల పంపిణీకి సంబంధించిన సాంకేతిక అంశం కాదు; ప్రగతిని కాంక్షించే ప్రతి పౌరుడి ఆత్మగౌరవానికీ సంబంధించిన సమస్య. కేంద్రంలో అధికారంలో కాంగ్రెస్ బీజేపీ ఉన్నా దక్షిణాది రాష్ట్రాల పట్ల అనుసరిస్తున్న వివక్షాపూరిత వైఖరి మాత్రం ఒక్కటే. గడిచిన ఆరు ఆర్థిక సంఘాల కాలపరిమితిని విశ్లేషిస్తే, నాలుగు పర్యాయాలు బీజేపీ ప్రాతినిధ్యం ఉంటే, మరో మూడు పర్యాయాలు కాంగ్రెస్ భాగస్వామ్యం ఉన్నది. అంటే ఢిల్లీ పీఠంపై ఏ జెండా ఉన్నా, దక్షిణాది రాష్ట్రాల ఆర్థిక మూలాలను దెబ్బతీసి, నిధులను దారి మళ్లించడంలో మాత్రం ఆ రెండు పార్టీలది ఒకే బాట. పార్టీలు మారినా, రాష్ట్రాల హక్కులను హరించి అధికారాన్ని కేంద్రంలో కుప్పబోసుకోవాలనే వారి ఆలోచనా ధోరణిలో ఏమాత్రం మార్పు లేదు. దక్షిణాది రాష్ట్రాలు గడిచిన నాలుగు దశాబ్దాలుగా మానవాభివృద్ధి సూచికల్లో దేశానికే దిక్సూచిగా నిలిచాయి. జనాభా నియంత్రణ, అక్షరాస్యత, ఆరోగ్య రంగాల్లో ఈ రాష్ట్రాలు సాధించిన అద్భుత ప్రగతి నేడు దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలుస్తున్నది. దేశ జీడీపీలో దాదాపు 30 శాతానికి పైగా వాటాను అందిస్తూ, కేంద్ర ఖజానాకు సింహభాగం ఆదాయాన్ని సమకూరుస్తున్న ఈ రాష్ట్రాల పట్ల కేంద్రం అమానవీయమైన పద్ధతిలో వ్యవహరిస్తున్నది. 11వ ఆర్థిక సంఘం కాలంలో దక్షిణాది రాష్ట్రాల పన్నుల వాటా 21.1 శాతం. అది 15వ ఆర్థిక సంఘం నాటికి 15.8 శాతానికి పడిపోయింది. ఇటీవల 16వ ఆర్థిక సంఘం స్వల్ప సర్దుబాటు, గత దశాబ్దకాలంగా జరిగిన భారీ నష్టాన్ని ఏమాత్రం పూడ్చలేని నామమాత్రపు ఓదార్పు. రాష్ట్రాలకు ఊతమివ్వకుండా నిధుల్లో కోత కోయడం ప్రగతిశీలతకు వేస్తున్న జరిమానా తప్ప మరొకటి కాదు. కేంద్ర ప్రభుత్వం 'సెస్సులు, సర్‌చార్జీల' పేరుతో రాష్ట్రాల రాజ్యాంగబద్ధమైన వాటాను అత్యంత చాకచక్యంగా తప్పిస్తున్నది. పన్నుల ఆదాయంలో రాష్ట్రాలకు వాటా ఇవ్వాలి కానీ, సెస్సుల రూపంలో వసూలు చేసే నిధులను రాష్ట్రాలతో పంచుకోవాల్సిన అవసరం లేదనే రాజ్యాంగ లొసుగును కేంద్రం అస్త్రంగా వాడుకుంటున్నది. ఫలితంగా, రాష్ట్రాలకు పంచాల్సిన నిధుల రాశి క్రమంగా కుంచించుకుపోతున్నది. 'నానాటికి తీసికట్టు నాగంభొట్లు' అన్న చందంగా రాష్ట్రాల అధికారాలు, నిధులు తగ్గిపోతుంటే.. అవి కేవలం సాధారణ పరిపాలనకు మాత్రమే తప్ప, మరే గొప్ప ప్రజాహిత కార్యక్రమం చేపట్టలేని నిస్సహాయతలోకి జారిపోతున్నాయి. కేంద్రం చేసే ఈ లోపాయికారి దోపిడీ వల్ల నిధులు లేక రాష్ట్రాలు విలవిల్లాడుతుంటే, క్షేత్రస్థాయిలో ప్రజల అసంతృప్తికి మాత్రం రాష్ట్ర ప్రభుత్వాలే మొదటి లక్ష్యం (టార్గెట్)గా మారుతున్నాయి. సామాన్య ప్రజలకు ఈ సంక్లిష్ట ఆర్థిక సమీకరణాలు అర్థం కావు కనుక కేంద్రం తెలివిగా బాధ్యత నుంచి తప్పించుకుంటున్నది. జాతీయ స్థాయి ఎన్నికలు వచ్చినప్పుడు అసలైన ఆర్థిక సమస్యలు చర్చకు రాకుండా, భావోద్వేగాలను రెచ్చగొట్టి ప్రజల దృష్టిని మళ్లించి ఓట్లు కొల్లగొడుతున్నది. ప్రజల అవసరాలు తీర్చలేని నేరానికి రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల ముందు దోషులుగా నిలబడి బలి అయిపోతుంటే, ఆ నిస్సహాయతకు అసలు కారణమైన కేంద్రం మాత్రం తెరచాటున పబ్బం గడుపుకొంటున్నది. కేంద్రం చేస్తున్న ఈ దాడి.. ఇంద్రజిత్తు మేఘాల చాటున దాగి చేసే యుద్ధంలా ఉన్నది. బాణం విడిచిన వాడు కనపడడు కానీ, ఆ బాణం రాష్ట్రాల గుండెలకు తగిలి ప్రాణం పోతున్నది. ఒక ప్రాంతం కష్టపడి సంపాదించి పెడుతున్నా, తమ న్యాయబద్ధమైన వాటాను కేంద్రం కాలరాస్తున్నదన్న భావన బలపడితే, అది దేశ సమగ్రతకు ఏమాత్రం క్షేమకరం కాదు. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధిని ఎవరూ కాదనరు, కానీ అది ప్రగతిశీల రాష్ట్రాల ప్రయోజనాలను దెబ్బతీస్తూ జరగకూడదు. రాష్ట్రాలు కేంద్రంపై ఆధారపడే యాచకులుగా కాకుండా, దేశ నిర్మాణంలో సమాన భాగస్వాములుగా గుర్తింపు పొందినప్పుడే నిజమైన సమాఖ్య వ్యవస్థ వర్ధిల్లుతుంది.

# BSNL నుంచి న్యూ ఇయర్ గిఫ్ట్.. ఒక నెల ఫ్రీ ఇంటర్నెట్.. అతి చవక ధరకే కనెక్షన్




sబీఎస్ఎన్ఎల్ తమ కస్టమర్లకు న్యూ ఇయర్ ఆఫర్ తీసుకొచ్చింది. అతి తక్కువ ధరకే హై స్పీడ్ వైఫై ప్లాన్‌ను ప్రకటించింది. ఈ ప్లాన్‌తో అత్యంత చౌక ధరకే ఇంటర్నెట్ సౌకర్యం పొందవచ్చు. అలాగే అతి తక్కవ ధరలో టీవీ ఛానెల్స్ వీక్షించే ప్లాన్ కూడా తెచ్చింది. కేంద్ర ప్రభుత్వ టెలికాం రంగ సంస్థ అయిన బీఎస్ఎన్ఎల్ మొబైల్ నెట్‌వర్క్ సేవలే కాకుండా బ్రాడ్‌బ్యాండ్ సేవలు కూడా అందిస్తున్న విషయం తెలిసిందే. చౌకైన ధరలకే వైఫై ప్లాన్లను అందిస్తోంది. ప్రైవేట్ బ్రాడ్‌బ్యాంక్ ప్లాన్ల ధరలు అధికంగా ఉంటాయి. రూ.500 నుంచి వైఫై ప్లాన్లు ప్రారంభమవుతాయి. కానీ బీఎస్ఎన్ఎల్ తక్కువ ధరలో హైస్పీడ్ బ్రాడ్‌బ్యాంక్ కనెక్షన్లను అందిస్తోంది. దీంతో బీఎస్ఎన్ఎల్ వైఫై కనెక్షన్ తీసుకునేవారి సంఖ్య పెద్ద మొత్తంలో ఉంటుంది. ఎప్పటికప్పుడు బ్రాడ్‌బ్యాండ్ కనెక్షన్లపై ఆఫర్లు ప్రకటిస్తున్న బీఎస్ఎన్ఎల్.. న్యూఇయర్ సందర్భంగా బంపర్ ఆఫర్ ప్రకటించింది.

**రూ.399కే బేసిన్ ప్లాన్**

బీఎస్ఎన్ఎల్ తాజాగా రూ.399కే బేసిక్ ఫైబర్ ప్లాన్ తీసుకొచ్చింది. ఈ ప్లాన్ తీసుకున్నవారికి తొలి నెల ఫ్రీగా సర్వీస్ లభిస్తుంది. ఇక తర్వాత మూడు నెలల పాటు వైఫై రీఛార్జ్‌పై రూ.100 డిస్కౌంట్ అందిస్తుంది. ఈ ప్లాన్‌లో 60 ఎంబీపీఎస్ వరకు ఇంటర్నెట్ స్పీడ్ లభించడంతో పాటు నెలకు 3300 బీజీ డేటా పొందవచ్చు. 18004444 నంబర్‌కు వాట్సప్ ద్వారా '%ఎఱ% అని మెస్సేజ్ పంపడం ద్వారా మీరు ఈ ప్లాన్ పొందవచ్చు. గతంలో ఈ ప్లాన్ ధర రూ.499 ఉండగా.. ఇప్పుడు న్యూ ఇయర్ ఆఫర్ కింద రూ.399కి తగ్గించారు. 3300జీబీ వరకు 60 ఎంబీపీఎస్ ఇంటర్నెట్ స్పీడ్ వస్తుంది. ఆ తర్వాత 4 ఎంబీపీఎస్ స్పీడ్ పొందవచ్చు.

**రూ.61 రీఛార్జ్‌తో వెయ్యి ఛానెల్స్**

ఇక బీఎస్ఎన్ఎల్ ప్రీమియమ్ ప్యాక్ తీసుకొచ్చింది. దీని ద్వారా సెటాప్ బాక్స్ అవసరం లేకుండా టీవీ ఛానెల్స్ చూడవచ్చు. కేవలం రూ.61 రీఛార్జ్‌తో వెయ్యి ఛానెల్స్ చూడవచ్చు. అలాగే రూ.151తో లైట్ ప్లే హెచ్‌డీ ప్లాన్ అందుబాటులోకి తెచ్చింది. దీని ద్వారా మీరు హెచ్‌డీ ఛానెల్స్‌ను చూడవచ్చు. ఈ సర్వీస్ యాక్టివ్ చేసుకోవాలంటే 1800 444 నెంబర్‌కు వాట్సప్ ద్వారా మెస్సేజ్ చేయాలి.

# కేంద్రం కీలక నిర్ణయం.. మారనున్న ఇన్‌కమ్ ట్యాక్స్ రూల్స్.. అమల్లోకి కొత్త ఐటీ చట్టం




కొత్త ఐటీ చట్టాన్ని తీసుకురావాలని కేంద్ర ప్రభుత్వం ఎప్పటినుంచో ప్రయత్నాలు చేస్తోంది. 1961లో అప్పటివరకు ఉన్నవాటిల్లో మార్పులు చేసి కొత్త చట్టం అమల్లోకి తెచ్చారు. ఇప్పుడు వాటిల్లో కూడా మార్పు చేసి సరికొత్త చట్టం తీసుకురానున్నారు. వచ్చే ఏడాది నుంచి ఈ చట్టం అమలు చేయనున్నారు. ప్రస్తుతం పార్లమెంట్ శీతాకాల సమావేశాలు జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ నెల 19వ తేదీ వరకు జరగనున్న సమావేశాల్లో పలు కీలక బిల్లులను కేంద్ర ప్రభుత్వం ఆమోదించనుంది. మహాత్మాగాంధీ గ్రామీణ జాతీయ ఉపాధి హామీ పథకం చట్టాన్ని రద్దు చేసి కొత్త చట్టాన్ని తీసుకొచ్చే కీలక బిల్లుతో పాటు మరికొన్ని బిల్లులను ప్రవేశపెట్టనుంది. ఈ క్రమంలో కొత్త ఆదాయపు పన్ను చట్టం ఎప్పటినుంచి అమలు చేస్తారనేది చర్చనీయాంశంగా మారింది. ఆదాయపు పన్ను చట్టం 2025 ఇప్పటికే పార్లమెంట్ ఆమోదం పొందగా.. కొత్త ఏడాది ఏప్రిల్ నుంచి అమల్లోకి రానుంది. ఈ చట్టంలో ఏవేం ప్రత్యేకలు ఉన్నాయో ఇప్పుడు తెలుసుకుందాం.


**సెక్షన్లు తగ్గింపు**

గతంలో ఆదాయపు పన్ను చట్టంలో ఉన్న 47 చాప్టర్లను 23కి తగ్గించారు. అలాగే 819 సెక్షన్లను 536కి తగ్గిస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఇక షెడ్యూల్ సంఖ్య 16కి పరిమితం చేశారు. సెక్షన్ 10లో ఉన్న అన్ని మినహాయింపులను షెడ్యూల్స్‌లో చేర్చారు. వాడుకలో లేని పదాలను ఇప్పుడు తొలగించారు. ఇక ఇప్పటివరకు ఇన్‌కమ్ ట్యాక్స్ చెల్లించేటప్పుడు ఆర్థిక సంవత్సరం సెలక్ట్ చేసేటప్పుడు కన్‌ఫ్యూజన్ ఉండేది. అస్సెస్సుమెంట్ ఇయర్, ఫైనాన్సియల్ ఇయర్ వంటివి ఉండేవి. వీటి విషయాల్లో చాలా తికమక ఉండేది. కానీ ఇక నుంచి పన్ను సంవత్సరం అనేది పదం ఉపయోగించన్నారు. ఇక టీడీఎస్ అన్ని అంశాలను ఒకే సెక్షన్‌లో చేర్చారు. అలాగే ఇప్పటివరకు ఐటీ రైడ్స్ అంటే ఆఫీసులు, ఇళ్లు వాటిని ఎంచుకునేవారు. ఇకపై ఈమెయిల్స్, సోషల్ మీడియా అకౌంట్లు, క్లౌడ్ సర్వర్లు అనెనీ చెక్ చేయనున్నారు.

**పాత పదజాలానికి ఎండ్ కార్డ్**

ఇన్‌కమ్ ట్యాక్స్‌లో ఉపయోగించే పాత పదజాలానికి బదులు ఆధునిక పరిస్థితులకు అనుగుణంగా కొత్త పదజాలాన్ని అందుబాటులోకి తెచ్చారు. అలాగే క్రిప్టో, వర్చువల్, డిజిటల్ కరెన్సీకి కూడా హక్కులు వచ్చేలా కొత్త ఐటీ చట్టం రూపొందించారు. ఇక ఐటీ అధికారులకు రైడ్స్ విషయంలో విస్తృత అధికారులు కల్పించారు. ఫిబ్రవరిలో కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ ప్రవేశపెట్టనుంది. వచ్చే ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ 1 నుంచి ఐటీ చట్టాన్ని అమల్లోకి తీసుకురానున్నారు.

# యూపీఐ యాప్స్ వాడేవారికి హెచ్చరిక.. ఇలాంటివి జరిగితే డబ్బులు పంపించకండి..




ఇటీవల సైబర్ మోసాలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. సైబర్ నేరగాళ్లు వినూత్న పద్ధతుల్లో జనాల్ని మోసం చేస్తున్నారు. యూపీఐ యాప్స్‌లో నకిలీ అకౌంట్లను సృష్టించి మోసం చేస్తున్నారు. దీంతో యూపీఐ యాప్స్‌లో ఎవరికైనా తెలియని వ్యక్తికి డబ్బులు పంపించేటప్పుడు జాగ్రత్తలు అవసరం. ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో ఇప్పుడు చూద్దాం. ప్రస్తుతం డిజిటల్ యుగం నడుస్తోంది. అన్నీ సేవలు ఆన్‌లైన్‌లోనే అందుబాటులోకి వచ్చేశాయి. ఏ సర్వీస్ కావాలన్నా మొబైల్ ద్వారా ఇంటి నుంచే చేసుకునే వెసులుబాటు లభించింది. టెక్నాలజీని ఉపయోగించుకోవడంలో బ్యాంకింగ్ రంగం ముందు వరుసలో ఉంది. కస్టమర్లను ఆన్‌లైన్ ద్వారా అన్నీ సేవలు అందిస్తున్నాయి. అకౌంట్ ఓపెనింగ్ దగ్గర నుంచి నగదు లావాదేవీలు, క్రెడిట్ కార్డు, లోన్ సేవలు అన్నీ ఆన్‌లైన్ ద్వారానే అందిస్తున్నాయి. దీని వల్ల బ్యాంక్‌కు వెళ్లి క్యూలైన్‌లో నిల్చోవాల్సిన అవసరం తప్పింది. మొబైల్ నుంచి సులువుగా బ్యాంక్ సేవలన్నీ పొందుతున్నారు. ఇక యూపీఐ రాకతో డిజిటల్ ట్రాన్సాక్షన్లు మరింతగా పెరిగాయి. ఒక నిమిషంలోనే ఎవరికైనా నగదు పంపించుకోవడం లేదా స్వీకరించడం, బ్యాలెన్స్ చెక్ చేసుకోవడం లాంటి ఫీచర్లు ఉండటంతో యూపీఐ యాప్స్ వాడకం విపరీతంగా పెరిగిపోయింది. డిజిటల్ లావేదేవీలు పెరిగిన క్రమంలో సైబర్ నేరగాళ్లు తమ మోసాలకు దీనిని అడ్డాగా మార్చుకుంటున్నారు. ఆన్‌లైన్ మోసాలకు పాల్పడుతూ సులువుగా డబ్బులు కొట్టేస్తున్నారు. బ్యాంక్ ఓటీపీలు, కేవైసీ అప్డేట్, యూపీఐ యాప్స్ పేరుతో లక్షల సొమ్ము కొల్లగొడుతున్నారు. డిజిటల్ పేమెంట్ మోసాల బారిన పడి దేశంలో లక్షల మంది తమ సొమ్మును

# ఐసీఐసీఐ కస్టమర్లకు బిగ్ అలర్ట్.. జనవరి నుంచి కొత్త రూల్స్.. వాటిపై అదనంగా ఛార్జీలు..




ఐసీఐసీఐ క్రెడిట్ కార్డు వాడుతున్నారా..? అయితే మీకు అలర్ట్. జనవరి నుంచి ట్రాన్సాక్షన్లు, రివార్డ్ పాయింట్లు, సర్వీస్ ఛార్జీలపై పలు మార్పులు చోటుచేసుకోనున్నాయి. జనవరి 15 నుంచి ఈ కొత్త రూల్స్ అమల్లోకి రానున్నాయి. దీంతో క్రెడిట్ కార్డ్ వాడేవారు ముందే తెలుసుకోండి.. త్వరలో న్యూ ఇయర్ వస్తుండటంతో బ్యాంకులు తమ సర్వీసులకు సంబంధించి పలు మార్పులు చేస్తున్నాయి. బ్యాంకింగ్ సర్వీసులపై కొత్త ఏడాది నుంచి కొత్త రూల్స్‌ను అమలు చేసేందుకు రెడీ అవుతున్నాయి. క్రెడిట్ కార్డ్, ఆన్‌లైన్ ట్రాన్సాక్షన్లు, యూపీఐ ఛార్జీలకు సంబంధించి కొత్త మార్పులు తీసుకొచ్చేందుకు బ్యాంకులు రెడీ అవుతున్నాయి. ఈ క్రమంలో దేశంలోనే ప్రముఖ ప్రైవేట్ బ్యాంక్ అయిన ఐసీఐసీఐ బ్యాంక్ తమ కస్టమర్లకు కీలక ప్రకటన విడుదల చేసింది. ఐసీఐసీఐ కోరల్ రూపే క్రెడిట్ కార్డ్ ఉపయోగించేవారికి క్రెడిట్ కార్డు ఛార్జీలు, రివార్డ్ పాయింట్స్‌లో పలు మార్పులు చేసింది.

**కొత్త ఛార్జీలు**

క్రెడిట్ కార్డు ఆన్‌లైన్ ట్రాన్సాక్షన్లపై విధించే ఛార్జీలలో మార్పులు చేసింది. డ్రీమ్11, రమ్మీ కల్చర్, జంగ్లీ, %వీూా% వంటి ప్లాట్‌ఫామ్‌లలో నిర్వహించే లావాదేవీలపై 2 శాతం ఛార్జీ విధించనుంది. అలాగే అమెజాన్ పే,పేటీఎం, మోబిక్విక్, ఫ్రీఛార్జ్, ఓలా మనీ లాంటి థర్డ్ పార్టీ వాలెట్లలో క్రెడిట్ కార్డుల నుంచి డబ్బులు యాడ్ చేయాలంటే చార్జీలు విధించనుంది. రూ. 5 వేల కంటే ఎక్కువ నగదు ట్రాన్సక్షన్లపై 1 శాతం ఛార్జీ వసూలు చేయనుంది. ఇక ట్రాన్స్‌పోర్టేషన్ మర్చంట్ కేటగిరీ కోడ్ రూ.50 వేలు దాటిన ట్రాన్సాక్షన్లకు 1 శాతం ఛార్జీ విధించనుంది. వచ్చే ఏడాది జనవరి 15వ తేదీ నుంచి వీటిని అమల్లోకి తీసుకురానున్నట్లు ఐసీఐసీఐ బ్యాంక్ తెలిపింది.

**క్రెడిట్ కార్డు బిల్లు**

ఇక క్రెడిట్ కార్డ్ బిల్లును బ్యాంక్‌కు వెళ్లి చెల్లించాలనుకుంటే.. ప్రతి చెల్లింపు లావాదేవీకి రూ.150 వసూలు చేస్తారు. ఇక విదేశాల్లో భారత కరెన్సీలో నిర్వహించే ప్రతి లావాదేవీకి లేదా దేశంలోనే విదేశీ దేశంలో నమోదు చేసుకున్న వ్యాపారులతో భారత కరెన్సీలో నిర్వహించే లావాదేవీలకు రుసుము వర్తిస్తుంది.

# మతిపోగొట్టే రాబడి ఇస్తున్న గోల్డ్ జుఖీలు..! 2026లో మరింత పెరిగే అవకాశం ఉందా అంటే..?



బంగారం, వెండి ధరలు 2025లో భారీ రాబడిని అందించాయి, ముఖ్యంగా గోల్డ్ లు 72 శాతం పైగా లాభపడ్డాయి. స్టాక్, క్రిప్టో మార్కెట్లను మించిపోయాయి. ప్రపంచ వడ్డీ రేట్ల తగ్గింపులు, బలహీనమైన డాలర్, కేంద్ర బ్యాంకుల కొనుగోళ్లతో బంగారం 'సేఫ్ హెవెన్'గా మారింది. బంగారం, వెండి ధరలు ఈ ఏడాది ఎలా పెరిగాయో అందరికీ తెలిసిందే. బంగారంపై పెట్టుబడి పెట్టిన వారికి భారీ రాబడి అందించాయి. ఈ సంవత్సరం అత్యుత్తమ పనితీరు కనబరిచిన ఆస్తులుగా ఉద్భవించాయి. ఇవి స్టాక్, క్రిప్టో మార్కెట్ల నుండి వచ్చే రాబడిని మించిపోయాయి. 2025లో బంగారం పెరుగుదల పెట్టుబడిదారులను ఈ మార్కెట్ వైపు ఆకర్షించింది ఎక్స్ఛేంజ్-ట్రేడెడ్ ఫండ్స్‌వరుసగా ఏడవ నెలలోనూ పెట్టుబడులు పెరిగాయి. డేటా ప్రకారం.. నవంబర్‌లో బంగారు లపై పెట్టుబడిదారుల ఆసక్తి బలంగా ఉంది. రూ.3,741 కోట్ల నికర పెట్టుబడులు నమోదయ్యాయి. ఈ సంవత్సరం ఉత్తమ పనితీరు కనబరిచిన బంగారు లు 72 శాతం కంటే ఎక్కువ రాబడిని అందించాయి, పెట్టుబడిదారులకు వాటి ఆకర్షణను మరింత పెంచాయి. ఛాయిస్ వెల్త్ రిసెర్చ్ అండ్ ప్రొడక్షన్ విభాగాధిపతి అక్షత్ గార్గ్ మింట్ నివేదికలో మాట్లాడుతూ.. ర్యాలీ నిస్సందేహంగా బలంగా ఉందని, దీనికి మార్కెట్ వాతావరణం కొంతవరకు కారణమని అన్నారు. ప్రపంచ వడ్డీ రేటు తగ్గింపులను ఊహించి, సురక్షితమైన స్థలాలను వెతుక్కుంటూ పెట్టుబడిదారులు %జుఖీ%లలోకి డబ్బును కుమ్మరించారు. దీనితో బంగారం ధరలు సాధారణం కంటే పెరిగాయి. అయితే డిమాండ్ వాతావరణం, బలమైన మద్దతు అలాగే ఉందని గార్గ్ స్పష్టం చేశారు, ఎందుకంటే కేంద్ర బ్యాంకులు బంగారం కొనుగోలు చేస్తూనే ఉన్నాయి, డాలర్ బలహీనంగా ఉంది. బలహీనమైన డాలర్ ఇతర కరెన్సీలను కలిగి ఉన్నవారికి బంగారాన్ని చౌకగా చేస్తుంది. ఇంకా కేంద్ర బ్యాంకులు వడ్డీ రేట్లను తగ్గిస్తాయని భావిస్తున్నారు, దీనివల్ల వడ్డీ లేని బంగారాన్ని మరింత ఆకర్షణీయంగా మారుస్తుంది.

# వెండి ధర రూ.2.50 లక్షలకు చేరుతుందా..? ఆర్థిక నిపుణుల అంచనా ఎలా ఉందంటే?



గత కొన్ని నెలలుగా బంగారం, వెండి ధరలు గణనీయంగా పెరుగుతున్నాయి. ఈ ఏడాది వెండి ధర 120 శాతం పెరిగి, రూ.2 లక్షల మార్కును దాటి, 46 సంవత్సరాల రికార్డును బద్దలు కొట్టింది. సౌరశక్తి, ఇతర పారిశ్రామిక రంగాలలో డిమాండ్, పెట్టుబడిదారులు వెండిని సురక్షిత ఆస్తిగా చూడటం దీనికి కారణం. గత కొన్ని నెలలుగా బంగారం, వెండి ధరలు బాగా పెరుగుతున్నాయి. మధ్యలో కాస్త హెచ్చుతగ్గులకు కూడా గురయ్యాయి. ఈ సంవత్సరం వెండి ధర బంగారం కంటే ఎక్కువగా పెరిగింది. ఒక సంవత్సరంలో వెండి ధర దాదాపు 120 శాతం పెరిగింది. ఇప్పుడు ఇదే వెండి ధర వచ్చే ఏడాది రూ.2.5 లక్షలకు మించి ఉంటుందని భావిస్తున్నారు. డిసెంబర్ 12న దేశీయ మార్కెట్లో వెండి ధర కిలోకు రూ.2 లక్షలకు పైగా చేరుకుంది. వెండి ధర గత 46 సంవత్సరాల రికార్డును బద్దలు కొట్టింది. 1979 తర్వాత వెండి ధర ఇంత పెద్ద మొత్తంలో పెరగడం ఇదే మొదటిసారి. భవిష్యత్తులో కూడా వెండి ధర పెరుగుతూనే ఉంటుందని చెబుతున్నారు. విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం, రాబోయే సంవత్సరంలో వెండి ధర రూ.2 లక్షల 40 వేల నుండి రూ.2 లక్షల 50 వేల వరకు పెరగవచ్చు. అంటే, ప్రస్తుత ధరతో పోలిస్తే వచ్చే ఏడాది వెండి ధర 25 శాతం పెరగవచ్చు. ఎప్రస్తుతం వివిధ రంగాలలో బంగారం డిమాండ్ పెరిగింది. పారిశ్రామిక ప్రపంచంలో ఈ లోహాన్ని పెద్ద మొత్తంలో ఉపయోగిస్తున్నారు. మరోవైపు ప్రజలు వెండిని కూడా పెట్టుబడిగా చూస్తున్నారు. సౌరశక్తి రంగంలో గత నాలుగు సంవత్సరాలలో బంగారం డిమాండ్ నాలుగు రెట్లు పెరిగింది. 2020లో సౌరశక్తి రంగంలో వెండి డిమాండ్ 94.4 మిలియన్ ఔన్సులు. ఇప్పుడు 2024లో, అదే డిమాండ్ 243.7 మిలియన్ ఔన్సులకు పెరిగింది. అందువల్ల, భవిష్యత్తులో బంగారం ధర రూ.2.5 లక్షల (కిలోకు) వరకు పెరిగే అవకాశం ఉందని ఆర్థిక నిపుణులు కూడా అంటున్నారు.

# కొత్త ఫోన్ కొనాలనుకుంటున్నారా? తక్కువ బడ్జెట్‌లో బెస్ట్ ఫీచర్లు కావాలంటే దీనిపై ఓ




లావా తన అగ్ని 4 5%స్మార్ట్‌ఫోన్‌ను ఇండియాలో రూ.24,999 ధరకు విడుదల చేసింది. ఇది 1.5%ఖ ూమీూజుణ 120 డిస్‌ప్లే, డైమెన్సిటీ 8350 చిప్‌సెట్, 50% కెమెరా, 5000% బ్యాటరీని కలిగి ఉంది.ఆధారిత ప్లాట్‌ఫారమ్‌తో క్లీన్ ఆండ్రాయిడ్ అనుభవాన్ని అందిస్తూ, బోల్డ్ సెకండరీ రియర్ డిస్‌ప్లేతో ప్రీమియం విభాగంలోకి అడుగుపెట్టింది. భారతీయ స్మార్ట్‌ఫోన్ బ్రాండ్ లావా తన అగ్ని 4 లాంచ్‌తో ప్రీమియం లైనప్‌ను విస్తరించింది. ఇండియాలో దీని ధర రూ.24,999 గా ఉంది. బోల్డ్ సెకండరీ రియర్ డిస్‌ప్లేతో వస్తోంది. లావా అగ్ని 4ని దాని కొత్త ఎయిర్ ప్లాట్‌ఫామ్ కింద క్లీన్, నియర్-స్టాక్ ఆండ్రాయిడ్ ఎక్స్‌పీరియన్స్,-ఆధారిత ఫీచర్లతో వర్క్‌సెంట్రల్ స్మార్ట్‌ఫోన్‌గా నిలబెట్టింది అగ్ని 4 5+ 6.67-అంగుళాల 1.5%ఖ ూమీూజుణ% డిస్‌ప్లేను 120 రిఫ్రెష్ రేట్, 2,400 నిట్స్ వరకు పీక్ బ్రైట్‌నెస్, స్లిమ్ బెల్స్‌తో ఫ్లాట్ ప్యానెల్‌ను కలిగి ఉంది. ఈ డిస్ప్లే చాలా హుషారైనదిగా, స్పష్టంగా కనిపిస్తుంది. గేమింగ్, వీడియో స్ట్రీమింగ్/అతిగా చూడటానికి కచ్చితంగా అనుకూలంగా ఉంటుంది. ఇది మంచి ధ్వనిని అందించే, మల్టీమీడియా వినియోగాన్ని పెంచే డ్యూయల్ స్టీరియో స్పీకర్లతో కూడా వస్తుంది. లావా అగ్ని 4 ను మీడియాటెక్ డైమెన్సిటీ 8350 చిప్‌సెట్ శక్తివంతం చేస్తుంది, ఇది 4,300 లిక్విడ్ కూలింగ్ సిస్టమ్ ద్వారా సమర్థవంతమైన థర్మల్ మేనేజ్‌మెంట్ దీనికి ప్లస్‌పాయింట్. ఇది దాని విభాగంలో అత్యంత వేగవంతమైన స్మార్ట్‌ఫోన్‌లలో ఒకటి, ఇది సుదీర్ఘ గేమింగ్, రోజువారీ వినియోగం వంటి సామర్థ్యాలతో ఉంటుంది. 50% ప్రైమరీ కెమెరా, 8%్గా అల్ట్రా-వైడ్ కెమెరాతో డ్యూయల్ రియర్ కెమెరా సెటప్ ఉంది. ముందు భాగంలో 50% ఫ్రంట్ షూటర్‌ను కలిగి ఉంది. ఈ ఫోన్ 66% ఫాస్ట్ ఛార్జింగ్‌తో 5,000%పూాష్ట్ర% బ్యాటరీని కలిగి ఉంది.ోగొట్టుకుంటున్నారు. దీంతో మోసాల గురించి మీకు ముందే అవగాహన ఉంటే క్రిమినల్స్ బారి నుంచి తప్పించుకోవచ్చు. మీరు డిజిటల్ ట్రాన్సాక్షన్లు నిర్వహించేటప్పుడు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో ఇప్పుడు చూద్దాం. ఈ జాగ్రత్తలు పాటించండి డిజిటల్ పేమెంట్స్ చేసేటప్పుడు యాప్ నోటిఫికేషన్లను పరిశీలించండి

## భారత్ సూపర్ 8 మ్యాచ్ లు ఫిక్స్

## పూర్తి షెడ్యూల్ ఇదే-ఎప్పుడు, ఎవరితో ఆడనుందో తెలుసా

### 2026- సూపర్ 8కు అర్హత సాధించిన జట్లపై క్లారిటీ- రెండు గ్రూపులుగా మొత్తం 12 మ్యాచ్ లు- భారత్‌తో మ్యాచ్‌లు ఇవే!




టీ20 వరల్డ్‌కప్‌లో సూపర్ - 8కు అర్హత సాధించిన జట్లపై ఓ క్లారిటీ వచ్చేసింది. ఆయా గ్రూపుల నుంచి భారత్, సౌతాఫ్రికా, వెస్టిండీస్, శ్రీలంక ఇప్పటికే సూపర్ 8కు దూసుకెళ్లగా, మిగిలిన కొన్ని స్థానాలపై సస్పెన్స్ కొనసాగింది. అయితే బుధవారం మిగిలిన స్లాట్లపై కూడా క్లారిటీ వచ్చేసింది. తాజాగా నమీబియాపై భారీ విజయంతో పాకిస్థాన్ కు కూడా లైన్ క్లియర్ అయ్యింది. మరి ఈ టోర్నీలో సూపర్ 8కు దూసుకెళ్లిన జట్లేవి? ఈ దశలో భారత్ ఎవరెవరితో ఎప్పుడెప్పుడు ఆడనుందో చూద్దాం!

సూపర్ 8కు అర్హత సాధించిన జట్లివే

ఈ టోర్నీలో సూపర్ 8కు అర్హత సాధించిన ఎనిమిది జట్లేవో తేలిపోయాయి. గ్రూప్ ఏ నుంచి భారత్, పాకిస్థాన్ అర్హత సాధించగా, గ్రూప్ బీ నుంచి శ్రీలంక, జింబాబ్వే సూపర్ 8కు దూసుకెళ్లాయి. ఇక గ్రూప్ సీ నుంచి వెస్టిండీస్, ఇంగ్లాండ్ వెళ్లగా, గ్రూప్ డీ నుంచి సౌతాఫ్రికా, న్యూజిలాండ్ సూపర్ 8కు క్వాలిఫై అయ్యాయి.

రెండు గ్రూపులుగా

20 జట్లను నాలుగు గ్రూపులుగా విభజించి లీగ్ స్టేజ్ మ్యాచ్‌లు నిర్వహించారు. ఇందులోంచి 12 జట్లు నిష్క్రమించగా 8 టీమ్స్ మిగిలాయి. సూపర్ 8 దశను కూడా రెండు గ్రూపులు (+-1, + -2) గా విభజించారు. ఒక్కో గ్రూపులో నాలుగేసి జట్లు ఉంటాయి. ఇందులో సూపర్ 8 +- 1లో భారత్ సహా సౌతాఫ్రికా, వెస్టిండీస్, జింబాబ్వే జట్లు ఉండగా, + - 2లో న్యూజిలాండ్, ఇంగ్లాండ్, శ్రీలంక, పాకిస్థాన్ చోటు దక్కించుకున్నాయి.

మళ్లీ భారత్- పాకిస్థాన్ మ్యాచ్

టోర్నీలోనే హై వోల్టేజ్ మ్యాచ్ భారత్ -పాకిస్థాన్ పోరు గ్రూప్ స్టేజ్‌లో ఆశించిన కిక్ ఇవ్వలేదు. ఈ మ్యాచ్‌లో టీమ్‌ఇండియా వన్ సైడ్ వార్‌గా నడిచింది. దీంతో ఇదే టోర్నీలో మరోసారి ఇండోపాక్ మ్యాచ్ ఉంటుందేమో అని ఫ్యాన్స్ ఆశిస్తున్నారు. ఈ క్రమంలో సూపర్ 8లో ఉంటుందా? అని ఆత్రుతగా ఎదురుచూస్తున్నారు. కానీ, సూపర్ 8 దశలో భారత్- పాకిస్థాన్ మ్యాచ్ లేదు. ఈ రెండు జట్లు వేర్వేరు గ్రూపుల్లో ఉండడమే ఇందుకు ప్రధాన కారణం. అయితే ఈ దశ దాటిన తర్వాత సెమీఫైనల్, లేదా ఫైనల్ లో దాయాదుల పోరు ఉండవచ్చు!

సూపర్ 8లో భారత్ మ్యాచ్‌లు ఇవే

సూపర్ 8 దశలో భారత్ +- 1 గ్రూపులో ఉంది. లీగ్ స్టేజ్ లో మాదిరిగానే రౌండ్ రాబిన్ పద్ధతిలోనే జరగనుంది. అంటే భారత్ తమ తదుపరి మ్యాచ్‌లు జింబాబ్వే, సౌతాఫ్రికా, వెస్టిండీస్ తో ఆడనుంది. ప్రత్యర్థులు కూడా పటిష్ఠంగా ఉండడంతో సూపర్ 8లో టీమ్‌ఇండియాలు అసలైన సవాల్ ఎదురుకానుంది. విండీస్, సౌతాఫ్రికాతో బింబాబ్వే చిన్న జట్టే అయినా, గ్రూప్ దశలో ఆసీస్‌కు షాకిచ్చిన విషయాన్ని మర్చిపోవద్దు. భారత్ - సౌతాఫ్రికా- ఫిబ్రవరి 22 భారత్ - జింబాబ్వే- ఫిబ్రవరి 26 భారత్ - వెస్టిండీస్ - మార్చి 01

సెమీస్‌కు ఇలా

సూపర్ 8 దశలో ఒక్కో జట్టు మూడు మ్యాచ్‌లు ఆడాల్సి ఉంది. అంటే ప్రతీ గ్రూపులో ఉన్న ఒక్కో జట్టు మిగిలిన మూడు టీమ్స్‌తో ఒక్కో మ్యాచ్ ఆడుతుంది. చివరగా ఒక్కో గ్రూప్ లో ఉన్న టాప్ - 2 జట్లు సెమీ ఫైనల్స్‌కు అర్హత సాధిస్తాయి. రెండు సెమీస్‌లో నెగ్గిన జట్లు ఫైనల్‌కు దూసుకెళ్తాయి. అందుకే సెమీస్ చేరాలంటే సూపర్ 8లో కనీసం రెండు మ్యాచ్ ల్లో నెగ్గడం ప్రతీ జట్టుకు అవసరం! మార్చి 04న తొలి సెమీఫైనల్, మార్చి 05న రెండో సెమీఫైనల్ జరగాల్సి ఉంది. మార్చి 08న ఫైనల్ ఉండనుంది. ఈ ఫైనల్ కు పాకిస్థాన్ అర్హత సాధిస్తే, మ్యాచ్ కొలంబోలో ఉంటుంది. లేదంటే అహ్మదాబాద్ వేదికగా ఫైనల్ జరుగుతుంది.

## ఉచితంగా రూ.1000 ఫాస్టాగ్ రీఛార్జ్ పొందండి!

## జస్ట్ ఒక్క ఫొటో పంపితే చాలు!

### వాహనదారులకు బంపర్ ఆఫర్ ప్రకటించిన "క్లీన్ టాయిలెట్ పిక్చర్" ఛాలెంజ్‌లో పాల్గొంటే ఫ్రీగా రీఛార్జ్!




దేశవ్యాప్తంగా ఉన్న జాతీయ రహదారులపై నిత్యం ఎంతో మంది తమ వాహనాలపై రాకపోకలు సాగిస్తుంటారు. అలా నేషనల్ హై-వేలపై ప్రయాణించే ఫాస్టాగ్ ఉన్న వాహనదారులకు ఒక బంఫర్ ఆఫర్ ప్రకటించింది నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా). టోల్ గేట్ల వద్ద ట్రాఫిక్ నియంత్రణ, టోల్ వసూలు సులభతరం చేయడం కోసం ఎప్పటికప్పుడు సరికొత్త నిర్ణయాలు తీసుకుంటున్న ఎన్‌హెచ్‌ఏఐ.. తాజాగా జాతీయ రహదారులను శుభ్రంగా ఉంచాలనే ఉద్దేశంతో ఒక కొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా మీరు టోల్ గేట్ వద్ద ఒక చిన్న పని చేస్తే చాలు రూ.1000 ఫాస్టాగ్ రీఛార్జ్ ను ఉచితంగా పొందే అద్భుత అవకాశం కల్పిస్తోంది. మరి, ఆ పని ఏంటి? ఫ్రీగా రూ. 1000 ఫాస్టాగ్ రీఛార్జ్ ఎలా పొందాలి అన్నది ఈ స్టోరీలో తెలుసుకుందాం. జాతీయ రహదారులపై ప్రయాణికుల సౌకర్యార్థం, పరిశుభ్రత గల ప్రమాణాలతో సేవలు అందించాలనే లక్ష్యంతో ఒక వినూత్నమైన కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది అదే, "క్లీన్ టాయిలెట్ పిక్చర్ ఛాలెంజ్". ఈ ప్రత్యేక పరిశుభ్రతా కార్యక్రమం ద్వారా ఫాస్టాగ్ ఉన్న వాహనదారులకు అద్దిరిపోయే ఆఫర్‌ను అందిస్తోంది. ఈ స్పెషల్ క్యాంపెయిన్‌లో పాల్గొని రిపోర్ట్ చేసినవారికి ఉచితంగా రూ.1000 ఫాస్టాగ్ రీఛార్జ్ అందిస్తామని "సోషల్ మీడియా ఎక్స్ వేదికగా" వెల్లడించింది

ఏం చేయాలంటే

తీసుకొచ్చిన ఈ ఛాలెంజ్ లో భాగంగా వాహనదారులు దేశవ్యాప్తంగా జాతీయ రహదారులపై టోల్ గేట్ల వద్ద అపరిశుభ్రంగా ఉన్న టాయిలెట్స్ ఫొటో తీసి అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. టోల్ ప్లాజాల్లో డర్టీగా ఉండే మూత్రశాలలు, మరుగుదొడ్ల ఫొటో తీసి అపరిశుభ్ర టాయిలెట్ల విషయాన్ని ఎవరైతే ముందుగా ఇన్ఫార్మ్ చేస్తారో వారూ వెయ్యి రూపాయల ఫాస్టాగ్ రీఛార్జ్ ఉచితంగా పొందవచ్చు. 2026, జూన్ 30 వరకు ఈ ఆఫర్ అందుబాటులో ఉంటుంది.

ఫొటో ఎలా పంపించాలంటే

ఇందుకోసం ముందుగా మీ మొబైల్‌లో లేటెస్ట్ వెర్షన్ రాజమార్గ్‌యాత్ర యాప్ ఇన్‌స్టాల్ చేసుకోవాలి. తర్వాత మీరు టోల్ ప్లాజ్ వద్ద గుర్తించిన అపరిశుభ్ర టాయిలెట్ ఫొటోలను ఆ యాప్ ద్వారా తీసి పంపించాలి. అయితే, ఆ ఫొటోలు తప్పనిసరిగా జియో-ట్యాగింగ్ కలిగి ఉండాలి. తద్వారా మీరు ఎక్కడ ఫొటో తీశారో ఆ ప్లేస్ కచ్చితంగా నమోదు అవుతుంది. దాంతో అధికారులకు ఆ ప్రాంతాన్ని గుర్తించడం ఈజీగా ఉంటుంది. అలాగే, ఫొటోతోపాటు మీ పేరు, ఫోన్ నంబర్, టాయిలెట్ ఎక్కడుందో తెలిపే ప్లేస్ (టోల్ ప్లాజ్ నేమ్), మీ వెహికల్ రిజిస్ట్రేషన్ నంబం నమోదు చేయాల్సి ఉంటుంది. అనంతరం అధికారులు అది వెరిఫై చేసుకుని మీరు తీసిన ఫొటో ఓకే అయితే మీ వాహన రిజిస్ట్రేషన్ నంబర్ కు లింక్ అయిన ఫాస్టాగ్ కు ఫ్రీగా రూ.1000 రీఛార్జ్ లభిస్తుంది.అలాగని ఎన్ని ఫొటోస్ పంపితే అన్ని రివార్డులు ఇవ్వరు. ఒక్క వెహికల్ నెంబర్ కు ఒక్క రివార్డ్ మాత్రమే అందిస్తారని గుర్తుంచుకోవాలి. ఒక నేషనల్ హైవేలోని టోల్ ప్లాజా వద్ద ఒక టాయిలెట్‌కు రోజులో ఒకసారి మాత్రమే ఈ రివార్డ్ ఇవ్వడం జరుగుతుందని కేంద్రం తెలిపింది. అలాగే, ఒకే మూత్రశాల, మరుగుదొడ్డికి సంబంధించినవి ఎక్కువ ఫొటోలు పంపితే వాటిల్లో మొదటగా పంపిన దాన్ని పరిగణనలోకి తీసుకుంటారు. చీనా× అందిస్తున్న ఈ రివార్డ్ నాన్ ట్రాన్స్‌ఫరేబుల్. అదేవిధంగా, క్యాష్ రూపంలో క్లెయిమ్ చేసుకోవడం కుదరదని గమనించాలి.

ఆ టాయిలెట్లకు ఆఫర్ వర్తించదు :

దేశవ్యాప్తంగా అన్ని నేషనల్ హైవేలపై ఉన్న టోల్ ప్లాజాల వద్ద అపరిశుభ్రంగా ఉన్న టాయిలెట్స్ ఫోటోలు తీసి పంపించవచ్చు. అలాగే, ఈ ఆఫర్ అనేది కేవలం పరిధిలో ఉన్న టాయిలెట్స్ కు మాత్రమే వర్తిస్తుంది. అంతేకానీ, జాతీయ రహదారుల వెంబడి ఉండే దాబాలు, పెట్రోల్ బంకులు, ప్రభుత్వ ఆఫీసుల్లో ఉండే వాష్ రూమ్స్ కు వర్తించదని కేంద్రం తెలిపింది.

## మహిళలు కేవలం పిల్లల్ని కనే యంత్రాలేనా.. ఆరోగ్యం వ్యక్తిగత హక్కు కాదా

### అనేక కుటుంబాల్లో మహిళల ఆరోగ్యాన్ని మాతృత్వం, శృంగార దృక్కోణంలోనే చూస్తున్నారని స్త్రీ వాదులు అంటున్నారు.



పెళ్లై కనీసం ఆర్నెల్లు కూడా కాలేదు. పని ఒత్తిడో, మరేదైనా కారణమో కానీ.. ఈ మద్య తరచుగా తనకు తలనొప్పి వస్తోందని చెప్పిన రిత్వికకు వాళ్లింట్లో వాళ్లు చెప్పిన జాగ్రత్తలు విని ఒకింత ఆశ్చర్యం వేసింది. ఎందుకంటే.. వారు చెప్పిన దాంట్లో ఈమె తలనొప్పికి సంబంధించిన సమస్యకంటే.. ఆమె భవిష్యత్తులో గర్భధారణకు, తల్లి అయ్యేందుకు అది ఇబ్బందిగా మారుతుందేమోనన్న విషయంపైనే ఎక్కువగా చర్చిస్తున్నారు. ఇలా అయితే భర్తతో సాన్నిహిత్యం వేళ సంతోషంగా ఉండలేవేమో.. పిల్లల్ని కనడం కష్టమవుతుందేమో! అలా జరగకూడదంటే.. జర జాగ్రత్తగా ఉండు అని సలహాలిస్తున్నారు. చాలామందికి ఇందులో తప్పేముంది? అనిపిస్తుండవచ్చు. కానీ ప్రత్యక్షంగా అనుభవించే వారికి మాత్రం ఒక విధమైన బాధ, ఆవేదన వెంటాడుతుంది. ఎందుకంటే.. ఇక్కడ సదరు మహిళ తలనొప్పి తగ్గాలన్న ఆలోచన, ఆరాటం కంటే.. ఆమె మాతృత్వానికి పనికొస్తుందా లేదా అనే విషయంపైనే ఫోకస్ చేస్తున్నారు. ఒక్క రిత్వికనే కాదు.. ఆధునిక కాలంలోనూ అనేకమంది మహిళలు ఎదుర్కొంటున్న సమస్య ఇది.

ఈ రోజుల్లో వివక్ష లేదా

ఈరోజుల్లో మహిళల పట్ల వివక్ష ఎక్కడిది? అంటుంటారు చాలామంది. అయితే ఇది వందశాతం నిజం మాత్రం కాదంటున్నారు స్త్రీ వాదులు. ఒకప్పటితో పోలిస్తే పలు విషయాల్లో వివక్ష తగ్గి ఉండవచ్చు. సమానత్వ భావన పెరిగి ఉండవచ్చు. కానీ బయటకు కనిపించని అనేక అంశాల్లో అసమానతలు, అణచివేతలు, మహిళలపట్ల వివక్ష ఏదో ఒక రూపంలో నేటికీ కొనసాగుతోందని చెబుతున్నారు. ముఖ్యంగా ఆరోగ్యం విషయంలో వారి అభిప్రాయాలకు ప్రాధాన్యత ఇవ్వడంలేదు. పైగా వారు చులకన చేయబడుతున్నారు. కుటుంబాల్లో, సమాజంలో నిర్లక్ష్యం చేయబడుతున్నారు. అందుకు చక్కటి ఉదాహరణ అనేక కుటుంబాల్లో మహిళల ఆరోగ్యాన్ని కేవలం తల్లితనం(మాతృత్వం) దృక్కోణంలోనే చూడటం అంటున్నారు ప్రముఖ స్త్రీ వాద రచయిత ప్రీతి సింగ్. మహిళల శరీరాలను తరచూ భవిష్యత్ పునరుత్పత్తి కోసం ఉపయోగపడే స్థలాలుగా మాత్రమే చూస్తున్నామని ఆమె విమర్శిస్తారు. వారి ఆరోగ్యాన్ని వారి సొంత బాగోగుల కోసం కాకుండా, ఇంకా పుట్టని బిడ్డ కోసం ముందుగా జాగ్రత్త చేసే విధంగా పరిగణిస్తామని చెబుతారు. ఈ విధమైన పురుషాధిక్య లేదా మాతృస్వామ్య భావజాలం నుంచి సమాజం, మహిళలు పూర్తిగా బయటపడాలని సూచిస్తారు.

శృంగారం.. మాతృత్వమే ముఖ్యమా

మైగ్రేన్, తొలనొప్పి, పీరియడ్ పెయిన్, కడుపు నొప్పి, కాళ్లు చేతులు లాగడం, కడుపులో ఉబ్బరం.. ఇలా అనేక సమస్యలు సాధారణంగా మహిళలు ఎదుర్కొంటుంటారు. ఆయా సందర్భాల్లో అవి ఎదురైనప్పుడు కుటుంబ సభ్యులు, చుట్టు పక్కల ప్రజలు, సమాజం బాలికలను, మహిళలను, ముఖ్యంగా కొత్తగా పెళ్లయిన స్త్రీలను చూసే కోణంలో, పరామర్శించడంలో,, సానుభూతి చూపడంలో పురుషులతో పోలిస్తే చాలా తేడా ఉంటుంది. ఇక్కడ మహిళల్ని భవిష్యత్ మాతృత్వానికి, భర్తతో శృంగార జీవితానికి ముడిపెట్టి చూసేవారే ఎక్కువ. అంటే ఆ సమస్యలు ఎదుర్కొంటున్నప్పుడు సదరు మహిళ భర్తకు శృంగారంలో సరిగ్గా సహకరించదేమోనని, తద్వారా గర్భధారణ రాదేమోనని, పిల్లల్ని కనడంలో ఇబ్బందులు ఎదురవుతాయేమోనని.. ఇలా తల్లితనం(ఎశీ్ట్రవతీష్ట్రశీశీ) కోణంలోనే అంచనా వేస్తుంటారు చాలామంది పెద్దలు. అదే పురుషుల విషయానికి వస్తే అలా చేయరు.

ఎందుకీ తేడాలు

పురుషులకు ఏదైనా అనారోగ్యం వచ్చినప్పుడు.. కుటుంబంలోని స్త్రీ, పురుషులందరూ అతని ఆరోగ్య పునరుద్ధరణపై ఎక్కువ ఫోకస్ చేస్తారు. మహిళల మాదరి వారి అనారోగ్య సమస్యను సంతానం, మాతృత్వం, శృంగారంతో ముడిపెట్టి చూడరు. అదే స్త్రీల విషయంలో మాత్రం డిఫరెంట్. చిన్నప్పటి నుంచే బాలికలకు 'ఆరోగ్యంగా ఉండు, గర్భధారణకు మంచిది' అని నేర్పుతుంటారు. దీంతో ఆరోగ్యం వ్యక్తిగత హక్కుగా కాకుండా, తల్లితనం తయారీగా మారిపోతున్నదని, ఇది సామాజికంగా, సంస్థాగతంగా కూడా కనిపిస్తున్నదని స్త్రీ వాదులు అంటున్నారు. ఇది ఆధునిక కాలంలోనూ లింగ భేదాలను చిన్నప్పటి నుంచే ఎలా నేర్పబడుతున్నాయనేందుకు చక్కటి ఉదాహరణగా పేర్కొంటున్నారు. ఇప్పటికైనా కుటుంబాల్లో, సమాజంలో పురుషాధిక్య లేదా పితృస్వామ్య భావజాలానికి స్వస్తి పలకాల్సిన అవసరాన్ని మహిళా లోకం గుర్తించాల్సిన అవసరం ఉందని నిపుణులు అంటున్నారు. చదువుకోవడం, ప్రశ్నించడం, ఎడ్యుకేట్ అవడం, ఎడ్యుకేట్ చేయడం వంటివి ఈ విధమైన పరిస్థితులను మార్చడంలో కీ రోల్ పోషిస్తాయని, మహిళలు ఆ దిశగా ఆలోచించాలని, పురుషులు సైతం సహకరించాలని సూచిస్తున్నారు.

## మైదానంలో పోరాట వీరుడు.. బయట సామాన్యుడు అక్షర్ పటేల్


### అక్షర్ పటేల్ సింప్లిసిటీ: భారీ ఊరేగింపు వద్దని అకాడమీ పిల్లలతో ముచ్చటించిన టీమిండియా వైస్ కెప్టెన్! అహ్మదాబాద్ కంటే నడియాడ్ పైనే మక్కువ ఎక్కువ.



భారత క్రికెట్ జట్టులో కీలక పాత్ర పోషిస్తున్న అక్షర్ పటేల్ (ూ×ఖతీ్ూఢవశ్రీ) ప్రస్తుతం వైస్ కెప్టెన్ గా కొనసాగుతున్నారు. 2024 టీ20 ప్రపంచ కప్ విజేతగా నిలిచిన తర్వాత అక్షర్ పటేల్ తన సొంత జిల్లా ఖేడా లో జరిగిన ఓ ఘటన తాజాగా వైరల్ అవుతుంది. వరల్డ్ కప్ విజయం తర్వాత ఆయన తన జిల్లాకు చేరుకున్నప్పుడు ఒక అరుదైన దృశ్యం కనిపించింది. అక్షర్ అద్భుత ప్రదర్శనకు ముగ్ధులైన ఖేడా జిల్లా క్రికెట్ అసోసియేషన్, నడియాడ్ వీధుల్లో సుమారు 40 వేల మందితో భారీ ఊరేగింపు నిర్వహించాలని ప్లాన్ చేసింది. అయితే ఈ హడావుడి ఇష్టం లేని అక్షర్, అసలు ఇంటికే రాకుండా తప్పించుకునే ప్రయత్నం చేశారు. చివరకు అసోసియేషన్ ప్రెసిడెంట్ మనీష్ దేశాయ్ వ్యక్తిగతంగా అభ్యర్థించడంతో.. కేవలం అకాడమీ పిల్లలతో చిన్నపాటి సమావేశానికి మాత్రమే అక్షర్ అంగీకరించారు. ఆడంబరాలకు దూరంగా ఉంటూ, గంటల తరబడి పిల్లలతో ముచ్చటించి వారి సందేహాలను తీర్చి అక్షర్ తన వినమ్రతను చాటుకున్నారు. సాధారణంగా సెలబ్రిటీ హోదా వచ్చాక చాలామంది మెట్రో నగరాలకు మారిపోతుంటారు. కానీ అక్షర్ పటేల్ మాత్రం ఇందుకు భిన్నం. అహ్మదాబాద్ వంటి నగరాల్లో మెరుగైన అవకాశాలు ఉన్నప్పటికీ, ఆయన మాత్రం తన గుండె చప్పుడు 'నడియాడ్' అని గట్టిగా నమ్ముతారు. అహ్మదాబాద్‌కు 60 కిలోమీటర్ల దూరంలో ఉన్న తన చిన్ననాటి స్నేహితులు, కుటుంబ సభ్యుల మధ్య ఉండటానికే ఆయన ప్రాధాన్యత ఇస్తారు. బుధవారం నాడు అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియంలో నెదర్లాండ్స్‌తో జరిగే మ్యాచ్‌లో అక్షర్ భారత జట్టు వైస్ కెప్టెన్‌గా బరిలోకి దిగుతున్నారు. ఇది ఆయనకు హోమ్ గ్రౌండ్ అని అందరూ అంటున్నప్పటికీ, అక్షర్ దృష్టిలో మాత్రం తన అసలైన ఇల్లు నడియాడ్ మాత్రమే. మైదానంలో బంతితో, బ్యాట్‌తో భారత్‌కు ఎన్నో కీలక విజయాలు అందిస్తున్నా.. బయట ప్రపంచంలో అక్షర్ ప్రొఫైల్ చాలా నిశ్శబ్దంగా ఉంటుంది. తన లక్ష్యాల గురించి గొప్పలు చెప్పుకోకుండా, పని చేసి చూపించడమే ఆయన శైలి. టీమిండియా ప్లాన్స్‌లో అత్యంత కీలకమైన ఆటగాడిగా ఎదిగినా, ఆ స్టార్‌డమ్ తలకెక్కించుకోకుండా సామాన్యుడిలా జీవించడమే అక్షర్ పటేల్ ప్రత్యేకతగా నిలిచింది. కాగా ఈ రోజు జరిగే మ్యాచులో అక్షర్ పటేల్ ఎటువంటి ప్రదర్శన కనబరుస్తాడోనని తన హోమ్ టౌన్ ప్రజలు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

## రాత్రి సరిపడా నిద్రపోయినా, పగటిపూట మళ్లీ నిద్ర వస్తోందా - కారణాలు ఇవే కావచ్చట!

### ఉదయం లేవగానే అలసటగా అనిపిస్తోందా బాడీలో ఏం జరుగుతుందో తెలుసా



ఆలోచనలు సక్రమంగా సాగాలన్నా, ఆరోగ్యం ఇనుమడించాలన్నా నిద్ర చాలా కీలకం. రోజంతా తీరిక లేని పనులతో అలసిపోయిన శరీరానికి రాత్రి నిద్ర కొత్త శక్తి అందేలా చేస్తుంది. అయితే, కొంతమంది రాత్రిపూట నిద్రపోయినప్పటికీ పగటిపూట అలసటగా ఉంటారు. నిద్ర ముంచుకొస్తున్నట్లుగా అనిపిస్తుందని చెబుతుంటారు. అయితే రాత్రిళ్లు దాదాపు 8 గంటలు నిద్రపోయినా మర్నాడు నీరసంగా ఉండటానికి రకరకాల అంశాలు దోహదం చేస్తుంటాయంటున్నారు నిపుణులు. మరి, అవేంటో ఇప్పుడు తెలుసుకుందాం!

నిద్ర సమస్య :

పగటిపూట మత్తుగా, అలసటగా ఉండటానికి స్లీప్ అప్నియా కారణం కావొచ్చంటున్నారు నిపుణులు. ఈ సమస్యతో బాధపడుతున్న వారు నిద్రిస్తున్నప్పుడు గొంతు వెనకాల భాగం వదులై, శ్వాసమార్గానికి అడ్డుపడుతుంది. తద్వారా శ్వాస సరిగా అందక గట్టిగా గురక పెడుతూ ఊపిరి తీసుకుంటారు. దీంతో మెలకువ రావడం, గాఢ నిద్ర కొరవడుతుంది. ఇలా రాత్రంతా చాలా సార్లు జరుగుతూనే ఉంటుంది. నిద్ర మత్తులో ఇది తెలియదు. శ్వాస ఆగటం, కంటి నిండా నిద్ర పట్టకపోవటం వల్ల రక్తంలో ఆక్సిజన్ స్థాయిలు తగ్గటం వల్ల తెల్లారి అలసటగా అనిపిస్తుందని నిపుణులు చెబుతున్నారు. అలాగే, నిద్రలేమి, కాళ్లలో చిరచిర వంటి సమస్యలూ దీనికి కారణం కావొచ్చట. నార్కోలెప్సీ, హైపర్సోమ్నియా వంటి నిద్ర రోగాలు కూడా పగటిపూట అలసటగా ఉండడానికి కారణమవుతాయని అధ్యయనం పేర్కొంది.

ఇతర జబ్బులు :

స్లీప్ అప్నియా ఒక్కటే కాదు. దీర్ఘకాల సమస్యలు, హార్మోన్ల మార్పుల వంటివీ ఉదయం పూట నిస్సత్తువకు దారితీయొచ్చు. థైరాయిడ్ సమస్యలు, విటమిన్ల లోపాల వంటివీ హుషారును తగ్గించొచ్చని నిపుణులు చెబుతున్నారు.

పడకగది వాతావరణం :

బెడ్‌రూమ్, చుట్టుపక్కల పరిస్థితులు కూడా నిద్రకు భంగం కలిగించొచ్చట. వెలుగు, ఉష్ణోగ్రత, చప్పుడు లాంటివీ గాఢ నిద్ర మీద ప్రభావం చూపుతాయని అంటున్నారు. గది చాలా వేడిగా ఉన్నా, వెలుగు మరీ ఎక్కువగా ఉన్నా, ఏదైనా చప్పుడు చేస్తున్నా తెలియకుండానే తరచూ మెలకువ వచ్చేస్తుంది. ఎక్కువ వెలుతురుతో నిద్రకు తోడ్పడే మెలటోనిన్ హార్మోన్ మోతాదులు తగ్గి, కునుకు పట్టటాన్ని దెబ్బతీస్తుందంటున్నారు నిపుణులు. అందుకే, పడకగదిలో టీవీ, పీసీ, ల్యాప్‌టాప్, మొబైల్ ఫోన్ల వంటివీ ఉండకుండా చూసుకోవాలని.. ఇవి నిద్రకు విఘాతం కలిగిస్తాయని చెబుతున్నారు.

ఆహారం, పానీయాలు :

మనం తినే ఆహారం, తాగే పానీయాలూ గాఢనిద్రను దెబ్బతీయొచ్చని నిపుణులు అంటున్నారు. ఎలాగంటే, పడుకునే ముందు కడుపు నిండా భోజనం చేస్తే, జీర్ణక్రియ ఉత్తేజితమై త్వరగా నిద్ర పట్టకుండా చేయొచ్చట. అందుకే, పడుకోవటానికి రెండు గంటల ముందే భోజనం ముగించాలని నిపుణులు సూచిస్తున్నారు. ఒకవేళ కుదరకపోతే తక్కువ మొత్తంలో తినటం మేలంటున్నారు. అలాగే, కెఫెన్‌తో కూడిన కాఫీ, కూల్‌డ్రింకులు, మద్యం కూడా నిద్రను దెబ్బతీస్తాయట. కెఫెన్ బ్రెయిన్‌ను ఉత్తేజితం చేస్తే, మద్యం తరచూ మెలకువ వచ్చేలా చేస్తుంది. చక్కెర, కెఫెన్ అధికంగా ఉన్న ఆహారాలు తీసుకోవడం వల్ల కూడా నిద్ర డిస్టర్బ్ అవుతుందని అధ్యయనం పేర్కొంది.

మానసిక సమస్యలు :

మానసిక ఆరోగ్యానికీ, నిద్రకూ విడదీయరాని బంధముంది. నిద్రలేమితో మానసిక సమస్యలు చుట్టుముట్టొచ్చని పలు అధ్యయనాల్లో వెల్లడైంది. అలాగే, మానసిక సమస్యలు నిద్రనూ దెబ్బతీయొచ్చు. ఒత్తిడి, ఆందోళన వంటివి రాత్రంతా మెదడును చురుకుగా ఉంచేలా చేస్తాయని నిపుణులు చెబుతున్నారు. దీంతో స్వతహాగా నిద్ర పట్టే ప్రక్రియ నిలిచిపోతుందట. నిరాశ, దిగులు, డిప్రెషన్ వంటి ఇతర మానసిక సమస్యలూ నిద్రాభంగం కలిగించొచ్చు. తద్వారా, మర్నాడు ఉదయం హుషారు తగ్గిపోయి, అలసటగా అనిపిస్తోంది.

ఐరన్ తగ్గటం :

శరీరంలో ఐరన్ మోతాదులు తగ్గటమూ నీరసానికి కారణమవుతుంది. ఐరన్ లోపంతో రక్తహీనత (ూఅవఎఖ) మాత్రమే కాదు, కాళ్లలో చిరచిర సమస్య కూడా తలెత్తొచ్చని నిపుణులు చెబుతున్నారు. ఈ చిరచిర సమస్య గలవారికి కాళ్లు కదలకుండా ఉన్నప్పుడు లోపల ఏవో పాకుతున్నట్టు అనిపిస్తుంటుందని అంటున్నారు. దీంతో అదేపనిగా కాళ్లు కదిలించడం వల్ల నిద్రకు విఘాతం కలుగుతుందట.

డాక్టర్ దగ్గరికి ఎప్పుడు:

తగినంత సేపు నిద్రిస్తున్నా ఉదయం అలసటగా ఉంటున్నట్టు అనిపిస్తే కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలంటున్నారు నిపుణులు. రోజూ ఒకే సమయానికి పడుకోవటం, లేవటం అలవాటు చేసుకోవాలని ంశ్రీవవజూటశీబఅష్ఱశీఅ అధ్యయనం పేర్కొంది. అలాగే, పడకగదిని చల్లగా, ప్రశాంతంగా ఉంచుకోవటం, పడుకోవటానికి రెండు గంటల ముందు నుంచే గదిలో వెలుతురును తగ్గించుకోవటం, వేళకు భోజనం చేయటం వంటివి కంటి నిండా నిద్ర పట్టటానికి తోడ్పడతాయంటున్నారు నిపుణులు. అప్పటికీ ఫలితం కనిపించికపోతే డాక్టర్‌ను సంప్రదించాలని సూచిస్తున్నారు. హార్మోన్ల అస్తవ్యస్తం, స్లీప్ అప్నియా, థైరాయిడ్ సమస్యలు వంటివేవైనా ఉన్నాయేమో చూస్తారు. అవసరమైతే స్లీప్ స్టడీ, రక్త పరీక్షలు చేసి తగిన పరిష్కారం చూపిస్తారు. ఇక్కడ మీకు అందించిన ఆరోగ్య సమాచారం, సూచనలు అన్నీ మీ అవగాహన కోసం మాత్రమే. శాస్త్ర పరిశోధనలు, అధ్యయనాలు, వైద్య, ఆరోగ్య నిపుణుల సూచనల ప్రకారమే మేము ఈ సమాచారాన్ని అందిస్తున్నాం. వీటిని పాటించే ముందు కచ్చితంగా మీ వ్యక్తిగత వైద్యుల సలహాలు తీసుకోవడమే మంచిది.

## రైతులకు నాణ్యమైన విత్తనం అందేలా చర్యలు తీసుకోవాలి....

### అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ ఎల్ కృష్ణ...




**నాగర్ కర్నూల్ టౌన్//ఫిబ్రవరి 18 ఆకాంక్ష :** రైతులకు సకాలంలో ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం నుండి నాణ్యమైన విత్తనాలు అందేలా శాస్త్రవేత్తలు ప్రత్యేక దృష్టి పెట్టాలని అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ ఎల్ కృష్ణ సూచించారు. బుధవారం నాగర్ కర్నూల్ జిల్లా పాలెం ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం వద్ద ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రాలు వనపర్తి, జోగులాంబ గద్వాల, నారాయణపేట, సూర్యాపేట జిల్లాల సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి డాక్టర్ ఎల్ కృష్ణ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశోధన క్షేత్రాలలో అభివృద్ధి చేసిన నాణ్యమైన విత్తనాలను రైతులకు అందించి ఉత్పాదకత పెంపొందించాల్సిన బాధ్యత శాస్త్రవేత్తలపై ఉందన్నారు. రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని సకాలంలో సరైన విత్తన సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.



వనపర్తి జిల్లా ఉద్యాన శాఖ అధికారి విజయభాస్కర్ మాట్లాడుతూ ఉద్యాన పంటల విలువ జోడింపు, మార్కెటింగ్, శీతల గిడ్డంగులు, నిల్వ సదుపాయాలపై రైతులు, శాస్త్రవేత్తలు మరింత దృష్టి పెట్టాలని అన్నారు. విస్తరణ సంచాలకులు ప్రొఫెసర్ డాక్టర్ ఎస్ చంద్రశేఖర్ మాట్లాడుతూ విత్తన ఉత్పత్తి, జీవన ఎరువులు, డిజిటల్ వ్యవసాయ సేవలు, రైతు ఉత్పత్తి దారుల సంఘాల ఏర్పాటు వంటి అంశాలపై శాస్త్రవేత్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సుమారు 40 మంది రైతులు పాల్గొని సాంకేతిక ప్రణాళిక మెరుగుదలకు సంబంధించిన అంశాలపై తమ అభిప్రాయాలను వెల్లడించారు. కృషి విజ్ఞాన కేంద్రం పాలెం కోఆర్డినేటర్ డాక్టర్ పి శ్రీదేవి పాల్గొన్నారు. వనపర్తి జిల్లాకు నోడల్ అధికారిగా డాక్టర్ ఆదిశంకర్, జోగులాంబ గద్వాలకు మధుశేఖర్, నారాయణపేటకు డాక్టర్ పి ప్రశాంత్, సూర్యాపేటకు పల్లవి బాధ్యతలు నిర్వర్తించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

## కొమురవెల్లి మండలం అయినాపూర్ గ్రామంలో

## తొలి గ్రామ సభ విజయవంతం...





**కొమురవెల్లి//ఫిబ్రవరి 18 ఆకాంక్ష :** సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మండలం అయినాపూర్ గ్రామంలో నూతన సర్పంచ్ ఏర్పుల కళ్యాణి కృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన తొలి గ్రామ సభ విజయవంతంగా జరిగింది. గ్రామ అభివృద్ధి, ప్రజల సమస్యల పరిష్కారం, సంక్షేమ కార్యక్రమాల అమలు వంటి ముఖ్య అంశాలపై సభలో విస్తృతంగా చర్చించారు. గ్రామంలో ప్రధానంగా ఉన్న సమస్యలపై గ్రామస్థులు తమ అభిప్రాయాలు వ్యక్తం చేయగా, పాలక మండలి వాటిపై కీలక నిర్ణయాలు తీసుకుంది. గ్రామంలో అక్రమంగా నడుస్తున్న బెల్టు షాపుల సమస్యపై గ్రామ సభలో తీవ్రంగా చర్చించి, మద్యపాన నిషేధాన్ని కఠినంగా అమలు చేయాలని నిర్ణయించారు. బెల్టు షాపులు నడిపే వ్యక్తులపై రూ.1,00,000 జరిమానా విధించాలనే తీర్మానం సభ ఏకగ్రీవంగా ఆమోదించింది. అలాగే గ్రామంలో కోతుల బెడదను నివారించేందుకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. గ్రామ ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్న ఈ సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు కార్యాచరణ రూపొందించాలని నిర్ణయించారు. రానున్న ఎండాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని గ్రామంలో తాగునీటి కొరత తలెత్తకుండా ముందస్తు ప్రణాళిక రూపొందించి, నీటి సమస్యలు రాకుండా చర్యలు చేపట్టాలని తీర్మానించారు. ఇదే సందర్భంగా గ్రామంలోని అతి పురాతన దేవాలయం అయిన శివాలయంలో శివపార్వతుల కళ్యాణాన్ని గ్రామ పాలక మండలి ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకకు గ్రామస్థులు భారీగా హాజరై సంతోషం వ్యక్తం చేశారు. గ్రామంలో శాంతి, ఐక్యత, అభివృద్ధి కోసం గ్రామ సభ తీసుకున్న నిర్ణయాలను గ్రామ ప్రజలు అభినందించారు. ఈ గ్రామ సభలో గ్రామ సెక్రటరీ బాలనరాయ్య, ఉపసర్పంచ్ మల్లం శ్రీనివాస్, వార్డు సభ్యులు వేముల ఆంజనేయులు, గణిబోయిన మౌనిక, మల్లం మానస, పిన్ని రేఖ, దొమ్మాట అజిత్, మొగుళ్ళ ప్రశాంత్, లంబ సంధ్యరాణి, దండు శ్రీనివాస్, దండు రవీందర్, కొమ్ము కవితతో పాటు అధికారులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. గ్రామాభివృద్ధి దిశగా గ్రామ సభ తీసుకున్న నిర్ణయాలు గ్రామానికి మేలుకలిగిస్తాయని గ్రామ పెద్దలు ఆశాభావం వ్యక్తం చేశారు.

## చదువుతోపాటు క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి...

### జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి సీతారాం..



**నాగర్ కర్నూల్ టౌన్//ఫిబ్రవరి 18 ఆకాంక్ష :** విద్యార్థులు చదువుతోపాటు సమానంగా క్రీడలలో నైపుణ్యాన్ని పెంపొందించుకుంటేనే సంపూర్ణ వ్యక్తిత్వం సాధ్యమవుతుందని జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి సీతారాం అన్నారు. బుధవారం నాగర్ కర్నూల్ పట్టణంలోని వట్టెం పీఎం శ్రీ జవహర్ నవోదయ విద్యాలయంలో "పాఠశాలల కొరకు ఫుట్ బాల్" పథకం కింద నిర్వహించిన ఫుట్‌బాల్ పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల మానసిక, శారీరక దృఢత్వానికి క్రీడలు కీలకమని, చిన్న వయసులోనే క్రీడలపై ఆసక్తి పెంపొందితే భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగగలరని పేర్కొన్నారు. క్రీడల ద్వారా క్రమశిక్షణ, సమయపాలన, జట్టు భావన వంటి లక్షణాలు పెంపొందుతాయని ఆయన వివరించారు. జిల్లాలోని 18 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, కళాశాలలకు మొత్తం 200 ఫుట్‌బాల్‌లను నోడల్ సెంటర్‌గా ఉన్న నవోదయ విద్యాలయం ద్వారా ఉచితంగా పంపిణీ చేశారు. ప్రిన్సిపాల్ ఇన్‌చార్జ్ పి. జానకిరాములు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డివైఎస్ఓ మాట్లాడుతూ విద్యార్థులకు క్రీడా నైపుణ్యాల ప్రాముఖ్యతను వివరించారు. ముఖ్యంగా ఫుట్‌బాల్ క్రీడ వల్ల శారీరక దృఢత్వం పెరగడంతో పాటు సామూహిక భావన, నాయకత్వ లక్షణాలు అభివృద్ధి చెందుతాయని చెప్పారు. జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షులు నరసింహారెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు ప్రత్యేక శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఉపాధ్యాయులు కూడా చదువుతోపాటు క్రీడల పట్ల విద్యార్థుల్లో ఆసక్తిని పెంపొందించేందుకు కృషి చేయాలని కోరారు. ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ జానకిరాములు మాట్లాడుతూ నవోదయ విద్యాలయం కేవలం విద్యార్థుల విద్యాభివృద్ధికే కాకుండా పీఎం శ్రీ పథకం ద్వారా సమాజంలో క్రీడా చైతన్యాన్ని పెంపొందించేందుకు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా నవోదయ వ్యాయామ అధ్యాపకులు శ్రీమతి సత్యజ్యోతి, పర్వేష్ మదన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఫుట్‌బాల్ మ్యాచ్‌ను నిర్వహించారు. కార్యక్రమంలో నవోదయ ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు మరియు ఇతరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## బ్రహ్మగుండం బ్రహ్మోత్సవాల హుండీలో రూ.2.19 లక్షల ఆదాయం

### గత ఏడాదికంటే 86,500 పెరుగుదల.



**వెల్దుర్తి//ఫిబ్రవరి 18 ఆకాంక్ష :** కర్నూలు జిల్లా పత్తికొండ నియోజకవర్గం వెల్దుర్తి మండల పరిధిలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం బ్రహ్మగుండేశ్వర స్వామి ఆలయం లో నిర్వహించిన నాలుగు రోజుల బ్రహ్మోత్సవాలు భక్తుల అపార విశ్వాసం మధ్య ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన తాత్కాలిక హుండీని బుధవారం ఆలయ అధికారులు లెక్కించారు. చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్ హనుమంతరావు, ఈవో ఆంజనేయులు ఆధ్వర్యంలో ఆలయ సిబ్బంది, భక్తుల సమక్షంలో హుండీ లెక్కింపు కార్యక్రమం పారదర్శకంగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా వేలాదిమంది భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకోవడంతో హుండీలో గణనీయమైన మొత్తంలో విరాళాలు చేరినట్లు అధికారులు తెలిపారు. అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం ఈ సంవత్సరం బ్రహ్మోత్సవాల తాత్కాలిక హుండీ ద్వారా మొత్తం రూ. 2,19,222 ఆదాయం లభించింది. ఇది గత ఏడాదితో పోలిస్తే రూ. 86,500 మేర ఎక్కువగా నమోదైందని పేర్కొన్నారు. భక్తుల సంఖ్య పెరగడం, బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించడం, ప్రత్యేక పూజలు మరియు సేవలు నిర్వహించడం వల్లే ఆదాయం పెరిగిందని వారు తెలిపారు. నాలుగు రోజుల పాటు కొనసాగిన బ్రహ్మోత్సవాల్లో ప్రత్యేక అర్చనలు, అభిషేకాలు, వాహన సేవలు, సాంప్రదాయ కార్యక్రమాలు నిర్వహించగా, పరిసర ప్రాంతాల నుంచి మాత్రమే కాకుండా దూర ప్రాంతాల నుంచి కూడా భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ పరిసర ప్రాంతం మొత్తం భక్తులతో కిక్కిరిసిపోయి పండుగ వాతావరణం నెలకొంది. హుండీ లెక్కింపు సమయంలో భక్తుల విరాళాలను జాగ్రత్తగా వేరు చేసి నమోదు చేయగా, మొత్తం నగదు వివరాలను అధికారికంగా నమోదు చేశారు. ఆలయ అభివృద్ధి, మరమ్మతులు, భక్తులకు సౌకర్యాల మెరుగుదల వంటి కార్యక్రమాలకు ఈ ఆదాయాన్ని వినియోగించనున్నట్లు అధికారులు తెలిపారు. బ్రహ్మోత్సవాలు విజయవంతంగా నిర్వహించడంలో సహకరించిన భక్తులకు, స్వచ్ఛంద సేవకులకు, ఆరోగ్య శాఖ, పోలీసు మరియు రెవెన్యూ సిబ్బందికి ఆలయ అధికారులు కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇలాగే భక్తులు సహకరించాలని కోరారు.

## తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో బీసీలు

## 61% పైగా గెలిచారు తెలంగాణ బీసీ కమిషన్

**తెలంగాణలో జరిగిన పురపాలక ఎన్నికల్లో బీసీలు మొత్తంగా 61%కు పైగా గెలవటం పట్ల బీసీ కమిషన్ చైర్మన్ జి. నిరంజన్, సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.**



తెలంగాణలో జరిగిన పురపాలక ఎన్నికల్లో బీసీలు మొత్తంగా 61%కు పైగా గెలవటం పట్ల బీసీ కమిషన్ చైర్మన్ జి. నిరంజన్, సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో, మున్సిపల్ వార్డులలో బీసీలకు 28.22%, మున్సిపల్ కార్పోరేషన్‌లలో మొత్తం వార్డులలో 35.25% బీసీలకు కేటాయించినా జనరల్ స్థానాలలో కూడా బీసీలు గెలిచి, మొత్తం మీద 61% గెలవటం బీసీ వర్గాల ప్రజలలో పెరిగిన చైతన్యానికి నిదర్శనం అని పేర్కొన్నారు. ఈ మేరకు బీసీ కమిషన్ బుధశారం ఓ ప్రకటన విడుల చేసింది. పంచాయితి, మున్సిపాలిటీ ఎన్నికల్లో బీసీలు గెలిచిన స్థానాలను దృష్టిలో పెట్టుకొని కేంద్రం 42% రిజర్వేషన్లకు అమలు చేయడానికి అనుమతినివ్వాలని, 9వ షెడ్యూల్‌లో చేర్చాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వం 42% బీసీలకు రిజర్వేషన్ కల్పిస్తూ అసెంబ్లీలో బిల్లు పాస్ చేసినా అది ఇంకా కేంద్ర ప్రభుత్వంలో పెడ్డింగ్‌లో ఉండటం, కొందరు కోర్టు కెళ్లి ఈ రిజర్వేషన్ అమలు కాకుండా చేయడం సముచితం కాదని అభిప్రాయపడ్డారు. కోర్టుల్లో కేసులు వేసిన వారు కూడా వారి కేసులను ఉపసంహరించి చట్టబద్ధంగా బీసీల రిజర్వేషన్లు సాకారమయ్యే మార్గం సుగమం చేయాలని బీసీ కమిషన్ కోరుకుంటందని తెలిపారు. ఇటీవల జరిగిన పంచాయితీ ఎన్నికల్లో జనరల్ స్థానాలలో కూడా బీసీ అభ్యర్థులు 52.75% గెలిచారని, రాబోయే జెడ్పీటీసీ, ఎంపీటీసీ, జీహెచ్ఎంసీ, కార్పోరేషన్ల ఎన్నికల్లో కూడా బీసీలు అత్యధికంగా గెలుస్తారనే ఆశాభావాన్ని వారు వ్యక్తం చేశారు. రాష్ట్రంలో జరిగిన సమగ్ర సర్వేలో బీసీల సంఖ్య 56.33% అని తేలిందన్నారు.

## టీఎన్జీవో 2026 డైరీ కలెక్టర్ ఆవిష్కరణ...



**నాగర్ కర్నూల్//ఫిబ్రవరి 18 ఆకాంక్ష :** నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని కలెక్టర్ ఛాంబర్ లో టీఎన్జీవో 2026 సంవత్సరపు డైరీ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ టీఎన్జీవో సంఘం జిల్లా అధ్యక్షులు బావండ్ల వెంకటెష్ జిల్లా కార్యదర్శి యం.డి.షర్ఫొద్దిన్ వారి సంఘం ఆధ్వర్యంలో టీఎన్జీవో 2026 డైరీ ని కలెక్టర్ బాదావత్ సంతోష్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉద్యోగస్తుల సమస్యలు గౌరవ కలెక్టర్ గారితో చర్చించిసమస్యల పరిష్కారానికి సానుకూల హామీ ఇవ్వడం జరిగినది. కార్యక్రమంలో టిఎన్జీవో సంఘం సభ్యులు నాగర్ కర్నూల్ యూనిట్ ప్రెసిడెంట్ సయ్యద్ నజీర్ జిల్లా సంఘ సభ్యులు పాపిశెట్టి శీను,చెన్నకేశవ, కరీముల్లా,ఆనంద్,శివ రత్నమ్మ,అలివేలు, అమర్,స్నైలాబ్ పాల్గొన్నారు.

## మాజీ ఎంపీపీకి గాయాలు...



**నాగర్ కర్నూల్/ఫిబ్రవరి 18 ఆకాంక్ష :** నాగర్ కర్నూల్ జిల్లా బిజినపల్లి మాజీ ఎంపీపీ పుప్పాల శ్రీనివాస్ గౌడ్ కు బుధవారం నాడు జరిగిన రోడ్డు ప్రమాదంలో స్వల్ప గాయాలయ్యాయి. బుధవారం సాయంత్రము నాగర్ కర్నూల్ నుండి పాలెం గ్రామానికి స్కూటీపై తిరిగి వస్తుండగా ఉయ్యాల వాడ వద్ద ఎదురుగా వస్తున్న కోడేరు మండలానికి చెందిన మరో బైకర్ స్కూటీని ఢీకొట్టడం జరిగింది. బైకులపై ఉన్న ఇద్దరు కింద పడిపో వడంతో శ్రీనివాస్ గౌడ్ కు ఎడమ భుజం దగ్గర ఉన్న ఎముక పక్కకు జారిపోవడం, ఎడమ కాలి వేళ్లు విరిగిపోవడం జరిగింది. బాధితులిద్దరినీ నాగర్ కర్నూలు జిల్లా ఆసుపత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అందించారు.

## పోలీసుల దర్యాప్తులో వెలుగుచూసిన యువకుడి హత్య కేసు...

### ఇద్దరు మిత్రులు అరెస్ట్.



**వెల్దుర్తి,//ఫిబ్రవరి 18 ఆకాంక్ష :** కర్నూలు జిల్లా పత్తికొండ నియోజకవర్గమైన వెల్దుర్తి మండల పరిధిలోని మదర్ పురం గ్రామ సమీపంలోని కోళ్ల ఫారం వద్ద ఈనెల 12న అనుమానాస్పద పరిస్థితుల్లో మృతి చెందిన యువకుడు సురేష్ (25) కేసులో కీలక మలుపు చోటుచేసుకుంది. మొదట అనుమానాస్పద మృతిగా నమోదు చేసిన ఈ ఘటనను పోలీసులు క్షుణ్ణంగా విచారించగా, అది హత్యగా తేలింది. ఈ కేసులో మృతుడి ఇద్దరు మిత్రులను అరెస్టు చేసి హత్య కేసుగా నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. పోలీసుల వివరాల మేరకు, డోన్ పట్టణంలోని సుందర్‌సింగ్ కాలనీకి చెందిన సురేష్ తన స్నేహితులతో కలిసి తరచూ మద్యం సేవించేవాడు. కొద్ది రోజుల క్రితం మద్యం మత్తులో జరిగిన గొడవలో ఒకరిపై ఒకరు దాడి చేసుకునే స్థితికి చేరుకొని, పెద్దల సమక్షంలో రాజీ చేసుకున్నారు. అయితే ఆ సమయంలో సురేష్ నవ్విన ఘటనను స్నేహితులు అవమానంగా భావించి మనస్సులో పెట్టుకున్నారు. అదేవిధంగా, మరో సందర్భంలో ఒక మిత్రుడి ఇంటికి వెళ్లినప్పుడు అతని భార్యతో సురేష్ అసభ్యంగా ప్రవర్తించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ సంఘటనలతో ఇద్దరు మిత్రులు సురేష్‌పై కక్ష పెంచుకొని అతన్ని హత్య చేయాలని పథకం పన్నారు. ఈనెల 11న సాయంత్రం సురేష్‌ను మదారప్పురం సమీపంలోని కోళ్ల ఫారంకు పిలిచి, అక్కడ మద్యం సేవించారు. అనంతరం మద్యం మత్తులో కట్టెలు, పైపులు, కొడవలి, బండరాళ్లతో దాడి చేసి అతన్ని అక్కడికక్కడే చంపినట్లు పోలీసులు తెలిపారు. మరుసటి రోజు ఉదయం అతను లేవడం లేదని చెప్పుతూ కట్టుకథ అల్లుకుని కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. సురేష్ కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మొదట అనుమానాస్పద మృతి కేసుగా నమోదు చేసిన పోలీసులు, సీసీ ఫుటేజ్ మరియు పోస్టుమార్టం నివేదిక ఆధారంగా ఇది హత్యగా నిర్ధారించారు. అనంతరం ప్రత్యేకంగా విచారణ చేపట్టి, ఈ కేసులో ప్రమేయం ఉన్న ఇద్దరు మిత్రులను అరెస్టు చేశారు. అరెస్టు చేసిన నిందితులను డోన్ కోర్టులో హాజరు పరచనున్నట్లు సిఐ యుగంధర్ తెలిపారు.

### శివరాత్రి ఉత్సవాలలో

## హుండీ లెక్కింపులో పెరిగిన ఆదాయం...

### ఘనంగా వసంతోత్సవం నిర్వహణ ఉత్సవాల ముగింపు...





**వెల్దుర్తి//ఫిబ్రవరి 18 ఆకాంక్ష :** కర్నూలు జిల్లా పత్తికొండ నియోజకవర్గం అయినా వెల్దుర్తి మండల పరిధిలోని బ్రహ్మగుండం పుణ్యక్షేత్రంలోని శ్రీ కామేశ్వరిదేవి సహిత బ్రహ్మేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించబడిన సందర్భంగా బుధవారం ఆలయ హుండీ లెక్కింపును నిర్వహించారు. ఆలయ కమిటీ నిర్వాహకులు బొమ్మన రాజశేఖరరెడ్డి, ఉత్సవాల ప్రత్యేక అధికారి హనుమంతరావు, ఈఓ ఆంజనేయులు ఆధ్వర్యంలో భక్తుల సమక్షంలో హుండీ లెక్కింపు చేపట్టారు. ఈ సందర్భంగా బ్రహ్మేశ్వరస్వామి హుండీలో రూ.1,76,122 ఆదాయం లభించగా, అమ్మవారి హుండీలో రూ.43,100 ఆదాయం వచ్చినట్లు నిర్వాహకులు వెల్లడించారు. మొత్తం కలిపి ఈ ఏడాది ఆదాయం గత సంవత్సరంతో పోల్చితే రూ.86,550 మేర అధికంగా వచ్చినట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తమ కానుకలను సమర్పించడం వల్లే ఈ ఆదాయం పెరిగిందని ఆలయ అధికారులు ఆనందం వ్యక్తం చేశారు. ఉత్సవాల సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు,అభిషేకాలు, భజనలు నిర్వహించడంతో పాటు భక్తులకు అన్నదానం కూడా ఏర్పాటు చేశారు. మహాశివరాత్రి రోజున భక్తులు తెల్లవారుజాము నుంచే పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు కార్యక్రమంలో భాగంగా బుధవారం వసంతోత్సవాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య స్వామివారి ఉత్సవ విగ్రహాలపై పుష్పాలు, రంగులు చల్లి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమం ఆలయ ప్రాంగణంలో ఎంతో ఆధ్యాత్మిక వాతావరణంలో జరిగింది. అనంతరం రాత్రి గ్రామ పెద్దల సమక్షంలో గ్రామోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేశారు. కార్యక్రమంలో బొమ్మన రాజశేఖరరెడ్డి, ఉత్సవాల ప్రత్యేక అధికారి హనుమంతరావు, ఈఓ ఆంజనేయులు, ఆయకట్టు సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు. ఈ విధంగా శివరాత్రి ఉత్సవాలు, వసంతోత్సవం కార్యక్రమాలు భక్తిశ్రద్ధల నడుమ విజయవంతంగా ముగిశాయి.

## బీఆర్ఎస్ పార్టీ అభివృద్ధి లక్ష్యంగా పని చేయాలి...

### హనుమాన్ నగర్ పట్టణ కమిటీ అధ్యక్షుడిగా కోలుగూరి సాయి కుమార్...

### రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్...





**గోదావరిఖని//ఫిబ్రవరి 18 ఆకాంక్ష :** పార్టీ అభివృద్ధి, విస్తరణే ప్రధాన లక్ష్యంగా పని చేయాలని మాజీ ఎమ్మెల్యే, పెద్దపల్లి జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు కోరుకంటి చందర్ పేర్కొన్నారు. బీఆర్ఎస్ పార్టీ హనుమాన్ నగర్ పట్టణ కమిటీ అధ్యక్షుడిగా కోలుగూరి సాయి కుమార్ (చింటూ)ను ఆయన నియమించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కోరుకంటి చందర్ మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కట్టుబడి పనిచేయాలని సూచించారు. గ్రామ స్థాయి నుండి పట్టణ స్థాయి వరకు పార్టీ నిర్మాణాన్ని మరింత బలోపేతం చేసి ప్రజల్లో విశ్వాసం పెంపొందించేందుకు కృషి చేయాలని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుండి పనిచేస్తూ పార్టీకి మంచి పేరు తీసుకురావాలని కొత్తగా నియమితులైన పట్టణ అధ్యక్షుడు సాయి కుమార్‌కు సూచనలు చేశారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, సభ్యత్వ నమోదు కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని ఆయన పిలుపు నిచ్చారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించి పార్టీకి మరింత బలం చేకూర్చాలని కోరారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన కోలుగూరి సాయి కుమార్ మాట్లాడుతూ పార్టీ ఇచ్చిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ హనుమాన్ నగర్ పట్టణంలో బీఆర్ఎస్ పార్టీని మరింత బలోపేతం చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు నడిపెల్లి మురళీధర్ రావు, గోపు అయిలయ్య యాదవ్, పర్లపల్లి రవికిరణ్ జీ తదితరులు పాల్గొన్నారు.

## బందోబస్తు విధుల్లో ఉన్న పోలీసులపై రాళ్ల దాడి...

### మంత్రి వాహనంపై దాడి కేసులో మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ సహా నిందితుల అరెస్ట్...

**మంచిర్యాల/ఫిబ్రవరి 18 ఆకాంక్ష :** మంచిర్యాల జిల్లా రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఉద్రిక్తతలకు దారి తీసిన రాళ్ల దాడి ఘటనలో కీలక నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. రామకృష్ణాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని క్యాతనపల్లి మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికల సందర్భంగా నిన్న బందోబస్తు విధుల్లో ఉన్న పోలీసులపై కొందరు దుండగులు రాళ్లతో దాడి చేయడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అదే సమయంలో రాష్ట్ర మంత్రి వివేక్ వెంకట స్వామి వాహనంపై కూడా దాడి జరిగినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనలో పోలీస్ కానిస్టేబుల్ రాకేశ్ తీవ్రంగా గాయపడి, అతనిని అత్యవసర చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించినట్లు అధికారులు వెల్లడించారు. కేసు నమోదు చేసిన పోలీసులు పలు సెక్షన్ల కింద దర్యాప్తు చేపట్టగా, నిందితులుగా గుర్తించిన మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్, మూల రాజిరెడ్డి, అనిల్, రామిడి లక్ష్మీకాంత్‌లను ఈరోజు అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసుల్లో మిగిలిన నిందితులను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చర్యలు కొనసాగిస్తున్నామని రామగుండం పోలీస్ కమిషనరేట్ అధికారులు తెలిపారు. త్వరలోనే మిగిలిన నిందితులను కూడా అరెస్ట్ చేస్తామని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో శాంతిభద్రతలు భంగం కలిగించే చర్యలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

## బద్వేల్‌లో విషాదం.. సగిలేరులో పడి వృద్ధుడు జలసమాధి



బద్వేల్ మండలం గొడుగునూరులో సగిలేరు నది సమీపంలో జంగయ్య మల్లారెడ్డి కాలు జారి లోతైన నీటిలో పడిపోవడంతో ప్రాణాలు కోల్పోయారు... బద్వేల్ మండలం గొడుగునూరు విషాద ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన బైసాని పెద్ద జంగయ్య మల్లారెడ్డి (80) బుధవారం ఉదయం సగిలేరు నది సమీపం లో కాలు జారి లోతైన నీటిలో పడిపోవడంతో ప్రాణాలు కోల్పోయారు. కాలకృత్యాల కోసం నది వద్దకు వెళ్లిన ఆయన, ఒడ్డున నడుస్తుండగా ఒక్కసారిగా జారి నీటి ప్రవాహంలో చిక్కుకున్నారు. వయస్సు పైబడటంతో ఈత కొట్టలేకపోయిన మల్లారెడ్డి అక్కడికక్కడే జలసమాధి అయినట్లు పోలీసులు తెలిపారు. మల్లారెడ్డి కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతూ స్థానికులతో కలిసి సగిలేరు పరిసరాల్లో గాలింపు ప్రారంభించారు. అనంతరం సమాచారాన్ని పోలీసులకు, అగ్నిమాపక శాఖకు చేరవేయగా ఫైర్ సిబ్బంది, స్థానిక ఈతగాళ్లు రంగంలోకి దిగారు. సుమారు మూడు గంటల పాటు సాగిన గాలింపు చర్యల అనంతరం ఉదయం 11:25 గంటలకు మల్లారెడ్డి మృతదేహాన్ని నదిలో నుంచి వెలికితీశారు. శవాన్ని ఒడ్డుకు తీసుకురాగానే కుమారులు రామసుబ్బారెడ్డి, వీరారెడ్డి సహా కుటుంబ సభ్యుల రోదనలు గ్రామాన్ని కలచివేశాయి. కష్టపడి కుటుంబాన్ని పోషించి గ్రామంలో గౌరవప్రదంగా జీవించిన పెద్దాయన ఇలా ఆకస్మికంగా మృతి చెందడం కుటుంబానికి తీరని లోటుగా మారింది. ప్రస్తుతానికి వాగులు, చెరువుల వద్ద నీటి నిల్వలు అధికంగా ఉన్న నేపథ్యంలో వృద్ధులు, చిన్నపిల్లలు అటువైపు వెళ్లకుండా జాగ్రత్త వహించాలని

## న్యాయవాదుల నిరసనలకు డివైఎఫ్ఐ సంపూర్ణ మద్దతు...



గోదావరిఖని//ఫిబ్రవరి 18(ఆకాంక్ష) : పెద్దపల్లి జిల్లా గోదావరిఖని పట్టణంలో న్యాయవాదులపై జరిగిన ఘటనను తీవ్రంగా ఖండిస్తూ, గోదావరిఖని బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న నిరసన కార్యక్రమాలకు భారత ప్రజాతంత్ర యువజన సమైక్య (డివైఎఫ్ఐ) పెద్దపల్లి జిల్లా కమిటీ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. ఈ మేరకు జిల్లా ప్రధాన కార్యదర్శి కొంటు సాగర్ విడుదల చేసిన ప్రకటనలో వివరించారు.గోదావరిఖని వన్ టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి న్యాయవాదుల పట్ల అనుచితంగా ప్రవర్తించారని ఆరోపిస్తూ, గత ఆరు రోజులుగా బార్ అసోసియేషన్ చేపట్టిన ఆందోళనలకు యువజన సంఘం పూర్తి మద్దతు తెలుపుతున్నట్లు తెలిపారు. ఈనెల 10వ తేదీన యువ న్యాయవాది మార్కపురి తిలక్ తన వృత్తి సంబంధిత పనులు ముగించుకొని ఇంటికి వెళ్తున్న సమయంలో సీఐతో పాటు అతని గన్ మెన్ అనుచితంగా ప్రవర్తించడమే కాకుండా, న్యాయవాదిపై చేయి చేసుకోవడానికి ప్రయత్నించడం తీవ్రంగా ఖండనీయమని పేర్కొన్నారు. పోలీసు శాఖకు ఫిర్యాదులు వచ్చినపుడు చట్టపరమైన విధానాల ప్రకారం సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాల్సి ఉండగా, దురుసుగా ప్రవర్తించడం వల్ల ప్రజల్లో పోలీసులపై నమ్మకం దెబ్బతింటుందని కొంటు సాగర్ అన్నారు.సమాజంలో యువత ఉద్యోగాల వైపు అడుగులు వేస్తున్న తరుణంలో, ప్రజలకు న్యాయ సేవలు అందించేందుకు కట్టుబడి పనిచేస్తున్న న్యాయవాదుల పట్ల ఇలాంటి ప్రవర్తన అసంబద్ధమని అన్నారు.గతంలోనూ ఇదే అధికారిపై పలుమార్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందినా ఇప్పటి వరకు చర్యలు తీసుకోకపోవడం వల్లే ఇలాంటి ఘటనలు పునరావృతం అవుతున్నాయని ఆరోపించారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి సంబంధిత అధికారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో న్యాయవాదులు చేపట్టే ప్రత్యక్ష పోరాటాలకు యువజన సంఘం కూడా చురుకుగా మద్దతు తెలుపుతూ నిరసన కార్యక్రమాలను మరింత ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు.

## వన్ టౌన్ సీఐ, గన్‌మెన్‌కు కోర్టు నోటీసులు...

### శుక్రవారం విచారణకు హాజరు కావాలని ఆదేశాలు...



గోదావరిఖని//ఫిబ్రవరి 18(ఆకాంక్ష) : గోదావరిఖని పట్టణంలో న్యాయవాదిపై జరిగిన ఘటనపై ఉద్రిక్తత మరింత తీవ్ర రూపం దాల్చింది. ఈ ఘటనకు సంబంధించి వన్ టౌన్ సీఐతో పాటు ఆయన గన్‌మెన్‌కు కోర్టు నోటీసులు జారీ చేయడం చర్చనీయాంశమైంది. శుక్రవారం ఉదయం జరగనున్న విచారణకు ఆధారాలతో సహా తప్పని సరిగా హాజరు కావాలని కోర్టు ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం.గత 6 రోజులుగా గోదావరిఖని బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయ వాదులు విధులు బహిష్కరించి నిరసన కార్యక్రమాలు చేపడుతున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో న్యాయవాది తిలక్‌పై వన్ టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి దురుసుగా ప్రవర్తించారని, సెల్‌ఫోన్ లాక్కొని అవమానకరంగా వ్యవహరించారని ఆరోపణలు వినిపించాయి. ఈ సంఘటనపై స్పందించిన న్యాయవాదులు పోలీసు అధికారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ కోర్టు విధుల బహిష్కరణకు దిగారు.ఈ నేపథ్యంలో కోర్టు జారీ చేసిన నోటీసులు వన్ టౌన్ సీఐకి మరింత ఇబ్బందికరంగా మారాయి. అత్యుత్సాహంతో వ్యవహరించిన సీఐ చర్యలు ఇప్పుడు ఆయనను ఇరకాటంలోకి నెట్టాయనే అభిప్రాయలు వ్యక్తమౌతున్నాయి. న్యాయ వ్యవస్థ పట్ల అవమానకరంగా ప్రవర్తించిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని న్యాయవాదులు హెచ్చరిస్తున్నారు.మరోవైపు, న్యాయ వాదులు తమ నిరసనలను మరింత ఉద్ధృతం చేస్తూ శనివారం వరకు కోర్టు విధులను బహిష్కరిస్తామని స్పష్టం చేశారు. తమ డిమాండ్లు నెరవేర్చే వరకు పోరాటం కొనసాగిస్తామని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకునే వరకు వెనక్కి తగ్గబోమని వారు హెచ్చరించారు.ఈ పరిణామాలతో గోదావరిఖనిలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. శుక్రవారం జరిగే విచారణలో ఏమి తేలుతుందోనని ప్రజల్లో ఆసక్తి నెలకొంది. పోలీసులు, న్యాయవాదుల మధ్య పెరుగుతున్న ఈ వివాదం ఎటువైపు దారి తీస్తుందో వేచి చూడాల్సి ఉంది.

## కార్పొరేటర్ ను ఘనంగా సన్మానించిన రజక సంఘం...



గోదావరిఖని టౌన్,ఫిబ్రవరి 18(ఆకాంక్ష):గోదావరిఖని రజక సంఘం ఆధ్వర్యంలో బుధవారం రామగుండం కార్పొరేషన్ 7 వ డివిజన్ కార్పొరేటర్ గా గెలిచినా వేగోలపు రమాదేవి, శ్రీనివాస్ గౌడ్ లను ఘనంగా సన్మానించడం జరిగింది.ఈ కార్యక్రమం లో మామిడి సతీష్,ఇజగిరి కొమురక్క, వెదిరి కొండయ్య,కొలిపాక స్వరూప, నడిగట్టు పోచం పాలడుగుల శ్రీను,శంకరయ్య రామడుగు రాములు, వైనాల సతీష్,కట్కూరు మహేందర్, ఐబీ కాలనీ,బాపూజీ నగర్, సిఎస్పి కాలనీ,గాంధీ నగర్,రజకులు అధికా సంఖ్యలో పాల్గొన్నారు.

## మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబుతో

## మంథని మున్సిపల్ నూతన కార్యవర్గం భేటీ...



మంథనిరూరల్//ఫిబ్రవరి 18(ఆకాంక్ష) : మంథని మున్సిపాలిటీకి తాజాగా ఎన్నికైన నూతన పురపాలక కార్యవర్గ సభ్యులు హైదరాబాద్‌లోని సెక్రటరేట్‌లో రాష్ట్ర ఐటీ మరియు పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంథని పట్టణ అభివృద్ధికి సంబంధించి పలు కీలక అంశాలపై చర్చించారు.మున్సిపల్ పరిధిలో మౌలిక వసతుల విస్తరణ, రహదారుల అభివృద్ధి, తాగునీటి సరఫరా పేరుగుదల, పారిశుద్ధ్య కార్యక్రమాల బలోపేతం, పార్కులు మరియు ప్రజా సదుపాయాల అభివృద్ధి వంటి అంశాలను మంత్రివర్యుల దృష్టికి తీసుకువచ్చారు. పట్టణంలో ఐటీ మరియు చిన్న పరిశ్రమల అవకాశాలను విస్తరించేందుకు సహకారం అందించాలని కార్యవర్గం కోరింది.మంత్రి శ్రీధర్ బాబు ఈ సందర్భంగా మాట్లాడుతూ మంథని పట్టణాన్ని సమగ్ర అభివృద్ధి దిశగా తీసుకెళ్లేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. స్థానిక అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులకు ప్రాధాన్యం ఇస్తామని, అవసరమైన నిధులు, పరిపాలనా సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.ఈ భేటీలో మంథని మున్సిపల్ నూతన కార్యవర్గ అధ్యక్షులు, కౌన్సిలర్లు, పార్టీ ప్రతినిధులు పాల్గొన్నారు. కార్యక్రమం స్నేహపూర్వక వాతావరణంలో జరిగింది.

## ఈ నెల 25న ఉచిత కంటి ఆపరేషన్ శిబిరం...

### ప్రజలు వినియోగించుకోవాలని అధికారుల పిలుపు...

నాగర్ కర్నూల్//ఫిబ్రవరి 18(ఆకాంక్ష) : నాగర్ కర్నూలు జిల్లా కేంద్రంలో ఈ నెల 25న ఉచిత కంటి చికిత్స మరియు కంటి ఆపరేషన్ శిబిరం నిర్వహించనున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ మరియు జిల్లా అందత్వ నియంత్రణ సంస్థ అధికారులు వెల్లడించారు. బుధవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పాత కలెక్టరేట్ భవనంలోని గది నెంబర్ 102లో ఈ శిబిరం నిర్వహించబడనుంది.జిల్లా ఆప్తాలమిక్ అధికారి కొత్ర బాలాజీ మాట్లాడుతూ, శిబిరానికి వచ్చే రోగులకు ప్రాథమిక కంటి పరీక్షలతో పాటు ప్రత్యేక కంటి పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. శిబిరంలో పరీక్షల అనంతరం అవసరమైన వారికి, ముఖ్యంగా క్యాటరాక్ట్ సమస్యతో బాధపడుతున్న వారికి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయించేందుకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఈ ఆపరేషన్లు మహబూబ్ నగర్ జిల్లా ఏనుగొండలోని లయన్ రామ్ రెడ్డి కంటి ఆసుపత్రి లో నిర్వహించబడతాయని చెప్పారు. శిబిరానికి హాజరయ్యే రోగులను ప్రత్యేక అంబులెన్స్ ద్వారా ఏనుగొండకు తరలించి, అక్కడ చికిత్స చేయించనున్నట్లు వివరించారు. శిబిరానికి ముందుగా రోగులు బీపీ, షుగర్ పరీక్షలు చేయించుకొని వాటి రిపోర్టులు వెంట తెచ్చుకోవాలని సూచించారు.ఈ ప్రాంతానికి చెందిన రోగులు తమ ఆధార్ కార్డు, రేషన్ కార్డు, ఓటర్ కార్డు లేదా ఇతర గుర్తింపు కార్డు జిరాక్స్ ప్రతులు, ఫోన్ నెంబర్ వంటి వివరాలను వెంట తీసుకు రావాలని అధికారులు తెలిపారు.ఉచిత కంటి చికిత్స శిబిరాన్ని ఎక్కువ మంది ప్రజలు వినియోగించుకోవాలని కోరుతూ, మరిన్ని వివరాల కోసం 9440876556, 7386940480 నంబర్లలో సంప్రదించాలని అధికారులు సూచించారు.

## న్యాయ వ్యవస్థనే కించపరిచే విధంగా వ్యవహరిస్తున్న సీఐ ఇంద్రసేనారెడ్డి...

### సీఐని సస్పెండ్ చేసే వరకు న్యాయవాదుల నిరసన పోరాటాన్ని కొనసాగిస్తాం...

### ఐదు రోజులుగా సీఐ తీరుపై విధులు బహిష్కరించి నిరసన తెలుపుతున్న న్యాయవాదులు...

### పోలీసు ఉన్నతాధికారులకు సీఐపై ఫిర్యాదు చేసిన చర్యలు శూన్యమని న్యాయవాదుల ఆగ్రహం...





గోదావరిఖని//ఫిబ్రవరి 18(ఆకాంక్ష) : న్యాయాన్ని పరిరక్షించే బాధ్యత వహించే న్యాయవాదుల పట్ల గోదావరిఖని వన్ టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి వ్యవహరించిన తీరు తీవ్ర వివాదాస్పదంగా మారింది. గతంలో కూడా పలువురు న్యాయవాదుల పట్ల ఇదే తరహాలో దురుసుగా ప్రవర్తించి క్షమాపణలు చెప్పిన ఘటనలు ఉన్నప్పటికీ, తన ప్రవర్తనలో మార్పు రాకపోవడం పట్ల న్యాయవాద వర్గాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ప్రజా స్వామ్యంలో నాలుగో స్తంభంగా పిలువబడే నాలుగు రంగాలకు చెందిన వారితో మర్యాదపూర్వకంగా వ్యవహరించాల్సిన బాధ్యత ఉన్నప్పటికీ, సదరు సీఐ మాత్రం ఎవరినీ లెక్కచేయకుండా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. న్యాయవాదులకు గౌరవం ఇవ్వకపోవడం, మీడియా ప్రతినిధులకు విలువ ఇవ్వకపోవడం, సొంత సిబ్బందిపై కూడా దురుసుతనంతో ప్రవర్తించడం వంటి ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల జరిగిన న్యాయ వాదుల ఘటనలో సీఐ అనుచితంగా మాట్లాడినట్లు సోషల్ మీడియలో వీడియోలు ప్రచారం కావడం వివాదానికి దారి తీస్తున్నాయి.దీనిపై బార్ అసోసియేషన్ సభ్యులు తీవ్రంగా స్పందించారు. న్యాయవాదుల పట్ల అవమానకరంగా ప్రవర్తించడం అంగీకారయోగ్యం కాదని, పోలీస్ శాఖపై ప్రజల నమ్మకాన్ని దెబ్బతీసేలా ఇటువంటి వ్యవహారాలు ఉండకూడదని వారు హెచ్చరించారు. గతంలో జరిగిన ఇలాంటి సంఘటనలపై క్షమాపణలు చెప్పినప్పటికీ, తన తీరు మార్చు కోకుండా మళ్లీ మళ్లీ అదే విధంగా ప్రవర్తించడం విచారకరమని న్యాయవాదులు ఆగ్రహం వ్యక్తం చేశారు.గోదావరిఖనిలో న్యాయవాదిపై పోలీసు అధికారి దురుసు ప్రవర్తన, దాడి ఆరోపణలు ఉద్రిక్తతకు దారి తీసాయి. ఈ నెల 10వ తేదీన కోర్టు విధులు ముగించుకుని ఇంటికి వెళ్తున్న న్యాయవాది తిలక్‌పై వన్ టౌన్ సీఐ ఇంద్రసేనా రెడ్డి, గన్‌మెన్ ప్రవీణ్ దాడి చేశారనే ఆరోపణలపై న్యాయవాదుల సంఘం తీవ్ర నిరసన వ్యక్తం చేస్తోంది. బాధితుడు తిలక్ వివరాల ప్రకారం, గోదావరిఖని ఎల్.బి నగర్ ప్రాంతంలో తన ద్విచక్ర వాహనాన్ని ఆపి సీఐ తన సెల్‌ఫోన్‌ను లాక్కొని అసభ్యకరంగా దూషించారని తెలిపారు. తాను న్యాయవాది అని చెప్పినా పట్టించు కోకుండా సీఐ, గన్‌మెన్ కలిసి తనపై దాడి చేశారని ఆరోపించారు. ఒక కేసుకు సంబందించి తన క్లయింట్ ఇచ్చిన రూ.47,500 నగదును కూడా జేబులో నుంచి తీసుకొని, తన సెల్‌ఫోన్ ద్వారా కొంతమందికి ఫోన్ చేసి డబ్బులు పంచుతున్నామని సీఐ మాట్లాడారని తిలక్ మీడియాకు వెల్లడించారు.ఈ ఘటనపై తిలక్ కోర్టులో ప్రైవేట్ పిటిషన్ దాఖలు చేయగా, బుధవారం ఆయన స్టేట్‌మెంట్‌ను కోర్టు రికార్డు చేసినట్లు సమాచారం. తదుపరి విచారణలో భాగంగా శుక్రవారం సీఐ ఇంద్రసేనా రెడ్డి, గన్‌మెన్ ప్రవీణ్‌లకు కోర్టుకు హాజరు కావాలని నోటీసులు జారీ చేసే అవకాశం ఉందని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. అలాగే ఈ ఘటనకు సంబంధించి ఫ్లయింగ్ స్క్వాడ్ కూడా విచారణకు పిలిచే అవకాశం ఉందని సమాచారం.ఇదిలా ఉండగా, తిలక్‌కు మద్దతుగా గోదావరిఖని బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు ఈ నెల 11వ తేదీ నుంచి విధులు బహిష్కరించి నిరసనలు కొనసాగిస్తున్నారు. ఐదో రోజుకు చేరుకున్న ఈ నిరసనల్లో న్యాయవాదులు భారీగా పాల్గొంటూ సీఐ తీరును ఖండిస్తున్నారు. సీఐ ఇంద్రసేనా రెడ్డి, గన్‌మెన్ ప్రవీణ్‌లపై కఠిన చర్యలు తీసుకోవాలని, వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తున్నారు.ఈ ఘటనపై రామగుండం పోలీస్ కమిషనర్‌కు కూడా బార్ అసోసియేషన్ తరఫున ఫిర్యాదు చేసినట్లు సంఘం అధ్యక్షుడు, కార్యదర్శులు తెలిపారు. అయితే ఇప్పటివరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయవాదుల గౌరవాన్ని కాపాడేందుకు, పోలీసుల దురుసు వైఖరిని అరికట్టేందుకు ఈ పోరాటాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు.ఈ ఘటనతో గోదావరిఖని ప్రాంతంలో న్యాయవాదులు, పోలీసులు మధ్య వివాదం నెలకొంది. కేసు విచారణ, కోర్టు చర్యలపై అందరి దృష్టి నెలకొంది. తదుపరి పరిణామాలు ఎలా ఉంటాయన్నది ఆసక్తికరంగా మారింది.

## కనీస సౌకర్యాలు కల్పించడంలో యాజమాన్యం విఫలం...

### కార్మికుల భద్రత, సంక్షేమంపై నిర్లక్ష్యం అంగీకారం కాదు...

### సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తుమ్మల రాజారెడ్డి






గోదావరిఖని//ఫిబ్రవరి 18(ఆకాంక్ష) : గని కార్మికులకు కనీస సౌకర్యాలు కల్పించడంలో యాజమాన్యం పూర్తిగా విఫలమైందని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తుమ్మల రాజారెడ్డి తీవ్రంగా ఆక్షేపించారు. బుధవారం ఉదయం గోదావరిఖని పరిధిలోని జీడీకే11 ఇంక్లైన్ వద్ద నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గని పరిసర ప్రాంతాల్లో పరిశుభ్రత, భద్రత, కార్మికుల సంక్షేమం వంటి ప్రాథమిక అంశాలపై గత రెండు నెలలుగా పలుమార్లు అధికారులతో చర్చలు జరిపినప్పటికీ ఇప్పటివరకు ఒక్క సమస్యకు కూడా పరిష్కారం చూపలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.ఈసమావేశానికి గని ఫిట్ కార్యదర్శి జంగపల్లి మల్లేష్ అధ్యక్షత వహించారు. కార్మికులు భోజనం చేస్తున్న సమయంలో కోతులు, కుక్కల బెడదతో తీవ్ర భయాందోళనలకు గురవుతున్న పరిస్థితి నెలకొన్నదని, గని పైభాగంలోనే ఇలాంటి దుస్థితి ఉంటే అండర్‌గ్రౌండ్‌లో పరిస్థితులు మరింత దారుణంగా ఉన్నాయని కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా ఎల్‌హెచ్‌డీ సెక్షన్‌లో సరైన గాలి సరఫరా లేకపోవడంతో కార్మికులు ఆరోగ్య సమస్యలకు గురవుతున్నారని తెలిపారు.మహిళా ఉద్యోగస్తులకు కనీస సౌకర్యాలైన క్రచ్, రెస్ట్‌రూములు, అండర్‌గ్రౌండ్ వాష్‌రూములు ఏర్పాటు చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. పని ప్రదేశాలు కార్మికులకు అనుకూలంగా ఉంటేనే అధిక ఉత్పత్తి సాధ్యమవుతుందని, ఆధునిక టెక్నాలజీతో కంటిన్యూస్ మైనర్లు, ఎల్‌హెచ్‌డీ వాహనాల ద్వారా అధిక బొగ్గు ఉత్పత్తి తీస్తున్నప్పటికీ కార్మికుల భద్రతను యాజమాన్యం పట్టించు కోవడం లేదని తీవ్ర విమర్శలు చేశారు. ఉద్యోగులను బెదిరింపులకు గురిచేస్తూ రక్షణ చర్యలను గాలికి వదిలేయడం సరికాదని హెచ్చరించారు.గనిలో నెలకొన్న స్థానిక సమస్యలపై 21 డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కార్మికులందరి సంతకాలతో సేకరించి భారీ ర్యాలీగా వెళ్లి గని మేనేజర్‌కు అందజేశారు. సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే గనిపై టెంట్ వేసి కార్మికులతో కలిసి పెద్ద ఎత్తున పోరాటానికి దిగుతామని తుమ్మల రాజారెడ్డి స్పష్టం చేశారు. కార్మికుల సంక్షేమం, భద్రతపై అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు, కార్మిక సంఘ ప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ముఖ్యంగా ఆర్జీవన్ గౌరవాధ్యక్షులు ఆరెపల్లి రాజమౌళి, అధ్యక్షులు వంగల శివరాం రెడ్డి, కార్యదర్శి మెండే శ్రీనివాస్, జాయింట్ సెక్రటరీ జెల్ల గజేందర్, నాయకులు బుగ్గారం శ్రీనివాసరావు, అనబోయిన శంకర్, గుగులోత్ రామకృష్ణ, అరికెళ్ల నవీన్ కుమార్, రాజేందర్ రెడ్డి, పోలేటి నరేష్, ముల్కల శ్రీకాంత్, సిహెచ్ దేవేందర్, సిహెచ్ హరీష్, మునుకుంట్ల రామన్న, మహేందర్ రాజు, వెంకటేష్ రెడ్డి, కొమ్ము రమేష్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలపై ఆర్‌టీఐ కమిషనర్లతో చర్చలు...

### నేషనల్ హ్యూమన్ అండ్ జస్టిస్ మూమెంట్ ఆధ్వర్యంలో కీలక సమావేశం...



గోదావరిఖని టౌన్, ఫిబ్రవరి 18(ఆకాంక్ష) : ప్రజా సమస్యల పరిష్కారం కోసం సమాచార హక్కు చట్టాన్ని సమర్థంగా వినియోగించాల్సిన అవసరాన్ని తెలంగాణ రాష్ట్ర సమాచార హక్కు కమిషనర్లు మరోసారి స్పష్టం చేశారు. నేషనల్ హ్యూమన్ అండ్ జస్టిస్ మూమెంట్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు వడ్లకొండ మహేందర్ గౌడ్ ఆధ్వర్యంలో గోదావరిఖని పట్టణంలో ఆర్‌టీఐ కమిషనర్లతో కీలక సమావేశం నిర్వహించబడింది.ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర సమాచార హక్కు కమిషన్ కమిషనర్లు పివి శ్రీనివాస రావు, దేశాల భూపాల్, మొహసిన్ పర్వీన్, బోరెడ్డి అయోధ్య రెడ్డి సింగరేణి మైనింగ్ ప్రాంతాన్ని సందర్శించేందుకు వచ్చిన సందర్భంలో, సుందిళ్ల లక్ష్మీనరసింహ స్వామి దేవాలయం సమీపంలో మహేందర్ గౌడ్ వారిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. అనంతరం జరిగిన సమావేశంలో ప్రజా సమస్యలపై, ముఖ్యంగా రామగుండం పారిశ్రామిక ప్రాంతంలోని పరిశ్రమలు, విద్యాసంస్థలు, కార్పొరేషన్ సంబంధిత అంశాలపై దాఖలవుతున్న ఆర్‌టీఐ దరఖాస్తుల స్థితిగతులపై విస్తృతంగా చర్చించారు.ఈ సందర్భంగా మహేందర్ గౌడ్ కమిషనర్లకు “మన హక్కు” డైరీలను అందజేశారు. ప్రజలకు అవసరమైన సమాచారం అందించడంలో కొంతమంది అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, దరఖాస్తులకు సమయానికి స్పందించకపోవడం వల్ల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన కమిషనర్ల దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన కమిషనర్లు, ఆర్‌టీఐ చట్టం ప్రకారం సమాచారాన్ని అందించడంలో విఫలమైతే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ప్రజల హక్కుల పరిరక్షణలో సమాచార హక్కు చట్టం కీలక పాత్ర పోషిస్తుందని, ప్రభుత్వ వ్యవస్థ పారదర్శకంగా పనిచేయాలంటే ప్రతి పౌరుడు తన హక్కులను తెలుసుకుని వినియోగించుకోవాలని కమిషనర్లు సూచించారు. పారిశ్రామిక ప్రాంతాల్లో పర్యావరణం, కార్మిక సంక్షేమం, పౌరసౌకర్యాలపై వచ్చే ఫిర్యాదులను సమగ్రంగా పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో సమాచార హక్కు చట్టం రాష్ట్ర కార్యదర్శి కండె సాగర్, ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర నాయకులు దుర్గాప్రసాద్, విజయ గాంధీతో పాటు స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ప్రజల సమస్యల పరిష్కారానికి ఆర్‌టీఐ చట్టాన్ని సాధనంగా ఉపయోగించుకోవాలని సమావేశంలో పాల్గొన్న ప్రతినిధులు పిలుపునిచ్చారు.

## భౌతికరసాయన శాస్త్ర టాలెంట్ టెస్ట్ నిర్వహణ...

### పాల్గొన్న మండలంలోని ఎనిమిది పాఠశాలల విద్యార్థులు...

### ప్రతిభ కనబరిచిన ముగ్గురు జిల్లా స్థాయికి ఎంపిక..



పాపన్నపేట//ఫిబ్రవరి 18(ఆకాంక్ష) : మెదక్ జిల్లా పాపన్నపేట మండల స్థాయిలో విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచనను పెంపొందించేందుకు నిర్వహించిన భౌతికరసాయన శాస్త్ర టాలెంట్ టెస్ట్ విజయవంతంగా జరిగింది. ఫిజికల్ సైన్స్ ఫోరం తెలంగాణ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పాపన్నపేటలో బుధవారం ఈ పోటీ పరీక్షలు నిర్వహించారు.ఈ సందర్భంగా స్థానిక ప్రధానోపాధ్యాయులు మహేశ్వర్ మాట్లాడుతూ, ఇటువంటి పోటీ పరీక్షలు విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడమే కాకుండా ఆరోగ్యకరమైన పోటీ భావాన్ని పెంచుతాయని తెలిపారు. మండల పరిధిలోని ఎనిమిది ఉన్నత పాఠశాలల నుండి వచ్చిన విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు.పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థుల్లో జడ్పిహెచ్ఎస్ కొడపాకకు చెందిన అశ్రుత్ ప్రథమ స్థానం సాధించగా, జెడ్పిహెచ్ఎస్ నాగసన్‌పల్లికి చెందిన చి. ఎలందర్ ద్వితీయ స్థానం, అదే పాఠశాలకు చెందిన పి. ఉదయ్ కిరణ్ తృతీయ స్థానం సాధించారు. వీరు జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు.ఈ కార్యక్రమంలో అంజా గౌడ్, వెంకటేశం, నాగరాజు, వివిధ పాఠశాలల భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులు నర్సింలు, అశోక్ కుమార్, నాగేశ్వరరావు, శివశంకర్, ప్రవీణ్ కుమార్,యాదయ్య, వేణుగోపాల్ రెడ్డి, నవీన్, శ్రీనివాస్, బాలరాజు తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## రాష్ట్ర స్థాయి సీఎం కప్‌కు గీతాంజలి విద్యార్థుల ఎంపిక...




నాగర్ కర్నూల్/ఫిబ్రవరి 18(ఆకాంక్ష) : నాగర్ కర్నూల్ పట్టణానికి చెందిన గీతాంజలి హై స్కూల్ విద్యార్థులు క్రీడారంగంలో తమ ప్రతిభను మరోసారి చాటుకున్నారు. ఇటీవల వివిధ జిల్లాల్లో నిర్వహించిన జిల్లా స్థాయి సీఎం కప్ ఖో ఖో పోటీలలో ఈ పాఠశాల విద్యార్థులు అద్భుత ప్రదర్శన కనబరిచి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు.బాలుర విభాగంలో 9వ తరగతి విద్యార్థులు బాలవర్ధన్, యశ్వంత్, రవీందర్ రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించగా, బాలికల విభాగంలో 8వ తరగతి విద్యార్థినులు శరణ్య, ప్రణతి ఎంపికయ్యారు. వీరు ఈనెల 20 నుంచి 23 వరకు నల్గొండ జిల్లాలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి సీఎం కప్ ఖో ఖో పోటీలలో పాల్గొననున్నారు.ఈ సందర్భంగా పాఠశాల పీఈటీ కృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ, కృషి, పట్టుదలతో సాధించిన విజయమిదని పేర్కొన్నారు. గీతాంజలి హై స్కూల్ ప్రిన్సిపాల్ రాయ్ జోషెఫ్ ఎంపికైన విద్యార్థులను అభినందించి వారికి బహుమతులు అందజేశారు. విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో కూడా ప్రతిభ చూపించి పాఠశాల పేరు మరింత ఎత్తుకు తీసుకెళ్లాలని ఆకాంక్షించారు.ఈ విజయంతో గీతాంజలి హై స్కూల్‌కు చెందిన ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

## కార్పొరేట్ కళాశాలకు
## దీటుగా ప్రభుత్వ కళాశాల-ప్రిన్సిపాల్ (ఎఫ్ఏసీ) ఉష...





మంథని//ఫిబ్రవరి 18 ఆకాంక్ష : మంథని పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో బుధవారం జరిగిన వార్షికోత్సవ వేడుకల్లో ప్రిన్సిపాల్ (ఎఫ్ఏసీ) ఉష మాట్లాడుతూ విద్యార్థులు నిరంతర సాధన ద్వారానే విజయం సాధించడం సాధ్యం అవుతుందని అన్నారు. వచ్చే వార్షిక పరీక్షల్లో మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావాలని కోరారు. కార్పొరేట్ కళాశాలకు దీటుగా ప్రభుత్వ కళాశాలలో విద్యాబోధన కొనసాగుతుందన్నారు. డిజిటల్ క్లాస్ రూమ్ లో విశాలమైన తరగతి గదులతో పాటు అన్ని రకాల సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయన్నారు. రిటైర్డ్ ప్రిన్సిపల్ అంబరీష్ మాట్లాడుతూ స్థానికంగా ఉన్న ఈ కళాశాలల్లో తల్లిదండ్రులు తమ పిల్లలను చేర్చి ప్రయోజనం పొందాలన్నారు. ఏ ఐ కాలంలో మారుమూల ప్రాంతాల పిల్లలు వెనకపడకూడదు అనే ఉద్దేశంతో దాతల సహకారంతో ఈ కళాశాలలో కంప్యూటర్లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. రిటైర్డ్ ప్రిన్సిపల్ సయ్యద్ సలీం మాట్లాడుతూ తాను ఇక్కడే పని చేసి పదవీ విరమణ పొందానని, ఈ కళాశాల గుర్తులు ఎన్నడూ మరచిపోలేనివి అన్నారు. అనంతరం అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు బహుమతులు అందజేశారు. విద్యార్థులు చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా అలరించాయి. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు ఝాన్సీ, శ్రీధర్ రావు, తిరుపతి, తిరుమల్, శశాంక్, నగేష్, శ్రీదేవి, ఎల్ ఆర్ కే రెడ్డి, సబిత, మౌనిక, సురేష్, దీపారాణి, సిబ్బంది బియ్యబాని, రాజయ్య, అనసూయ, ప్రభాకర్ పాల్గొన్నారు

## జడ్చర్లలో ఇందిరమ్మ ఇళ్ల ఘన ప్రారంభం...
### తండాల అభివృద్ధికి మౌలిక సదుపాయాల కల్పనకు కట్టుబాటు...
### ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి...



జడ్చర్ల//ఫిబ్రవరి 18 ఆకాంక్ష : రాజాపూర్ మండల పరిధిలోని అంజమ్మగడ్డ తండా మరియు హేమ్లా తండా (సింగమ్మగూడ)లో రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లను బుధవారం జడ్చర్ల శాసనసభ్యులు శ్రీ జనంపల్లి అనిరుధ్ రెడ్డి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో సాగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి మాట్లాడుతూ, పేదల గృహ అవసరాలను తీర్చడం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రతి అర్హుడికి గౌరవప్రదమైన నివాసం కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అనేక కుటుంబాలు సొంతింటి కలను సాకారం చేసుకున్నాయని, పేదల జీవన ప్రమాణాలు మెరుగుపడుతున్నాయని ఆయన తెలిపారు. తండాల అభివృద్ధికి అవసరమైన రహదారులు, తాగునీటి సరఫరా, విద్యుత్ వంటి మౌలిక సదుపాయాలను దశలవారీగా అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని వెంటనే పరిష్కరించే విధంగా పని చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు, గ్రామ పెద్దలు, లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



## విద్యార్థి శ్రీవర్ధన్‌కు రాష్ట్రస్థాయి
## దివ్యాంగుల క్రీడల్లో కాంస్య పతకం...



నాగర్‌కర్నూల్ టౌన్//ఫిబ్రవరి 18 ఆకాంక్ష : రాష్ట్రస్థాయి దివ్యాంగుల క్రీడా పోటీలలో నాగర్‌కర్నూల్ జిల్లాకు చెందిన విద్యార్థి శ్రీవర్ధన్ ప్రతిభ చాటాడు. హైదరాబాద్ నగరంలోని దోమలగూడ ప్రాంతంలో బుధవారం నిర్వహించిన ఈ పోటీలలో బిజినేపల్లి మండల పరిధిలోని గుడ్లనర్వ ప్రాథమికోన్నత పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న శ్రీవర్ధన్ మేధోపరమైన వైకల్యం విభాగంలో అద్భుత ప్రదర్శన కనబరిచాడు. 50 మీటర్ల జిగ్ జాగ్ పరుగు పందెంలో వేగంగా, చాకచక్యంగా పరుగెత్తిన శ్రీవర్ధన్ తృతీయ స్థానం సాధించి కాంస్య పతకాన్ని అందుకున్నాడు. రాష్ట్రస్థాయి పోటీలలో విజయం సాధించి నాగర్‌కర్నూల్ జిల్లాకు పేరు తెచ్చినందుకు పలువురు అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర విద్యాశాఖ అధికారి జెడి వెంకట నరసమ్మ చేతుల మీదగా శ్రీవర్ధన్‌కు పతకం, ప్రశంసాపత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా విలీన విద్య సమన్వయకర్త బరిపటి వెంకటయ్యతో పాటు రాష్ట్ర విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు. దివ్యాంగ విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు ఇలాంటి క్రీడా పోటీలు ఎంతో ఉపయోగపడతాయని అధికారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విలీన విద్య ఉపాధ్యాయులు బాల నరసింహ, చంద్రశేఖర్, వెంకటయ్యతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. శ్రీవర్ధన్ సాధించిన ఈ విజయం పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయులు, భాస్కర్ రెడ్డి, ఉపాధ్యాయులు రంజిత్ మరియు గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తూ భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని మనస్ఫూర్తిగా కోరుకున్నారు.

## కొత్తూరులో ట్రాక్టర్ చోరీ....
### రైతు ఫిర్యాదుతో కేసు నమోదు...



జడ్చర్ల//ఫిబ్రవరి 18 ఆకాంక్ష : మండలంలోని కొత్తూరు గ్రామంలో ట్రాక్టర్ చోరీ ఘటన చోటుచేసుకుని స్థానికంగా కలకలం రేపింది. గ్రామానికి చెందిన రైతు జంగాల శ్రీను తన వ్యవసాయ పనులు ముగించుకుని ప్రతి రోజు మాదిరిగానే పొలం వద్ద ట్రాక్టర్‌ను ఉంచి ఇంటికి వెళ్లాడు. అయితే బుధవారం ఉదయం తిరిగి పొలం వద్దకు వెళ్లి చూసేసరికి ట్రాక్టర్ కనిపించకపోవడంతో అతడు షాక్‌కు గురయ్యాడు. రాత్రి వేళలో గుర్తు తెలియని దుండగులు ట్రాక్టర్‌ను ఎత్తుకెళ్లినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఘటనపై జంగాల శ్రీను స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. సంఘటన స్థలాన్ని పరిశీలించిన పోలీసులు గ్రామ పరిసరాల్లో ఉన్న సీసీ కెమెరా ఫుటేజీలను సేకరించి పరిశీలిస్తున్నారు. అనుమానితుల కదలికలపై దృష్టి సారించిన పోలీసులు త్వరలోనే నిందితులను పట్టుకుంటామని తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై శివ నాగేశ్వర్ నాయుడు మాట్లాడుతూ, రైతుల ఆస్తులపై జరుగుతున్న చోరీలను అరికట్టేందుకు గ్రామస్తులు అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ట్రాక్టర్ చోరీ ఘటనపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి నిందితులను కఠినంగా శిక్షించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. కొత్తూరు గ్రామంలో ఇటీవల వరుసగా జరుగుతున్న చిన్న చిన్న చోరీల ఘటనలతో గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి వేళల్లో గ్రామంలో పోలీసులు గస్తీ పెంచాలని ప్రజలు కోరుతున్నారు.

## ఎగ్జిబిషన్‌లో ఎన్టిపిసి రామగుండం, తెలంగాణ మెరిసిపోయాయి...





గోదావరిఖని//ఫిబ్రవరి 18 ఆకాంక్ష : ఐపీఎస్-2026 టెక్నో గెలాక్సీ ఎగ్జిబిషన్‌లో ఎన్టిపిసి రామగుండం యూనిట్‌తో పాటు తెలంగాణ బృందం అద్భుత ప్రతిభను ప్రదర్శించి ప్రత్యేక గుర్తింపు సాధించింది. ఫిబ్రవరి 13 నుంచి 15 వరకు ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర రాజధాని రాయ్‌పూర్ లో జరిగిన ఓ & ఎం కాన్ఫరెన్స్ఇండియన్ పవర్ స్టేషన్స్ (ఐపీఎస్-2026) సందర్భంగా నిర్వహించిన టెక్నో గెలాక్సీ ఎగ్జిబిషన్‌లో ఈ బృందం పాల్గొని సాంకేతిక ప్రతిభను చాటుకుంది. "నాణ్యత మరియు విశ్వసనీయతతో థర్మల్ జనరేషన్‌ను ఆప్టిమైజ్ చేయడం" అనే ప్రధాన థీమ్‌తో జరిగిన ఈ అంతర్జాతీయ స్థాయి సమావేశంలో ఎన్టిపిసి రామగుండం ప్రతినిధులు తమ సాంకేతిక ఆవిష్కరణలను ప్రదర్శించారు. ఆర్ & టి విభాగం నుంచి మూడు మోడల్‌లు ఎంపిక కావడం విశేషంగా నిలిచింది. ఎం.జి.ఆర్ టీమ్ రూపొందించిన "అబ్సొల్యూట్ బ్లాక్ సిస్టమ్" మోడల్, ఆర్ఎస్‌టిపిఎస్ విభాగం సమర్పించిన నమూనాలు, అలాగే ఎఫ్ఎం టెస్ట్‌ప్ బృందం రూపొందించిన "బెల్ధడార్ ఎక్స్ మోడల్‌లు ప్రదర్శనలో విశేష ఆకర్షణగా నిలిచాయి. వీటిపై నిపుణుల నుంచి ప్రశంసలు వెల్లువెత్తాయి. టెక్నో గెలాక్సీ అవార్డుల విభాగంలో దక్షిణ ప్రాంతం మొదటి రన్నరప్‌గా ఎంపిక కావడం గర్వకారణమైంది. ఇది తెలంగాణ ప్రాంత సాంకేతిక నైపుణ్యం, ఆవిష్కరణల పట్ల ఉన్న నిబద్ధతను ప్రతిబింబించిందని అధికారులు తెలిపారు. ఎన్టిపిసి రామగుండం బృందం సాధించిన ఈ విజయంతో గోదావరిఖని పారిశ్రామిక ప్రాంతానికి మరింత ప్రతిష్ఠ చేకూరింది. తెలంగాణ రాష్ట్ర ప్రతినిధుల సమిష్టి కృషి ఫలితంగా దేశ స్థాయిలో గుర్తింపు రావడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# సీఐ ఇంద్రసేనారెడ్డిపై డీజీపీకి ఫిర్యాదు...

### మాజీ కార్పొరేటర్ బొడ్డు రజితపై
### దుర్భాషలాడుతూ బెదిరింపులకు పాల్పడ్డారు..
### మా మామపై ఎటువంటి కారణం లేకుండా
### సీఐ బహిరంగంగా చెంపదెబ్బ కొట్టారు...

గోదావరిఖని, ఫిబ్రవరి 18 ఆకాంక్ష : మున్సిపల్ ఎన్నికల పోలింగ్ సమయంలో పోలీసు అధికారి అధికార దుర్వినియోగం చేశారని ఆరోపిస్తూ, గోదావరిఖని వన్ టౌన్ పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేన రెడ్డి పై బాధితుడు బొడ్డు రవీందర్ తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు జరిగిన ఘటన స్థానికంగా సంచలనంగా మారింది. ఆయన తెలిపిన వివరాల ప్రకారం, ఈ నెల 11న జరిగిన మున్సిపల్ ఎన్నికల పోలింగ్ రోజున గోదావరిఖని విఠల్ నగర్ ప్రాంతంలోని తన నివాసానికి మధ్యాహ్నం సమయంలో సీఐ ఇంద్రసేన రెడ్డి పోలీసు సిబ్బందితో కలిసి వచ్చి, ఎటువంటి వారెంట్ లేకుండా అక్రమంగా ఆవరణలోకి ప్రవేశించారని రవీందర్ ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రధాన గేటును లాఠీతో బలవంతంగా కొట్టి దెబ్బతీయడంతో పాటు, గేటుకు అమర్చిన షీట్ నష్టపోయిందని, ఇంటి ముందు పార్క్ చేసిన మోటార్ సైకిల్ ఇండికేటర్ కూడా విరిగిపోయిందని తెలిపారు. ఇంటి లోపలికి ప్రవేశించిన అనంతరం సీఐ తన భార్య, మాజీ కార్పొరేటర్ బొడ్డు రజితపై దుర్భాషలాడుతూ బెదిరింపులకు పాల్పడ్డారని, ఆమె ఆర్థరైటిస్ వ్యాధితో బాధపడుతున్నప్పటికీ లాఠీతో బెదిరించి పోలింగ్ రోజున బయటకు రాకూడదని ఆదేశించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఘటనతో ఇంట్లో భయాందోళనలు నెలకొన్నాయని తెలిపారు. ఇంకా, సంఘటన సమయంలో ఇంట్లో ఉన్న తన మామపై ఎటువంటి కారణం లేకుండా సీఐ బహిరంగంగా చెంపదెబ్బ కొట్టాడని, తన భార్య ప్రశ్నించగా ఆమెపై కూడా దాడి చేయడానికి ప్రయత్నించి దుర్భాషలాడినట్లు ఆరోపించారు. ఈ ఘటన ప్రజాస్వామ్య ప్రక్రియలో జోక్యం చేసుకునే విధంగా జరిగిందని రవీందర్ పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో సీఐ ఇంద్రసేన రెడ్డి పై కఠిన చర్యలు తీసుకోవాలని, తన కుటుంబానికి రక్షణ కల్పించాలని డీజీపీని బాధితుడు కోరారు. ఘటనపై పూర్తి స్థాయి దర్యాప్తు జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కూడా డిమాండ్ చేస్తున్నారు.



Date: 18.02.2026

To
The Director General of Police (DGP),
Telangana State,
Hyderabad.

**Subject:** Complaint against misuse of police power, illegal house trespass, assault, intimidation, and interference with democratic process during Municipal Election polling by Circle Inspector Indrasena Reddy, I (ONE) Town Police Station, Godavarikhani – Request for stringent action and protection.

Respected Sir,

I, Boddu Ravinder, S/o Rajaiah, Resident of H. No. 9-3-554, Vithal Nagar, Godavarikhani, respectfully submit this complaint seeking immediate intervention against serious misconduct committed by Circle Inspector Indrasena Reddy, I (ONE) Town Police Station, Godavarikhani, on the polling day of the Municipal Elections held on 11-02-2026. I am the BRS Party Ramagundam Municipal Corporation City President, and the incident occurred at my residence situated within 100 meters of the polling station located at New Wings High School.

*On the said polling day, at around 1:00 PM, Circle Inspector Indrasena Reddy, along with police personnel, came to my residence and illegally entered the premises without any lawful authority or warrant. He forcefully struck the main gate using a lathi, causing damage to the sheet fixed on the gate. During this act, the indicator of a Unicorn motorcycle parked in front of the house was also broken due to his violent conduct.*

After forcibly entering the premises, the officer proceeded inside the house and began threatening and abusing my wife, Smt. Boddu Rajitha, former corporator. At that time, her health condition was not stable as she was suffering from arthritis and was unable to walk properly. Despite knowing her physical condition, the officer threatened her with a lathi and intimidated her, instructing her not to step outside the house during polling hours. Such conduct created fear and mental trauma within the household.

During the incident, my uncle who was present at the house was publicly slapped by the officer without any provocation. When my wife questioned the unlawful entry and harassment, the officer continued to behave aggressively, used abusive language, and attempted to assault her.

INWARD
18 FEB 2026
Telangana, Hyderabad.

1




# పట్టపగలు ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిన కాంగ్రెస్....

### మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ అరెస్ట్ అక్రమం....
### టీబీజీకేఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మదాసి రామ్మూర్తి...

గోదావరిఖని//ఫిబ్రవరి 18 ఆకాంక్ష : క్యాతనపల్లి మున్సిపల్ ఎన్నికల సందర్భంగా చోటు చేసుకున్న పరిణామాలపై తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం (టీబీజీకేఎస్) నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ అనుచరులు ప్రజాస్వామ్య విలువలను కాలరాస్తూ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలపై దాడులకు దిగారని ఆరోపించారు. మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ అరెస్ట్‌ను అక్రమంగా పేర్కొంటూ, ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. క్యాతనపల్లి మున్సిపల్ చైర్మన్ ఎన్నికలో బీఆర్ఎస్ పార్టీకి 14 మంది సభ్యుల మద్దతు ఉండగా, కేవలం 7 మంది సభ్యుల మద్దతు మాత్రమే ఉన్న కాంగ్రెస్ పార్టీ మంత్రి వివేక్ మరియు ఆయన కుమారుడు ఎంపీ వంశీకృష్ణ ఆధ్వర్యంలో పోలీసులను అడ్డుపెట్టుకొని ఎన్నికను వాయిదా వేయించడం అప్రజాస్వామిక చర్యగా అభివర్ణించారు. ప్రజా ప్రతినిధులను బెదిరించడం, కిడ్నాప్ చేసేందుకు ప్రయత్నించడం, ప్రమాణ స్వీకారం సమయంలో మహిళా సభ్యులతో అసభ్యంగా ప్రవర్తించడం వంటి ఘటనలు తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా టీబీజీకేఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మదాసి రామ్మూర్తి, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ నూనె కొమురయ్య మాట్లాడుతూ మంత్రి వివేక్‌పై గవర్నర్ వెంటనే చర్యలు తీసుకుని పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థను అవమానించే విధంగా వ్యవహరించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. అక్రమంగా అరెస్టు చేసిన మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌ను వెంటనే విడుదల చేయాలని సంఘం తరఫున డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ కోసం బీఆర్ఎస్ శ్రేణులు పోరాటం కొనసాగిస్తాయని స్పష్టం చేశారు. ఆర్జీ-1 ఉపాధ్యక్షులు వడ్డపల్లి శంకర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పత్రిక సమావేశంలో కేంద్ర నాయకులు చెల్పూరి సతీష్, జావిద్ పాషా, పోలాడి శ్రీనివాసరావు, ప్రవీణ్ కుమార్, దూట శేషగిరి, మొదుంపల్లి రాజేశం, ఉప్పులేటి తిరుపతి, కొండ్రా అంజయ్య, పల్లె సురేందర్, దిడ్డి లక్ష్మణ్, అడ్డగట్ల గోపి, కోయద మల్లేష్, నూతి రాజ్‌కుమార్, మచ్చ దేవేందర్, కళాధర్ రెడ్డి, భాస్కర్, మల్లారెడ్డి, కొప్పుల శ్రీనివాస్, ఎండి మజార్ తదితరులు పాల్గొన్నారు.




# పూణేలో సత్తా చాటిన పాపన్నపేట మండలం ఉపాధ్యాయుడు...

### జాతీయ వేదికపై కొడపాక టీచర్‌కు
### ప్రథమ బహుమతి...

మెదక్//ఫిబ్రవరి 18 ఆకాంక్ష : మెదక్ జిల్లా పాపన్నపేట మండలానికి చెందిన కొడపాక ప్రభుత్వ ఉన్నత పాఠశాల (జెడ్‌పిహెచ్ఎస్) భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడు ఆకోజు వెంకటరమణ జాతీయ స్థాయి వేదికపై తన ప్రతిభను చాటుతూ ప్రథమ బహుమతిని కైవసం చేసుకున్నారు. మహారాష్ట్ర రాష్ట్రంలోని పుణె జిల్లాలోని చోందే ఫార్మ్ వేదికగా, అగస్త్య ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిజ్ఞాస జాతీయ స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో ఆయన అగ్రస్థానాన్ని సాధించడం జిల్లాకు గర్వకారణమైంది. టీచర్స్ విభాగంలో "పీరియాడిక్ ట్రెసర్ క్వెస్ట్" పేరిట రూపొందించిన వినూత్న బోధనోపకరణాలతో పాల్గొన్న వెంకటరమణ దేశవ్యాప్తంగా నలుమూలల నుండి హాజరైన 22 మందికి పైగా ఉపాధ్యాయుల మధ్య విశేష ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు రూ.10,000 నగదు బహుమతిని నిర్వాహకులు ప్రదానం చేశారు. విద్యార్థులకు శాస్త్రీయ సూత్రాలను సులభంగా అర్థమయ్యేలా చేయాలనే లక్ష్యంతో సృజనాత్మక పద్ధతుల్లో బోధనోపకరణాలను రూపొందించడం వెంకటరమణ ప్రత్యేకతగా నిలిచింది. గత జనవరిలో జరిగిన దక్షిణ భారత స్థాయి పోటీల్లో కూడా ఆయన ప్రథమ బహుమతి సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడం విశేషం. గ్రామీణ ప్రాంతంలోని ప్రభుత్వ పాఠశాల నుంచే జాతీయ వేదికపై ప్రతిభ చాటడం ద్వారా గ్రామీణ విద్యార్థులు, ఉపాధ్యాయులకు ఆయన ఆదర్శంగా నిలిచారు. ఈ విజయంపై పాఠశాల ప్రధానోపాధ్యాయులు, జిల్లా సైన్స్ అధికారి, జిల్లా విద్యాధికారి సహా పలువురు విద్యావేత్తలు అభినందనలు తెలియజేశారు. ఆకోజు వెంకటరమణ సాధించిన ఈ ఘనతతో పాపన్నపేట మండలం, మెదక్ జిల్లా పేరు దేశవ్యాప్తంగా మోగిపోగా, గ్రామీణ విద్యా వ్యవస్థకు ఆయన విజయంతో కొత్త ఉత్సాహం నింపబడిందని విద్యావర్గాలు అభిప్రాయపడ్డాయి.



## బాధిత కుటుంబానికి సర్పంచ్ ఆర్థిక సహాయం..



జడ్చర్ల//ఫిబ్రవరి 18 ఆకాంక్ష : మిడ్జిల్ మండలం రాణిపేట్ గ్రామంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన ఘటన గ్రామాన్ని విషాదంలో ముంచేసింది. గ్రామానికి చెందిన బోయ చిన్న అంజయ్య కుమారుడు శివ (26) నిన్న జరిగిన బైక్ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయాడు. ఈ దుర్ఘటనపై గ్రామ ప్రజలు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మాధవి మల్లేష్ మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలిపారు. అంత్యక్రియల నిర్వహణ కోసం తక్షణ సహాయంగా రూ.5,000 నగదును కుటుంబానికి అందజేశారు. బాధిత కుటుంబానికి గ్రామ ప్రజలందరూ అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యుడు శ్రీకాంత్, గ్రామ పెద్దలు జగన్, మహమూద్, మల్లేష్, ఇసాక్, పాండు, పెంటయ్యతో పాటు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మృతుడి ఆత్మకు శాంతి చేకూరాలని గ్రామస్తులు ప్రార్థించారు.

## జడ్చర్లలో గ్రంథాలయం అభివృద్ధికి కృషి చేస్తా...
### చైర్‌పర్సన్ కోనేటి పుష్పలత...



జడ్చర్ల//ఫిబ్రవరి 18 ఆకాంక్ష : జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలోని బాదేపల్లి గ్రంథాలయ అభివృద్ధికి తగిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీమతి కోనేటి పుష్పలత నర్సిములు తెలిపారు. బాదేపల్లి గ్రంథాలయ శాఖ పాలకమండలి సభ్యులు బుధవారం జడ్చర్లలో ఆమెను మర్యాదపూర్వకంగా కలసి, గ్రంథాలయ భవనానికి సంబంధించిన పలు అభివృద్ధి పనులు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ, సభ్యులు సూచించిన పనులను త్వరలోనే అమలు చేసే దిశగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. గ్రంథాలయాన్ని ఆధునిక వసతులతో అభివృద్ధి చేయడానికి గౌరవ ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి సహకారంతో కృషి చేస్తామని తెలిపారు. విద్యార్థులు, పాఠకులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేలా ప్రణాళికలు రూపొందిస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ పాలకమండలి సభ్యులు, లక్ష్మీ మేడం తదితరులు పాల్గొన్నారు.

## ఐటీ శాఖ మంత్రిని కలిసిన
## రామగుండం మేయర్, డిప్యూటీ మేయర్ బృందం...



గోదావరిఖని//ఫిబ్రవరి 18 ఆకాంక్ష : రామగుండం నియోజకవర్గ అభివృద్ధి అంశాలపై చర్చించేందుకు బుధవారం హైదరాబాద్‌లో రామగుండం మున్సిపల్ ప్రజాప్రతినిధులు ఐటీ మరియు పరిశ్రమల శాఖ మంత్రి వర్యులు దుద్దిళ్ళ శ్రీధర్ బాబును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రామగుండం నియోజకవర్గ శాసనసభ్యులు ఎం ఎస్ రాజ్ ఠాకూర్ నేతృత్వంలో మున్సిపల్ మేయర్ మహంకాళి స్వామి, డిప్యూటీ మేయర్ పాతిపెల్లి ఎల్లయ్య, మున్సిపల్ శాఖ అధ్యక్షులు బొందల రాజేష్తో పాటు పలువురు కార్పొరేటర్లు పాల్గొన్నారు. రామగుండం పట్టణ అభివృద్ధి, ఐటీ రంగానికి సంబంధించిన అవకాశాలు, యువతకు ఉపాధి అవకాశాల కల్పన, మౌలిక వసతుల విస్తరణ వంటి అంశాలపై మంత్రితో విస్తృతంగా చర్చించినట్లు ప్రతినిధులు తెలిపారు. నగరంలో ఐటీ రంగాన్ని ప్రోత్సహించే విధంగా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, యువతకు శిక్షణా కేంద్రాలు ఏర్పాటు చేయాలని వారు కోరారు. మంత్రి ప్రతిపాదనలను సానుకూలంగా స్వీకరించి, ప్రభుత్వ విధానాల మేరకు అవసరమైన సహకారం అందిస్తామని హామీ ఇచ్చినట్లు నాయకులు వెల్లడించారు. రామగుండం నగరాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు మంత్రివర్యులకు కృతజ్ఞతలు తెలియజేస్తూ రామగుండం అభివృద్ధికి కలిసి పనిచేస్తామని పేర్కొన్నారు.

## అర్హులందరికీ అక్రిడేషన్ కార్డులు: కలెక్టర్ సుమిత్ కుమార్



జిల్లాలో అర్హులైన వారందరికీ అక్రిడేషన్ కార్డుల మంజూరు చేస్తామని కలెక్టర్ సుమిత్ కుమార్ చెప్పారు.. జిల్లాలో అర్హులైన వారందరికీ అక్రిడేషన్ కార్డుల మంజూరు చేస్తామని కలెక్టర్ సుమిత్ కుమార్ చెప్పారు. స్థానిక కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో బుధవారం కలెక్టర్ సుమిత్ కుమార్ అధ్యక్షతన డీఎంఏసీ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్, ఎన్ వేలాయుధం, కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం నిబంధనల మేరకు, అర్హత కలిగిన ప్రతి ఒక్క ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులకు అక్రిడేషన్ కార్డులు మంజూరు చేస్తామన్నారు. దశలవారీగా డీఎంఏసీ కమిటీ సమావేశాలు నిర్వహించి అక్రిడేషన్ కార్డులు మీడియా ప్రతినిధులకు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ మెంబర్లు ఎస్. గంగాధర్, జి రమేష్ బాబు, ఏ.బాలాజీ, లక్ష్మీపతి, హరిప్రసాద్, గోపి, పి.రాజేంద్రనాయుడు, పి. చంద్ర ప్రకాష్, జగదీష్, వై. కాళేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.